

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 252

శనివారం 27-5-2023



గర్జించిన శుబ్‌మన్ గిల్


సెంచరీతో చెలరేగిన గుజరాత్ బ్యాటర్.. ఐపీఎల్ ఫైనల్లోకి టైటాన్స్ - 13లో

RELIANCE

స్నాక్స్ వ్యాపారంలోకి రిలయన్స్

జనరల్ మిల్స్‌తో భాగస్వామ్యం..ఎఫ్‌ఎంసీజీలో కార్యకలాపాలు విస్తరణ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సెంగోల్‌పై రగడ

పార్లమెంట్ నూతన భవనంలోని లోక్‌సభ సభామందిరంలో ప్రతిష్టించనున్న సెంగోల్ (రాజదండం)పై వివాదం ముదురుతోంది.

వివరాలు 6లో ▸



పాస్‌పోర్టుకు కోర్టు ఓకే

మూడేళ్ల పాటు సాధారణ పాస్‌పోర్టు పొందడానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అనుమతినిస్తూ ఢిల్లీ కోర్టు తీర్పు చెప్పింది.

వివరాలు 6లో ▸



డ్రాగన్‌లో మరో కరోనా వేవ్

చైనాలో జూన్ చివరిలో వారానికి 6.5 కోట్ల కోవిడ్ కేసులు నమోదు కావచ్చునని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

వివరాలు 6లో ▸



జైన్‌కు మధ్యంతర బెయిల్

ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు ఆరు వారాలపాటు మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది.

వివరాలు 6లో ▸





సీఆర్డీఏ పరిధిలోని వెంకటాయపాలెం వద్ద నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

మారీచులపై నిరుపేదల విజయమిది

దేశ చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయం.. సీఆర్డీఏలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్

- ఒకేసారి 50,793 మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు
- రూ.443.71 కోట్లతో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లూ అందజేత
- ఇకపై ఇది సామాజిక, మనందరి అమరావతి
- అన్ని హక్కులతో అక్క చెల్లెమ్మలకు ఆస్తి.. జూలై 8 నుంచి ఇళ్ల నిర్మాణం
- 25 కాలనీల్లో అంగన్‌వాడీ, ప్రైమరీ స్కూల్, క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పార్కులు
- పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వొద్దని ధర్నాలు చేసే వారిని ఇక్కడే చూశాం
- నరకాసురుడినైనా నమ్మొచ్చుగాని.. నారా చంద్రబాబును మాత్రం నమ్మొద్దు
- ఎన్నికలు సమీపిస్తుంటే కొత్త మోసాలతో ముందుకొస్తారు జాగ్రత్త

సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడైనా సరే పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కావాలని ధర్నాలు చేసే వారిని చూశామని.. రాష్ట్రంలో మాత్రం పేదలకు వాటిని ఇవ్వొద్దని ధర్నాలు చేస్తున్న చంద్రబాబు ముఠాను చూస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోంటే తట్టుకోలేక గజ దొంగల ముఠా అడ్డు పడుతోందని చెప్పారు. ఈ మారీచులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. న్యాయ పోరాటం చేసిమరీ పేదలకు ఇళ్ల పట్టాలిస్తున్న చారిత్రక ఘట్టాన్ని అమరావతిలో చూస్తున్నామని తెలిపారు. ఇది మారీచులపై నిరుపేదల విజయమని, దేశ చరిత్రలోనే ఇది సువర్ణాధ్యాయమని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 50,793 మంది నిరుపేద అక్కచెల్లెమ్మలకు సీఆర్డీఏ పరిధిలో కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. దీంతోపాటు ఇక్కడ నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్ల పత్రాలను సైతం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్డీఏ పరిధిలోని వెంకటపాలెం వద్ద నిర్వహించిన

మిగతా 2వ పేజీలో ▶

> "మంగళగిరి, తాడికొండ నియోజక వర్గాల పరిధిలో 1,402 ఎకరాల్లో 25 లే అవుట్లలో 50,793 మంది నా పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు అందజేసే కార్యక్రమం వారం పాటు పండుగ వాతావరణంలో కొనసాగుతుంది. ప్రతి అక్కచెల్లెమ్మను లే అవుట్ వద్దకు తీసుకెళ్లి, అక్కడే ఇంటి పత్రాలు అందజేస్తారు. ఆ స్థలంలో ఫొటో తీసుకుని, జియో ట్యాగింగ్ కూడా పూర్తయ్యాక ఇళ్లు కట్టించే కార్యక్రమానికి బీజం పడుతుంది."
>
> -ముఖ్యమంత్రి వైఎస్ జగన్

జన సునామీ

- జనసంద్రంలా మారిన ఇళ్ల స్థలాల ప్రాంతం
- ఉదయం 8 గంటలకే నిండిపోయిన సభా ప్రాంగణం
- సీడ్ యాక్సిస్ రోడ్డుకు ఇరువైపులా వేలాది మంది లబ్ధిదారులు.. జగనన్నకు కృతజ్ఞతలంటూ ప్లకార్డులు


2లో

ప్రత్యేక సాయం వర్తింప చేయండి

- విద్య, ఆరోగ్య రంగాల్లో ఖర్చును క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావించాలి
- కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం వైఎస్ జగన్ వినతి
- తెలంగాణ బకాయిలు, రుణ పరిమితి సడలింపు అంశాలపై చర్చ
- నేడు నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి హాజరు

3లో

జగన్ పాత్ర ఉందని ప్రచారం చేయండి



- వివేకా కేసులో సీబీఐ చెప్పిన అంశాలను మీడియాలో విస్తృతంగా చెప్పాలి
- పొలిట్‌బ్యూరో సమావేశంలో నేతలకు చంద్రబాబు సూచనలు

10లో

హైకోర్టు సీజేలుగా ఇద్దరు తెలుగు వ్యక్తులు

- కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సారస వెంకట నారాయణ భట్టి
- హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజేగా జస్టిస్ మామిడాన శ్రీరామచంద్రరావు

- వివరాలు 6లో

- నాలుగేళ్ల తర్వాత..

సీబీఐ చిలుక 'కొత్త పలుకు'

వివేకా హత్య కేసులో ఎల్లో స్క్రిప్టు ప్రకారమే దర్యాప్తు

వివేకా మృతి విషయం అవినాశ్‌కు ముందే తెలుసంటూ అభియోగం



- ఆయన ఆ విషయాన్ని వైఎస్ జగన్‌కు చెప్పారంటూ దుష్ప్రచారం
- అవినాశ్ ఫోన్ ఐపీడీఆర్ డేటా పేరిట బురిడీ కొట్టించే కుట్ర..
- టీడీపీ కమిట్మెంట్ మేరకు ఓ ఉన్నతాధికారి నిర్వాకం
- ఐపీడీఆర్ సహేతుకం కాదంటున్న టెలికాం మార్గదర్శకాలు
- సునీత, నర్రెడ్డి, బీటెక్ రవి ఐపీడీఆర్ డేటా కూడా అలానే ఉందన్నది నిజం
- టీడీపీ ఇచ్చిన ఫొటోలతో కోర్టును తప్పుదోవ పట్టించేందుకు సునీత యత్నం
- టీడీపీ నిరాధార ఆరోపణలే.. అఫిడవిట్‌లో ప్రస్తావన
- 6 నెలలుగా టీడీపీ ఇదే విష ప్రచారం ఇప్పుడు సీబీఐ నోటా ఇదే మాట
- సీబీఐ తీరుపై సర్వత్రా విస్మయం

12లో

అవినాశ్ లక్ష్యంగా సీబీఐ దర్యాప్తు

- ఆయనకు ముందస్తు బెయిలివ్వండి
- ఇప్పటివరకు ఒక్క ప్రాథమిక ఆధారం కూడా చూపలేదు.. ఆధారాలు లేకుండా అరెస్టు చేసే ప్రయత్నం చేస్తోంది
- హంతకుడు దస్తగిరికేమో పూర్తి సహకారం
- అతడు సీబీఐకి పెంపుడు చిలుక
- తల్లి అనారోగ్యంతో అవినాశ్ ఆస్పత్రిలో ఉన్నారు.. అయినా సరే విచారణకు రావాలని సీబీఐ వేధిస్తోంది.. హత్య చేసిన నలుగురికి వివేకాతో విభేదాలు
- ఇద్దరు నిందితుల తల్లి, భార్యను వివేకా లైంగికంగా వేధించారు
- గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని సునీత సుప్రీంకోర్టుకు వెళ్లారు
- టీడీపీ నేతలను కలిశాకే ఆమెలో మార్పు
- తెలంగాణ హైకోర్టులో అవినాశ్ తరఫు న్యాయవాది వాదనలు.. సీబీఐ వాదనల కోసం విచారణ నేటికి వాయిదా

- వివరాలు 3లో

బదిలీలకు 3వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు



- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల షెడ్యూల్ ఖరారు
- సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు అవకాశం
- 28 నాటికి జిల్లా, కేటగిరి వారీగా పోర్టల్‌లో ఖాళీల వివరాలు

- వివరాలు 10లో

ఎన్‌ఐఏ చేతికి భోపాల్ ఉగ్ర కేసు

అధికారికంగా దర్యాప్తు ప్రారంభించిన జాతీయ దర్యాప్తు సంస్థ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–భోపాల్‌లలో మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు అరెస్టు చేసిన ఉగ్రవాదులకు సంబంధించిన కేసు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) పరిధిలోకి వెళ్లింది. ఈ నెల 9న ఏకకాలంలో దాడులు చేసిన ఏటీఎస్ అధికారులు హైదరాబాద్‌లో ఐదుగురు, భోపాల్‌లో 11 మంది ఉగ్రవాదులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. గురువారం భోపాల్‌లో ఏటీఎస్ అధికారులతో భేటీ అయిన ఎన్‌ఐఏ అధికారులు.. శుక్రవారం నుంచి అధికారికంగా దర్యాప్తు ప్రారంభించారు. దీనికోసం ప్రత్యేకంగా కేసు నమోదు చేశారు. ఈ ఉగ్రవాదులకు ఉన్న విదేశీ లింకులు, ఆర్థిక మూలాలపైనే తొలుత దృష్టి సారించారు. దీనితోపాటు వారికి అందిన శిక్షణ, ఎక్కడెక్కడ శిబిరాలు నిర్వహించారన్నది ఆరా తీస్తున్నారు.

హెచ్‌యూటీ పేరుతోనే కొనసాగింపు..

హైదరాబాద్, భోపాల్‌లలో అరెస్టైన ఉగ్రవాదులు తొలుత అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ)కి అనుబంధంగా పనిచేశారు. రాకెట్ చాట్, త్రీమా యాప్స్‌లో ఏర్పాటు చేసుకున్న గ్రూపుల్లో హెచ్‌యూటీకి చెందినవారు పంపిన వీడియోలు, ఆడియోలు, పత్రాలను చూసి ప్రేరణ పొందారు. కానీ ఎంతకాలం ఎదురుచూసినా హెచ్‌యూటీ నుంచి విధ్వంసాలకు సంబంధించిన ఆదేశాలు అందలేదు. దీంతో సొంతంగా సలీం, యాసిర్‌ల నేతృత్వంలో హైదరాబాద్, భోపాల్ మాడ్యుల్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నిషేధం నుంచి తప్పించుకోవడానికి ఈ మాడ్యూల్స్‌కు ఎలాంటి పేర్లూ పెట్టుకోలేదు. అయితే వ్యవస్థీకృతంగా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రయత్నించిన ఈ మాడ్యుల్స్‌పై నిషేధం తప్పనిసరని ఎన్‌ఐఏ నిర్ణయించింది. ప్రాథమిక ఆధారాలను బట్టి హెచ్‌యూటీ ఉగ్రవాదులుగానే పరిగణించాలని, ఆ సంస్థపై నిషేధం విధించాలని కేంద్ర హోంశాఖకు నివేదిక పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. కేసు దర్యాప్తు పూర్తిచేసి, అభియోగపత్రాలు దాఖలు చేశాక ఈ ప్రక్రియ చేపట్టనుంది.



విత్తన పంపిణీ కోసం రైతు వివరాలు నమోదు చేసుకుంటున్న ఆర్బీకే సిబ్బంది

చురుగ్గా విత్తన పంపిణీ

- రాయలసీమలో 40 శాతం సబ్సిడీపై వేరుశనగ.. ఏజెన్సీ ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు
- ఈ ఏడాది 2.97 లక్షల క్వింటాళ్ల వేరుశనగ, 2 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాల పంపిణీ.. మిగిలిన విత్తనాలు జూన్ 1 నుంచి..

సాక్షి, అమరావతి: గతంలో సీజన్ ప్రారంభమైతే కానీ విత్తన పంపిణీ మొదలయ్యేది కాదు. అదునులో విత్తనం దొరక్క రైతులు నానా అగచాట్లు పడేవారు. కానీ ప్రస్తుతం రబీ కోతలు ఇంకా నూరు శాతం పూర్తికాలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాలేదు. కానీ విత్తన పంపిణీ జోరందుకుంది. అదునులో విత్తనం కోసం ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో సీఎం జగన్ ఆదేశాల మేరకు సీజన్ కంటే ముందుగా విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టారు. నెలరోజులుగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తుండగా ఇప్పుడు వేరుశనగ, వరి విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. జూన్ 1 నుంచి మిగిలిన విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఆర్బీకేల్లో విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సీజన్‌లో 92.45 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుంటాయి. ప్రధానంగా 41 లక్షల ఎకరాల్లో వరి, 18 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 7.50 లక్షల ఎకరాల్లో అపరాలు సాగుచేస్తుంటారు. ఖరీఫ్–22లో 6.46 లక్షల క్వింటాళ్ల విత్తనం సిద్ధం చేయగా, 5.63 లక్షల క్వింటాళ్ల విత్తన విక్రయాలు జరిగాయి. రానున్న ఖరీఫ్ కోసం 6.18 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధం చేశారు. వీటిలో ప్రధానంగా రెండులక్షల క్వింటాళ్ల వరి, 2.97 లక్షల క్వింటాళ్ల వేరుశనగ, 99 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు ఉన్నాయి. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ దాదాపు పూర్తికాగా, రాయలసీమ జిల్లాల్లో వేరుశనగ, ఏజెన్సీ ప్రాంతాల్లో వరి విత్తనాల పంపిణీని మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఆర్బీకేల్లో రైతుల నమోదుతో పాటు విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వేరుశనగ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వరి విత్తనాల పంపిణీ మొదలైంది.

విత్తన సబ్సిడీ ఇలా..

జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) పరిధిలోని జిల్లాల్లో క్వింటాకు రూ.1000, మిషన్ పరిధిలో లేని జిల్లాల్లో క్వింటాకు రూ.500 చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నారు. పచ్చిరొట్ట విత్తనాలతో పాటు చిరుధాన్యాల విత్తనాలను 50%, వేరుశనగ, నువ్వుల విత్తనాలను 40%, అపరాలను 30%, శనగలను 25% చొప్పున సబ్సిడీతో ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులకు అన్ని రకాల విత్తనాలను 90% సబ్సిడీపైన, కంటింజెన్సీ కింద ఇచ్చే విత్తనాలను 80 శాతం సబ్సిడీపైన ఇవ్వనున్నారు. సబ్సిడీ విత్తనం కోసం గతంలో పూర్తిగా ప్రైవేటు కంపెనీలపైనే ఆధారపడేవాళ్లు. కంపెనీలు ఏ విత్తనం ఇస్తే దాన్నే సబ్సిడీపై పంపిణీ చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం కనీసం మూడో వంతు విత్తనమైనా సొంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత ఖరీఫ్ సీజన్ నుంచి సొంత విత్తన తయారీకి శ్రీకారం చుట్టారు. రబీ 2022–23లో విత్తనోత్పత్తి చేసిన రైతుల నుంచి విత్తనాలు కొని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో సర్టిఫైచేసి రానున్న ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుత సీజన్ కోసం 2.97 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం కాగా.. దాంట్లో లక్ష క్వింటాళ్ల విత్తనాలు గత రబీలో రైతులు ఉత్పత్తి చేసినవే.

సర్టిఫై చేసిన తర్వాతే పంపిణీ

గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన, సర్టిఫై చేసిన విత్తనాన్ని ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. వేరుశనగ, వరి విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టాం.

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు,
ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధిసంస్థ



సభాస్థలి వెలుపల కూడా భారీ ఎత్తున జనసందోహం

మారీచులపై నిరుపేదల విజయమిది

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో ఇలాంటి పోరాటాలు వందలు, వేలు చూశామన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే మారీచు, సుబాహులు అడ్డు పడుతున్నారని, వారెన్ని కుయుక్తులు పన్నినా తన పయనం ధర్మం వైపే ఉంటుందని, ప్రభుత్వం నిరుపేదల పక్షానే పని చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పుడు పంపిణీ చేసిన స్థలాల్లో ఇళ్లు మంజూరు చేసి.. జూలై 8.. నాన్నగారి (దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి) జయంతి రోజున ఇళ్ల నిర్మాణాలు మొదలు పెడతామని చెప్పారు. ఇప్పటికే ల్యాండ్ లెవలింగ్ పూర్తి చేసి, ప్లాట్లలో సరిహద్దు రాళ్లు కూడా ఏర్పాటు చేశారని, దాదాపు 232 కి.మీ మేర అంతర్గత గ్రావెల్ రోడ్ల నిర్మాణం కూడా పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఈ ఇళ్ల పట్టాలు.. సామాజిక న్యాయ పత్రాలు

- ఇక్కడ ఈ రోజు జరుగుతున్న సభకు, ఈ సందర్భానికి మన రాష్ట్ర చరిత్రలోనే కాకుండా, దేశ చరిత్రలోనే ఒక ప్రత్యేకత ఉంది. పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలన్న ప్రభుత్వ తాపత్రయం ఒకవైపు.. దాన్ని అడ్డుకునేందుకు మారీచులు, రాక్షసులు ఏకంగా సుప్రీంకోర్టు దాకా తీసుకెళ్లి ఇవ్వకూడదని అడ్డుపడుతున్న పరిస్థితులు ఇంకోవైపు.. బహుశా ఇటువంటి ఘటన ఎక్కడా జరిగి ఉండదు.
- ఈ రోజు 50,793 మంది అక్కచెల్లెమ్మలకు వారి పేరు మీద ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్న గొప్ప సందర్భం. నా అక్కచెల్లెమ్మల ముఖాల్లో చిరునవ్వులు చూసే ఇంత మంచి అవకాశం నాకు ఇచ్చినందుకు ఆ దేవుడికి రుణపడి ఉంటాను.
- మంగళగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, మంత్రి సురేష్‌ను.. ఈ ప్రాంతంలో గజం రేటు ఎంతుంటుందని అడిగాను. ఈ మధ్య కాలంలో జరిగిన వేలంలో గజం రూ.17 వేలకు అమ్ముడుపోయిందని.. కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్యలో గజం ధర ఉంటుందన్నారు. అంటే రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలు విలువ చేసే ఇంటి స్థలం నా పేద అక్కచెల్లెమ్మల పేర్లమీద రిజిస్ట్రేషన్ జరగబోతుంది. పేద అక్కచెల్లెమ్మలకు ఇస్తున్న ఇళ్ల స్థలాల పత్రాలు వారికిస్తున్న హక్కులు కావు.. వారికిస్తున్న సామాజిక న్యాయ పత్రాలు కూడా. ఇదే అమరావతి ఇకపై సామాజిక అమరావతి అవుతుంది. మనందరి అమరావతి అవుతుంది.

అక్కచెల్లెమ్మల చేతిలో రూ.3 లక్షల కోట్లు

- అక్కచెల్లెమ్మలకు ఇళ్ల నిర్మాణంపై మూడు ఆప్షన్లు ఇస్తాం. మొదటి ఆప్షన్‌లో సొంతంగా తామే కట్టుకుంటామంటే అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో రూ.1.80 లక్షలు వేస్తాం. రెండో ఆప్షన్‌గా వారి ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంటు, ఇసుక, స్టీల్ లాంటి నిర్మాణ సామగ్రి అందిస్తాం. నిర్మాణ కూలి మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తాం. ఇవన్నీ మేం చేసుకోలేం అన్న వాళ్లకు మూడో ఆప్షన్‌గా ప్రభుత్వమే ఆ ఇళ్లను నిర్మించి ఇస్తుంది. ఇందులో అక్కచెల్లెమ్మలు ఏ ఆప్షన్ తీసుకున్నా పర్వాలేదు.
- ఇప్పటికే రాష్ట్రంలో అన్ని చోట్ల చేస్తున్నట్టే.. ఈ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందిస్తాం. సిమెంటు, స్టీల్, డోర్ ఫ్రేములు అన్నీ మార్కెట్ రేట్ల కంటే తక్కువకే ప్రభుత్వం అందిస్తుంది. నాణ్యత విషయంలో రాజీ పడేది లేదు. దీంతో పాటు రూ.35 వేలు చొప్పున పావలా వడ్డీకే లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తున్నాం. దీనివల్ల ఇళ్లు కట్టే కార్యక్రమం వేగవంతం అవుతుంది.



ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఈ పెద్దమనిషి చంద్రబాబు మళ్లీ ఒక మేనిఫెస్టో అంటాడు. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటూ మోసపూరిత ప్రేమ చూపిస్తాడు. సామాజిక వర్గాల కోసం ప్రత్యేకంగా మేనిఫెస్టో అని అంటాడు. మోసం చేసేవాడిని ఎప్పుడూ నమ్మకండి. నరకాసురుడినైనా నమ్మొచ్చేమో గాని, నారా చంద్రబాబునాయుడిని మాత్రం నమ్మొద్దు. - సీఎం వైఎస్ జగన్



- మన ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 30.75 లక్షల మంది అక్కచెల్లెమ్మల పేరిట ఇళ్ల స్థలాలు ఇచ్చాం. వీరిలో 21 లక్షల మందికి ఇళ్లు కూడా మంజూరు చేశాం. ప్రతి అక్కచెల్లెమ్మకు చెప్తున్నా.. 30.75 లక్షల ఇంటి స్థలాల్లో దాదాపు రూ.2.50 లక్షల కోట్లు విలువ చేసే ఇళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. ఇల్లు పూర్తయిన తర్వాత ఇంటి విలువ.. ప్రాంతాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది.
- ఈ లెక్కన రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లు.. మీ అన్నగా, మీ బిడ్డగా అక్క చెల్లెమ్మల చేతిలో పెడుతున్నా. గత ప్రభుత్వంలో పాలకులు ఇలాంటి ఆలోచన చేసే సాహసమైనా చేశారా? గతానికీ, ఇప్పటికీ మధ్య ఎంత తేడా ఉందో గమనించండి.

సీఆర్డీఏ పరిధిలో 5,024 మందికి టిడ్కో ఇళ్లు

- ఈ 50,793 ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు సీఆర్డీఏ పరిధిలో 8 చోట్ల జగనన్న కాలనీల్లో పీఎంఏవై కింద జీ ప్లస్ 3 విధానంలో నిర్మించిన 5,024 మందికి టిడ్కో ఇళ్లను కూడా అందిస్తున్నాం. వారం రోజుల్లో వారితో కూడా గృహ ప్రవేశాలు చేయించి, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందిస్తాం. టిడ్కో ఇళ్ల నిర్మాణం విలువ రూ.443 కోట్లు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఫ్లాట్‌పై రూ.1.50 లక్షలు చొప్పున సబ్సిడీగా రూ.75 కోట్లు ఇస్తే.. మనసున్న ప్రభుత్వంగా, పేదల ప్రభుత్వంగా, మన బాధ్యతగా ఈ 5024 ఫ్లాట్ల మీద మన ప్రభుత్వం మరో రూ.251 కోట్లు ఖర్చు చేసింది.
- టిడ్కో ఇళ్ల ప్రస్తావన వచ్చినప్పుడు చంద్రబాబు నోటి నుంచి ఆశ్చర్యకరమైన మాటలు వస్తుంటాయి. అయ్యా మీరు టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తే వాటిని పేదలకు ఇవ్వడానికి జగన్‌కు నాలుగేళ్లు ఎందుకు పడుతుంది? అని చంద్రబాబునాయుడుని అడుగుతున్నాను. 300 చదరపు అడుగుల ఫ్లాట్ కట్టడానికి అయ్యే విలువ అడుగుకి రూ.2 వేలు వేసుకుంటే.. దాదాపు రూ.5.75 లక్షలు అవుతుంది. మౌలిక సదుపాయాల కోసం రూ.లక్ష అవుతుంది.
- అంటే రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఫ్లాట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.50 లక్షల చొప్పున రూ.3 లక్షలు సబ్సిడీ ఇస్తే మిగిలిన రూ.3 లక్షల డబ్బును బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకుని 20 ఏళ్లపాటు ఆ పేదవాడు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున కట్టాలి. 20 ఏళ్లలో పేదవాడి మీద పడే అప్పు వడ్డీతో తడిసి మోపెడై మొత్తం రూ.7.20 లక్షలు చెల్లించాలి. మరి ఇది పేదవాడికి ఇచ్చినట్టేనా? కానీ మీ బిడ్డ ఈ ఫ్లాట్‌ను అక్కచెల్లెమల పేరుపై రూ.1కే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నాడు. అయితే చంద్రబాబు, వారి గజ దొంగల ముఠా, ఎల్లో మీడియా వక్రభాష్యాలు చెబుతూనే ఉంది.

మేనిఫెస్టోనే భగవద్గీత, బైబిల్, ఖురాన్

- రెండేళ్లు కోవిడ్ కష్టాలు రాష్ట్రాన్ని వెంటాడినా, రాష్ట్రానికి వచ్చే వనరులు తగ్గినా మాకున్న కష్టం కన్నా మీ కష్టమే ఎక్కువ అని భావించి మీ బిడ్డ పరుగెత్తాడు. కోవిడ్ సమయంలో కూడా 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఆర్థికంగా ఎన్ని సవాళ్లు ఎదురైనా రైతులకు, అక్కచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు, పిల్లలకు, సామాజిక వర్గాలకు నవరత్నాల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాం.
- మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించాం. మేనిఫెస్టోలో 98 శాతం వాగ్దానాలను అమలు చేశాం. ఇళ్ల స్థలాల పంపిణీలో మరో రెండడుగులు ముందుకు వేసి ఇళ్ల నిర్మాణాలను దశల వారీగా చేపడుతూ పరిగెత్తిస్తున్నాం.
- ఈ నాలుగేళ్ల మీ బిడ్డ పరిపాలనలో ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి, లంచం, వివక్ష లేకుండా నా అక్క చెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి నేరుగా రూ.2.11 లక్షల కోట్లు జమ చేశాం. మీ బిడ్డ బటన్ నొక్కగానే ఆ డబ్బులు వారి ఖాతాల్లో జమ అయింది. ఒక్కో ఇంటి స్థలం రూ.2.50 లక్షలు చొప్పున 30 లక్షల ఇళ్ల విలువ రూ.75 వేల కోట్లు అవుతుంది. మిగిలిన గోరుముద్ద, సంపూర్ణ పోషణ వంటివి కలిపి అక్షరాలా రూ.3 లక్షల కోట్లు నా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు చేర్చాం.

మంచి జరుగుతుంటే తట్టుకోలేక..

- ఇంత మంచి జరుగుతుంటే తట్టుకోలేని దుష్టచతుష్టయం, గజదొంగల ముఠా.. అంటే చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వీరందరికీ తోడు దత్తపుత్రుడు కలిసి చంద్రబాబు ఐదేళ్ల పాలనలో దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం చూశాం. అప్పుడూ.. ఇప్పుడూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. అప్పులు కూడా అప్పటి కన్నా ఇప్పుడే తక్కువ. అప్పుల పెరుగుదల కూడా ఇప్పుడే తక్కువ.
- లంచాలు, వివక్ష లేకుండా మరి ఇన్ని లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి ఇప్పుడు ఎలా వెళ్లింది? చంద్రబాబు హయాంలో అలా ఎందుకు జరగలేదని ఆలోచించండి. వారికి మంచి చేసే ఉద్దేశం లేదు. వారి తపన, తాపత్రయం అంతా దోచుకోవడానికి, పంచుకోవడానికి, తినుకోవడానికి అధికారంలోకి రావడం మాత్రమే. వారి దారుణాలను ఎవరూ రాయరు, చూపరు. ప్రశ్నిస్తామన్న వాళ్లు ప్రశ్నించరు. ఇదీ చంద్రబాబు హయాంలో మాయ.
- చంద్రబాబు తన పాలనలో 2014-2019 మధ్య ఏ ఒక్క పేదవాడికీ సెంటు భూమి, కనీసం ఒక ఇంటి పట్టా ఇచ్చిన పాపానపోలేదు. ఇదే చంద్రబాబు 2014 ఎన్నికల్లో 600 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి.. రైతులను, అక్కచెల్లెమ్మలను, నిరుద్యోగులతో సహా అందర్నీ మోసం చేశాడు. ఎన్నికలు సమీపిస్తుంటే కొత్త మోసాలతో ముందుకొస్తారు జాగ్రత్త.

రాష్ట్రంలో క్లాస్ వార్

- ఇప్పుడు రాష్ట్రంలో కులాల మధ్య యుద్ధం జరగడంలేదు. ఇక్కడ జరుగుతోంది క్లాస్ వార్. ఒకవైపు పేదవాడు ఉంటే.. మరోవైపు పేదవాళ్లకు మంచి జరగకూడదన్న పెత్తందార్లు ఏకమై యుద్ధం చేస్తున్నారు. పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇస్తామంటే కోర్టుల వరకూ వెళ్లి అడ్డుకుంటున్నారు.
- ఈ అమరావతిలో పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే.. కోర్టులకు వెళ్లి సామాజిక సమతుల్యం దెబ్బ తింటుందని వాదించారు. అంటే పేదవాడు ఇక్కడికి వచ్చి ఉంటే పెత్తందార్లు జీర్ణించుకోలేక హైకోర్టులో కేసులు వేశారు. అక్కడ ఓడిపోతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్లారు. అక్కడా ఓడిపోయినా ఇప్పటికీ ఈ పెద్దమనిషి చంద్రబాబు ఏదో ఒక రూపేణా అడ్డుకుంటూనే ఉన్నారు.
- పేదవాడు చదవాలి, ఎదగాలి అని మనం తాపత్రయపడుతుంటే గవర్నమెంటు బడుల్లో ఇంగ్లిష్ మీడియం ఉండడానికే వీల్లేదని అడ్డుకుంటున్నారు. మనం వేసే ప్రతి మంచి అడుగులోనూ పేదవాడికి అన్యాయం చేస్తున్నారు. కానీ మీ జగన్ మాత్రం మీ వెంటే ఉన్నాడు. అమ్మఒడి, ఆసరా, చేయూతతో నా అక్కచెల్లెమ్మలు వారి కాళ్ల మీద వాళ్లు నిలబడగలుగుతున్నారు. వాళ్ల పిల్లలను గొప్పగా చదివించగలుగుతున్నారు.
- జగన్ మాదిరిగా పాలన చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని ఈనాడు, ఆంధ్రజ్యోతిలో రాస్తారు. వాళ్ల టీవీల్లో డిబేట్లు పెడతారు. రాబోయే రోజుల్లో పేదలకు ఇంకా మంచి జరగాలని కోరుకుంటున్నాను.
- మీరు ఎంచుకున్న ఆప్షన్ ప్రకారం.. జూలై 8న ఇళ్లు కట్టించే కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ 50 వేల మంది అక్కచెల్లెమ్మలకు, 25 కాలనీల్లో ప్రతి కాలనీలోనూ అంగన్‌వాడీ, ప్రైమరీ స్కూల్, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పార్కులు కూడా వస్తాయి. ఇక్కడే నవులూరులో లేక్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నాం.

జన సునామీ

జనసంద్రంలా మారిన ఇళ్ల స్థలాల ప్రాంతం

ఉదయం 8 గంటలకే నిండిపోయిన సభా ప్రాంగణం
జగనన్నకు కృతజ్ఞతలంటూ ప్లకార్డులు
సీడ్ యాక్సిస్ రోడ్డుకు ఇరువైపులా వేలాది మంది లబ్ధిదారులు



వెంకటపాలెం సభకు పోటెత్తిన జనసందోహంలో ఒక భాగం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అమరావతిని జన సునామీ చుట్టేసింది. జనసంద్రం తరలి వచ్చింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం ఒక చారిత్రక ఘట్టానికి వేదిక అయ్యింది. ఒకే రోజు 50,973 మందికి ఇళ్ల స్థల పట్టాలతో పాటు, 5,024 మందికి టిడ్కో గృహాలను సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పంపిణీ చేస్తున్న సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు జనం పోటెత్తారు. ఇంటి స్థలం పట్టా వచ్చిన ప్రతి ఇంటి నుంచి లబ్ధిదారులు కుటుంబాలతో సహా రావడంతో ఉదయం 8 గంటలకే సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. రోహిణీ కార్తెలో ఎండలు మండిపోతున్నా పట్టించుకోకుండా పట్టాల పండుగకు జనం తరలి వచ్చారు. సభా ప్రాంగణంతో పాటు ముందు ఉన్న ఖాళీ స్థలం మొత్తం నిండిపోయింది. ఇప్పటి వరకు పేదలకు చోటు లేని రాజధానిగా ఉన్న అమరావతిలో టీడీపీ కుట్రలను ఎదుర్కొని సుప్రీంకోర్టు వరకూ వెళ్లి పోరాడి పేదలకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని లబ్ధిదారులు చర్చించుకున్నారు. నాలుగేళ్లుగా ఇంటి స్థలం కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు తమ కల నెరవేరడంతో తమకు సంక్రాంతి పండుగ ముందే వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ, తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, తుళ్లూరు మండలాల నుంచి లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

కట్టుదిట్టంగా ఏర్పాట్లు

సభా ప్రాంగణం పూర్తిగా కిక్కిరిసి పోవడంతో చాలా మంది పక్కనే ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డుకు ఇరువక్కలా ఉన్న చెట్ల కింద నిలబడి ముఖ్యమంత్రి ఉపన్యాసం విన్నారు. పట్టాలు వచ్చిన లబ్ధిదారుల సంఖ్యకు రెండింతల మంది తరలి రావడంతో వెంకటపాలెంకు వెళ్లే రోడ్లన్నీ జనసంద్రాలుగా మారాయి. సీఎం చిత్రపటాలతో కూడిన పోస్టర్లు, ప్లకార్డులు చేతపట్టుకుని పైకి చూపిస్తూ అడుగడుగునా జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతపెద్ద సంఖ్యలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తరలి వచ్చినా, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయడంతో పాటు గ్యాలరీలలో ఉన్న మహిళలకు స్నాక్స్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎంపీ నందిగం సురేష్‌లు సీఎం వైఎస్ జగన్‌కు రహదారి పొడవునా 3 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన స్వాగత బ్యానర్లు, తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మీ సంకల్పానికి సలాం

దేశంలో ఎక్కడా అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లుగా ముందుకెళుతున్న ప్రభుత్వం లేదు. పేదలను ఆస్తిపరులను చేయాలన్న మీ (సీఎం) సంకల్పానికి సలాం. మీ నాయకత్వంలో అన్ని వసతులతో ఊళ్లే నిర్మితమవుతున్నాయి. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ముందుకే వెళ్లారు. చంద్రబాబు దళితులను, బీసీలను.. చివరికి పేదలను అవమానించారు. ఇప్పుడు ఇస్తున్న ఇంటి స్థలాలను కూడా సమాధులతో పోల్చారు. ఇన్ని తప్పులు చేసి నాలుగేళ్లుగా కోట్లు ఖర్చుపెట్టి స్టేలు తెచ్చుకుంటున్నాడేగాని, చేసిన పాపాలకు క్షమాపణ చెప్పలేదు. బాబుతో ఎంత మంది కలిసి వచ్చినా జగన్‌ను ఆపలేరు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలు గెలిచి బాబుకు రాజకీయ సమాధి కట్టడం ఖాయం.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, పురపాలకశాఖ మంత్రి

ప్రజల సీఎం వైఎస్ జగన్

గతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వామపక్షాలు ధర్నాలు చేసేవి. కానీ జగన్ సీఎం అయ్యాక ఆ పరిస్థితి లేదు. వారంతా చంద్రబాబుతో కలిసి డ్రామాలు ఆడుతున్నారు. బాబు సీఎం అయ్యి, అమరావతిలో రైతులను నిలువునా ముంచేశారు. ఇప్పుడు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కోర్టుకు వెళ్లి అడ్డుపడాలని చూశారు. మరికొందరు అంబేడ్కర్ పేరు అడ్డుపెట్టుకుని అమ్ముడుపోయి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని అడ్డుపడుతున్నారు. కానీ రాష్ట్ర చరిత్రలో ఈ రోజు సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు. ఒకేసారి 50 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రజల ముఖ్యమంత్రిగా నిలిచారు.

– మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

న్యాయం సీఎం పక్షానే

గతంలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నాలు, ఆందోళనలు చేసిన వారిని చూశాం. ఇప్పుడు మాత్రం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని ధర్నాలు చేయడం చూస్తున్నాం. వారికి చంద్రబాబు నాయుడు నాయకుడిగా ఉన్నారు. ఇప్పుడు పేదలకు.. పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోంది. బాబు పెత్తందార్ల పక్షాన ఉంటే సీఎం జగన్ పేదల పక్షాన నిలబడ్డారు. అందుకే ధర్మం కూడా ఆయన పక్షానే ఉంది. అన్ని వర్గాల పేదలు ఆయనతో ఉన్నారు. న్యాయం పేదల పక్షాన నిలిచింది. 2024లో మళ్లీ జగన్‌ను సీఎంగా చూస్తాం.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

పిలిచి మరీ ఇంటి పట్టా ఇచ్చారు..


23 ఏళ్లుగా ఇల్లు లేక కష్టాలు పడ్డామన్నా



నాకు పెళ్లయినప్పటి నుంచి 23 ఏళ్లుగా రైల్వే స్థలంలో గుడిసె వేసుకుని ఉంటున్నామన్నా. మాతోపాటు అక్కడ 750 కుటుంబాలదీ అదే పరిస్థితి. ఎన్నోసార్లు రైల్వే వారు నోటీసులిచ్చారు. ఇల్లు అద్దెకు తీసుకునే శక్తి లేదు. ఇద్దరు పిల్లలతో ఎక్కడికి పోవాలో తెలియదు. ఎండకు ఎండాం, వానకు తడిచాం. గజం స్థలం కూడా కొనలేని నాకు జంటనగరాల మధ్య పిలిచి మరీ మీరు ఇంటి స్థలం ఇచ్చారు. రాజకీయ కుట్రలు పన్ని అడ్డుకోవాలని చూసినా, మీరు ఆడపడుచులను ఆస్తి పరులు చేశారన్నా. మీ సాయాన్ని జీవితంలో మరిచిపోలేను. ఈ రోజు నాలాంటి వారికి పెద్ద పండగ. అన్నా.. నా గృహ ప్రవేశానికి మీరు రావాలి.

– గొట్టుముక్కల హైమావతి, తాడేపల్లి

అద్దె పెంచినప్పుడల్లా ఇల్లు మారే పరిస్థితి



అన్నా.. నాకు ముగ్గురు పిల్లలు. భర్త హోటల్‌లో పని చేస్తారు. 25 ఏళ్లుగా చిన్న అద్దె ఇంట్లో ఉంటున్నాం. చాలీచాలని ఆదాయం. ఇంటి అద్దె పెంచినప్పుడల్లా పిల్లి తన పిల్లల్ని తిప్పినట్టు ఇల్లు మారేదాన్ని. ఓసారి అత్తగారి అమ్మ చనిపోతే శవాన్ని కూడా ఇంటికి తీసుకురానీయలేదు. ఆ క్షణంలో ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. సొంతిల్లు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదనిపించింది. నాలాంటి మహిళకు సొంతిల్లు కలగానే మిగిలిపోతుందనుకున్నా. కానీ మీరు పెట్టిన వలంటీర్ మా ఇంటికి వచ్చి.. జగనన్న ఉచితంగా ఇల్లు ఇస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ఎంతగా అడ్డుపడినా మీరు శ్రీరాముడిలా వారిని జయించి మాకు యాగ ఫలాన్ని అందించారన్నా.

– లక్ష్మి, గుణదల, విజయవాడ

గత ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదు?



పేదలకు సీఎం వైఎస్ జగన్ మంచి చేస్తుంటే.. హడావుడి చేస్తున్న వ్యక్తులు, గత ప్రభుత్వంలో భూములు లాక్కుని కనీసం పరిహారం చెల్లించని చంద్రబాబును ఎందుకు ప్రశ్నించలేదు? రైతులకు సీఎం జగన్ మేలు చేస్తున్నారే తప్ప ఎటువంటి అన్యాయం చేయటం లేదు. కావాలనే పేదలకు మేలు జరగకుండా అడ్డుకుంటున్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే సీఎం జగన్‌కు మంచి పేరు వస్తుందని కుళ్లు బుద్ధితో కోర్టుకు వెళుతున్నారు. ఇక్కడి అభివృద్ధిపై రైతులు నిలదీయాల్సింది చంద్రబాబును.

– పి.గంగా భవాని, విజయవాడ

మంచి మనసున్న నాయకుడు



మాకు ఇల్లు లేదు. ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. సీఎంగా జగన్ పరిపాలన ప్రారంభించాక పేదలకు మంచి జరగటం మొదలైంది. మాకు ఇంటి స్థలం కేటాయించారు. కచ్చితంగా ఇల్లు కట్టించి అందజేసే మంచి మనసున్న నాయకుడు సీఎం జగన్. పేదలకు అండగా నేనున్నానే భరోసా కల్పించారు.

– షేక్ మస్తాన్‌బీ, మెల్లెంపూడి, గుంటూరు జిల్లా

ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు



మూడు కుటుంబాల వాళ్లం ఒకే ఇంట్లో తలదాచుకుంటున్నాం. సీఎం జగన్ ఇంటి స్థలాలు ఇవ్వటం ద్వారా అందరికీ జాగా వచ్చింది. పేదలకు మంచి చేసేందుకు ఆయన ఎప్పుడూ వెనకడుగు వేయరు. పేదోళ్ల కష్టం తెలుసు కాబట్టే.. స్థలాలు అందజేస్తున్నారు. మాకు ఎంతో ఆనందంగా ఉంది.

– జాలాది రత్నకుమారి, ఆత్మకూరు, గుంటూరు జిల్లా

జగనన్న భరోసా కల్పించారు



మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇప్పుడు వచ్చిన స్థలం భవిష్యత్‌లో మా బిడ్డలకు అండగా ఉంటుంది. కరోనా సమయంలో నాకు పనిలేదు. అప్పుడు ప్రభుత్వ పథకాలు మమ్మల్ని ఆదుకుని నిలబెట్టాయి. అన్నీ చెప్పిన సమయంలోనే చేస్తున్నారు. భగవంతుని చల్లని చూపు ఈ ప్రభుత్వానికి ఉంటుంది.

– అబ్దుల్ వసీమ్, రేష్మా, మంగళగిరి, గుంటూరు జిల్లా


మా కోసం యుద్ధమే చేశారు



మా పొట్టకొట్టేందుకు చంద్రబాబు నాయుడు చాలా ప్రయత్నాలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మా అందరి కోసం యుద్ధం చేసి విజయం సాధించారు. తాను గెలిచి మమ్మల్ని గెలిపించిన తీరు ఆద్యంతం స్ఫూర్తిదాయకం. జగనన్న దయవల్ల మాకు ప్లాట్ వచ్చింది. అది తీసుకునేందుకు వచ్చాం.

– ఎ.భారతి, విజయవాడ

సమానత్వానికి నాంది



పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ద్వారా రాజధానిలో సామాజిక సమానత్వానికి నాంది పలికినట్లయింది. పేదలు రాజధానిలో నివాసముంటే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందనేది తప్పు అని దీని ద్వారా తేటతెల్లమైంది. ఇప్పటి వరకు కొందరిదిగా ఉన్న అమరావతి ఇప్పుడు అందరిదైంది. ఏకంగా 50 వేలకు పైగా ఇళ్ల పట్టాలివ్వడం అంటే మామూలు విషయం కాదు. తద్వారా లబ్ధిదారులకు వ్యక్తిగత లాభంతో పాటు ఇక్కడ ఏర్పడే ఇళ్ల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తద్వారా రాజధాని ప్రాంతంలో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. పాలకులకు ఎంతో గొప్ప మనసు ఉంటే కానీ ఇలాంటి నిర్ణయాలు సాధ్యం కావు.

– కె మధుబాబు, సీడీసీ డీన్, ఏఎన్‌యూ

ఈ అవకాశం ఎవరికీ రాలేదేమో..



35 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలపై సంతకం పెట్టే అవకాశం బహుశా ఇప్పటి వరకు ఎవరికీ రాలేదేమో. ఆ అవకాశం నాకు మాత్రమే దక్కడం పట్ల చాలా సంతోషంగా ఉంది. నేను ఉద్యోగంలో చేరి 35 సంవత్సరాలు. ఇన్ని ఏళ్లలో అత్యంత సంతోషకరమైన రోజు ఇది. ఈ అవకాశం రాష్ట్రంలో, దేశంలో ఏ అధికారికీ లభించి ఉండకపోవచ్చు.

– రామ్‌ప్రసాద్, తహసీల్దార్, మంగళగిరి, గుంటూరు జిల్లా

ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే



అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతంలో అల్పాదాయ వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఎంతో ఆనందించాల్సిన, అభినందించాల్సిన విషయం. అన్ని సామాజిక వర్గాలకు మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుంది. ప్రభుత్వం ఎంతో శ్రమపడి పేదల కల సాకారం చేసింది. గతంలో ఎప్పుడూ ఇటువంటి ప్రయత్నం జరగలేదు. ఈ అంశంలో అందరూ ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందించాల్సిందే.

– కె.శ్రీరామమూర్తి, పూర్వ ప్రిన్సిపాల్, ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల

క్లుప్తంగా...

చరిత్రలో నిలిచిపోయేలా ఇళ్ల పట్టాల పంపిణీ

971వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రంలోని పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 971వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వేళ్లూనుకుపోయిన కులోన్మాదం ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా జూలై 8వ తేదీ నుంచి అన్ని రకాల వసతులతో పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని చెప్పిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోర్టులు చెంపదెబ్బ కొట్టినా, ప్రజలు అసహ్యించుకున్నా కులవాదులు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని వ్యతిరేకించడం దుర్మార్గమన్నారు. పేదలు పట్టాల పండుగ చేసుకుంటుంటే చూసి ఓర్వలేక రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణీ, బూదాల సలోమీ, బూదాల సౌమ్య, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, బొలిమేర శామ్యూల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న టిప్పర్

- పలువురికి స్వల్ప గాయాలు
- రూ.6.75 లక్షల ఆర్థిక సాయం అందజేత



గాయపడిన వ్యక్తికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట (విజయవాడ తూర్పు)/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్) : గుంటూరు జిల్లా వెంకటపాలెంలో శుక్రవారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వెళ్లి వస్తున్న విజయవాడ గుణదల ఒకటవ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు ప్రయాణిస్తున్న బస్సును రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద టిప్పర్ ఢీకొంది. దీంతో గాయపడిన వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 22 మందికి ప్రథమ చికిత్స చేసిన వెంటనే ఇళ్లకు పంపించేశారు. మిగతా ముగ్గురు కె.మీనాకుమారి, ఎస్.రాకేష్, దివ్యలను ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటన గురించి తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు ప్రభుత్వాస్పత్రి చేరుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా పర్యవేక్షించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రాత్రి 8 గంటలకు వారు మరోమారు ఆ ముగ్గురు బాధితులను పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. స్వల్ప గాయాలైన 15 మందికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున చెక్కులు అందజేశామని చెప్పారు. ఇందుకోసం సీఎంఆర్ఎఫ్ నుంచి ప్రభుత్వం రూ.6.75 లక్షలు మంజూరు చేసిందన్నారు.

ప్రత్యేక సాయం వర్తింప చేయండి

కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం వైఎస్ జగన్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ : నాడు–నేడు పథకం ద్వారా విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (మూలధన పెట్టుబడి)గా భావించి ప్రత్యేక సాయం వర్తింప చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం.. శుక్రవారం నిర్మలా సీతారామన్‌తో సుమారు 40 నిమిషాలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రానికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టే కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌పై కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెన్స్ ఇచ్చేలా బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టిందని, స్కూళ్లలో నాడు–నేడు కింద రూ.6 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. తొలి దశ కింద 15,717 స్కూళ్లలో పనులు పూర్తయ్యాయని, ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌పీ ప్యానెల్స్ కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఆరోగ్య రంగంలోనూ నాడు–నేడు కింద అనేక పనులు చేపట్టామని, విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు మొదలు టీచింగ్ ఆస్పత్రుల వరకు పనులు చేపట్టామని, ఇందుకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఈ ఖర్చును క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావించి స్పెషల్ అసిస్టెన్స్ వర్తింప చేయాలని కోరారు.

జాప్యం లేకుండా నిధులు విడుదల చేయాలి

2014–15కు సంబంధించిన వనరుల గ్యాప్ ఫండింగ్, 2016–2019 మధ్య పరిమితికి మించి తీసుకున్న రుణాల కారణంగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న పర్యవసానాలు, 2021–22లో రుణాల పరిమితిపై సడలింపుల అంశాన్ని ఆర్థిక మంత్రితో చర్చించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ డిస్కంలకు ఏపీ జెన్‌కో సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి రూ.6,756.92 కోట్ల బకాయిల అంశాన్నీ ప్రస్తావించారు. ఈ అంశం పలుసార్లు కేంద్రం దృష్టికి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీ జెన్‌కో ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఈ సొమ్ములు చాలా అవసరమని, జాప్యం లేకుండా వీలైనంత త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. శనివారం నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొననున్నారు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సన్మానించి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విమానాశ్రయంలో ఘన స్వాగతం

ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ ఎంపీలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, ఎంపీలు మార్గాని భరత్‌రామ్, వంగా గీతా విశ్వనాథ్, చింతా అనూరాధ, ఎన్.రెడ్డెప్ప, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ దాస్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గన్నవరం నుంచి ముఖ్యమంత్రి వెంట వచ్చారు.

విద్యార్థిని దివ్య కుటుంబానికి ఇంటి స్థలం

జగనన్న విద్యా దీవెన సభలో మాట్లాడి అందర్నీ ఆకట్టుకున్న విద్యార్థినికి ప్రోత్సాహం



జిల్లా కలెక్టర్‌ను కలిసిన విద్యార్థి దివ్య

తాళ్లపూడి: ఇటీవల కొవ్వూరులో జరిగిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తనకు విద్యా దీవెన పథకం ఎలా మేలు చేసిందో చెబుతూ అందరినీ ఆకట్టుకున్న పెద్దేవం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని తిరిగిపల్లి దివ్యకు అభినందనలు వెల్లువెత్తాయి. దివ్య కుటుంబం కష్టాలు విని సీఎం వైఎస్ జగన్ చలించిపోయారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత నుంచి విద్యార్థిని దివ్యకు శుక్రవారం పిలుపు వచ్చింది. ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ, గ్రామ సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు విద్యార్థిని దివ్యను వెంట పెట్టుకుని కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. విద్యార్థి దివ్య కుటుంబానికి ఇంటి స్థలం తక్షణమే కేటాయించినట్టు కలెక్టర్ తెలిపారు. అతి త్వరలో మంత్రి చేతుల మీదుగా అందజేస్తామన్నారు. అలాగే ఉన్నత చదువుకు, ఆ తర్వాత మంచి ఉద్యోగ అవకాశం కల్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దివ్య హోంమంత్రి తానేటి వనితను కూడా కలిసింది.

అవినాశ్ లక్ష్యంగా సీబీఐ దర్యాప్తు

తెలంగాణ హైకోర్టులో అవినాశ్ తరఫు న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి లక్ష్యంగా సీబీఐ విచారణ చేస్తోందని.. ఆయనను ఇందులో ఇరికించడానికి ప్రయత్నిస్తున్నారని తెలంగాణ హైకోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వరరావు సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఇప్పటికే పలుమార్లు అవినాశ్ విచారణకు హాజరైనా మళ్లీ రావాలంటూ తీవ్రంగా వేధిస్తోందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. హత్య చేసిన నలుగురికి వివేకాతో విభేదాలున్నాయన్నారు. ప్రత్యక్ష సాక్షి అయిన రంగన్న స్టేట్‌మెంట్‌ను సీబీఐ రికార్డు చేయలేదని తెలిపారు. ప్రధాన నిందితుడు దస్తగిరి విషయంలోనూ సీబీఐ తీరు ఇలాగే ఉందన్నారు. దస్తగిరి దర్జాగా బయట తిరుగుతున్నా వివేకా కుమార్తె సునీత పట్టించుకోవడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని మాత్రం సుప్రీంకోర్టు వరకు వెళ్లారని గుర్తు చేశారు. కిరాయి హంతకుడు దస్తగిరికి పూర్తి సహకారం అందిస్తున్న సీబీఐ.. అవినాశ్‌రెడ్డి లక్ష్యంగా దర్యాప్తు జరుపుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అవినాశ్ తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రిలో ఉన్నారని.. అయినా విచారణకు రావాలంటూ వేధిస్తోందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఆధారాలు లేకుండా అవినాశ్‌ను అరెస్టు చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ముందస్తు బెయిల్ కోరుతూ వైఎస్ అవినాశ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను శుక్రవారం ఉదయం హైకోర్టు విచారించింది. న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం ముందు.. అవినాశ్ తరఫున న్యాయవాది ఉమామహేశ్వరరావు సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం సునీత తరఫు సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ తన వాదనలు వినిపించారు. అప్పటికే సాయంత్రం 6 గంటలు దాటడంతో విచారణను ధర్మాసనం శనివారం (నేడు) ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసింది. నేడు సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపించాల్సి ఉంది. కాగా అవినాశ్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు ఇలా సాగాయి..

నాలుగేళ్లుగా సీబీఐ దర్యాప్తు..

'2019, మార్చి 14న వివేకా హత్య జరిగింది. తొలుత నాటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగింది. ఈ క్రమంలో



వివేకా కుమార్తె సునీత ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో 2020లో కేసు సీబీఐకి బదిలీ అయ్యింది. కేసు విచారణ చేపట్టిన సీబీఐ దాదాపు నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటివరకు దర్యాప్తులో ఎలాంటి పురోగతి సాధించలేదు. 2021, అక్టోబర్ 26న ఒక చార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో ఎర్ర గంగిరెడ్డి(ఏ–1), సునీల్ యాదవ్ (ఏ–2), ఉమాశంకర్‌రెడ్డి (ఏ–3), దస్తగిరి (ఏ–4)లను నిందితులుగా పేర్కొంది. గంగిరెడ్డిని 2019, మార్చి 28న సిట్ అరెస్టు చేసింది. గంగిరెడ్డి వివేకాకు అత్యంత సన్నిహితుడు. వీరి మధ్య భూవివాదాలు ఉన్నాయి. బెంగళూరుకు చెందిన ఓ భూవివాదంలో రావాల్సిన కమిషన్ గురించి ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. వివేకా హత్య కేసులో ఎర్ర గంగిరెడ్డి తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇక రెండో నిందితుడు సునీల్‌ను 2021, ఆగస్టు 28న అరెస్టు చేశారు. వివేకా అతడితో వజ్రాల వ్యాపారం చేసేవారు. అంతేకాదు.. సునీల్ తల్లిని వివేకా లైంగికంగా వేధించినట్లు అతడే తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. మూడో నిందితుడు ఉమాశంకర్‌రెడ్డిని 2021, సెప్టెంబర్ 9న అరెస్టు చేశారు. ఇతడితోనూ వివేకా వజ్రాల వ్యాపారం చేశారు. అంతేకాకుండా ఉమాశంకర్‌రెడ్డి భార్యను కూడా వివేకా లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలున్నాయి. ఇక నాలుగో నిందితుడు దస్తగిరిని ఇప్పటివరకు సీబీఐ అరెస్టు చేయలేదు. వివేకా వద్ద దస్తగిరి డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2018 డిసెంబర్‌లో అతడిని తొలగించిన వివేకా.. ప్రసాద్ (ఎల్‌డబ్ల్యూ–16)ను డ్రైవర్‌గా పెట్టుకున్నారు. దస్తగిరి సూచన మేరకే.. హత్యకు ముందు వివేకాతో నిందితులు ప్రసాదే ఈ హత్యకు కారణం అన్నట్లు లేఖ రాయించారు. తానే ఆయుధం తెచ్చానని, హత్య చేశానని చెప్పిన ఓ కిరాయి హంతకుడు (దస్తగిరి) యథేచ్ఛగా బయట తిరగడం, అతడిని సీబీఐ అరెస్టు చేయకపోవడం ఇదే తొలిసారి కావొచ్చు. 2021, నవంబర్ 17న సీబీఐ మరో చార్జిషీట్ దాఖలు చేశారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే చార్జిషీట్ వేయాల్సి ఉండగా, సీబీఐ చట్టాన్ని పాటించలేదు' అని అవినాశ్ న్యాయవాది తన వాదనలు వినిపించారు.

టీడీపీ కుట్రలో భాగంగానే వివేకా ఓటమి

'2017లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. దీనికి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి కారణమని.. వారి అంతుచూస్తానని బెదిరించారని సీబీఐ పేర్కొంటున్నా.. అందులో వాస్తవం లేదు. స్థానిక సంస్థల కోటాలో ఆ ఎన్నికలు జరగడం, నాటి అధికార టీడీపీ ఓటర్లను కొనుగోలు చేయడం కారణంగానే వివేకా ఎన్నికల్లో ఓడిపోయినట్టు కొందరు సాక్షులు వెల్లడించారు. వివేకా ఓటమితో భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలకు సంబంధం లేదు. వివేకా.. విజయమ్మ, షర్మిలల్లో ఒకరికి కడప ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరినట్లు కూడా ఎవరూ చెప్పలేదు. సీబీఐ మాత్రం ఓ కథ అల్లుకుని.. ఆ మేరకు దర్యాప్తు చేస్తోంది' అని అవినాశ్ న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తెచ్చారు.

డబ్బు, ఆయుధం రికవరీ ఏదీ?

'గంగిరెడ్డి ఇచ్చాడని చెప్పి తనకు సునీల్ రూ.కోటి ఇచ్చినట్లు దస్తగిరి వాంగ్మూలంలో పేర్కొన్నాడు. అందులో రూ.25 లక్షలను మళ్లీ సునీల్ తీసుకున్నాడని చెప్పాడు. కేసు నమోదు చేసిన సీబీఐ మిగిలిన రూ.75 లక్షల్లో రూ.46 లక్షలు మాత్రమే రికవరీ చేసింది. మరి మిగతా డబ్బు ఎక్కడికి పోయింది. దస్తగిరి ఆయుధాన్ని నాలాలో వేశానని చెప్పాడు. నాలాలో వేసిన ఆయుధాన్ని కూడా సీబీఐ రికవరీ చేయలేకపోయింది. ఈ డబ్బు, ఆయుధం ఎక్కడికి పోయాయి. దీనికి సీబీఐ వద్ద సమాధానం లేదు. దస్తగిరి.. సీబీఐ పెంపుడు చిలుక(పెట్)లా మారాడు. వారు ఏం చెబితే అదే చెబుతున్నాడు. అందుకే గిఫ్ట్ కింద మిగిలిన డబ్బు రికవరీ చేయలేదేమో. సీబీఐ కేసు స్వీకరించిన తర్వాత దర్యాప్తు అధికారి ఆదేశాల మేరకు ఢిల్లీ వెళ్లిన దస్తగిరి అక్కడే నెలన్నర ఉన్నాడు. ఈ క్రమంలోనే వారి మధ్య ఒప్పందం కుదిరింది. విచారణ అనుమానాస్పదంగా ఉండటంతో దర్యాప్తు అధికారిపై ఓ ప్రైవేట్ కేసు నమోదు కావడమే కాకుండా ఏకంగా అత్యున్నత న్యాయస్థానం అతడిని పక్కకు పెట్టింది. నిందితుడి నుంచి ఒకసారి వాంగ్మూలం తీసుకుంటారు. కానీ, ఆగస్టు 25, 2021 నుంచి 30 వరకు దస్తగిరి నుంచి మూడుసార్లు వాంగ్మూలం తీసుకున్నారు.. అతడిని అరెస్టు కూడా చేయలేదు. అదే ఏడాది అక్టోబర్ 7న దస్తగిరి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. బెయిల్‌కు అభ్యంతరం లేదని, ఇవ్వొచ్చంటూ సీబీఐ పేర్కొంది. దీంతో దస్తగిరికి అక్టోబర్ 22న ముందస్తు బెయిల్ వచ్చింది. అనంతరం దస్తగిరిని సీబీఐ అప్రూవర్‌గా పేర్కొంది' అని అవినాశ్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు.

సెక్షన్ 201 మిస్సింగ్..

'పోలీసు దర్యాప్తుపై సీబీఐ ఆరోపణలు చేసింది. పాత ఎఫ్ఐఆర్‌లోని అంశాలతోనే కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ముందు గుండెపోటు అనుకున్నా.. తర్వాత అదే రోజు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. అందులో ఐపీసీ 201 (సాక్ష్యాలను ధ్వంసం చేయడం) కేసు నమోదు చేశారు. అయితే సీబీఐ ఎఫ్ఐఆర్‌లో మాత్రం 201 సెక్షనే లేదు. ఏప్రిల్ చివరి నాటికి దర్యాప్తు ముగించాలని కోర్టు చెప్పినా ఆ పని చేయలేదు' అని తెలిపారు.

సునీత తీరు అనుమానాస్పదం..

'కేసు ట్రయల్‌ను మరో రాష్ట్రానికి మార్చమని వివేకా కుమార్తె సునీత పిటిషన్ వేయడంతో సుప్రీంకోర్టు తెలంగాణకు బదిలీ చేసింది. ప్రతి పిటిషన్‌లో ఇంప్లీడ్ అవుతున్న సునీత.. కిరాయి హంతకుడు (దస్తగిరి) బయట తిరగడంపై మాత్రం ఎలాంటి పిటిషన్ వేయలేదు. దస్తగిరికి బెయిల్ ఇవ్వొద్దని గానీ, ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని గానీ కోరలేదు. వివేకా హత్య తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ తన తండ్రి.. వైఎస్ అవినాశ్ గెలుపు కోసం చనిపోయే ముందు వరకు తీవ్రంగా కృషి చేశారని చెప్పారు. జగనన్నను సీఎంగా చూడటమే తన లక్ష్యంగా పనిచేశారని పేర్కొన్నారు. ఎప్పుడైతే ఆమె టీడీపీ నేతలను కలిశారో.. నాటి నుంచి సునీత తీరులో మార్పు వచ్చింది. టీడీపీ నేతలు సూచించినట్లు ఆమె వ్యవహరిస్తున్నారు' అని అవినాశ్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు.

అవినాశ్‌ను ఇరికించే యత్నం

'నిందితుల్లో కొందరు అవినాశ్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఫోన్ మాట్లాడుకోవడం సాధారణం. దాని ఆధారంగా అవినాశ్‌ను ఇరికించాలని చూస్తున్నారు. హత్య జరిగిన రోజు ప్రచారం కోసం జమ్మలమడుగు వెళ్తున్న అవినాశ్.. హత్య విషయం తెలిసి నేరుగా వివేకా ఇంటికే చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న చాలామంది రక్తపు వాంతులతో, గుండెపోటు వచ్చి వివేకా మృతి చెందినట్లు చెప్పడంతో అవినాశ్ కూడా అలాగే భావించారు. సాక్ష్యాలను ధ్వంసం చేశారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. వివేకా ఇంట్లో ఆయన లాన్‌లోనే పలువురికి ఫోన్ చేసి విషయం చెబుతూ ఉండిపోయారు. ఇన్నాళ్లయినా సీబీఐ అవినాశ్ ప్రమేయం ఉంది అని చెప్పేందుకు ఒక్క ప్రాథమిక ఆధారాన్ని కూడా చూపలేదు. ప్రత్యక్ష సాక్షి రంగన్న స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోని సీబీఐ హత్య వెనుక భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌లు ఉన్నారని తనకు గంగిరెడ్డి చెప్పాడని దస్తగిరి చెప్పిన వాంగ్మూలాన్ని మాత్రం విశ్వసించడం.. విచారణ ఏ లక్ష్యంగా సాగుతోందో తెలియజేస్తోంది. హంతకుడిని బయట తిరగమని చెప్పి.. ఓ ప్రజాప్రతినిధిని అరెస్టు చేయాలని సీబీఐ చూస్తోంది. కోర్టులో పిటిషన్ వేస్తేగానీ వీడియో, ఆడియో రికార్డింగ్ గురించి వివరాలు చెప్పలేదు' అని కోర్టు దృష్టికి తెచ్చారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

'ఇప్పటికే పలుమార్లు విచారణకు అవినాశ్ హాజరయ్యారు. ఈ నెల 16న మరోసారి రావాలంటూ సీబీఐ 15వ తేదీ సాయంత్రం నోటీసులు ఇచ్చింది. తాను 19న వస్తానని అవినాశ్ లేఖ రాశారు. ఈ క్రమంలో 19న హైదరాబాద్ బయలుదేరిన ఎంపీ.. తల్లి అనారోగ్యం విషయం తెలియడంతో మళ్లీ పులివెందుల వెళ్లారు. అక్కడి నుంచి ఆయన తల్లిని కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన దగ్గరుండి చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని అవినాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని న్యాయవాది వెల్లడించారు. కాగా, సుదీర్ఘ వాదనలు జరుగుతున్న సమయంలో సునీత జోక్యం చేసుకొని వైఎస్ అవినాశ్‌రెడ్డి న్యాయవాదికిచ్చినంత సమయం తమ న్యాయవాదులకు వాదనలు వినిపించేందుకు ఇవ్వాలని పేర్కొనడంతో హైకోర్టు మందలించింది. కోర్టు హాల్లో పరిధి దాటి వ్యవహరించవద్దని హెచ్చరించింది.

చట్ట ప్రకారమే చెల్లింపులు

హిందూజాకు అప్పనంగా ఒక్క రూపాయి కూడా కట్టబెట్టలేదు

- ఒప్పందం మేరకు విద్యుత్ కొనుగోలు చేసినా, చేయకపోయినా స్థిర చార్జీలు చెల్లించాల్సిందే
- ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు, ఏపీఈఆర్‌సీ ఆదేశాలు, విద్యుత్ నిబంధనలు అమలు
- నిజానికి, గత ప్రభుత్వం 2018లో ఈ ఒప్పందాన్ని రద్దుచేసుకోకపోతే ఈ సమస్య వచ్చేది కాదు
- హిందుజాకు దోచిపెట్టామంటూ ఈనాడు రాతలు పచ్చి అబద్ధం
- రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ స్పష్టీకరణ

ఫ్యాక్ట్ చెక్



మాట్లాడుతున్న కె.విజయానంద్

సాక్షి, అమరావతి : ఒకసారి విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగిన తరువాత ఒప్పంద కాలానికి కొనుగోలు చేసినా, చేయకపోయినా, ఆ విద్యుత్ కేంద్రం ఉత్పత్తి చేసినా, చేయకపోయినా స్థిర చార్జీలు అనేవి భరించాల్సిందే. వీటిలో ముఖ్యంగా సిబ్బంది జీతభత్యాలు, అప్పు మీద వడ్డీ, మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు, యంత్రాల అరుగుదల, తరుగుదల వంటివి ఉంటాయి. ఈ విషయం విద్యుత్ రంగంపై కనీస అవగాహన ఉన్న వారెవరికైనా స్పష్టంగా అర్థమవుతుంది. కానీ, తమవి అత్యున్నత విలువలని గొప్పలు చెప్పుకునే ఈనాడు దినపత్రికకు మాత్రం ఈ విషయం తెలియదు. తెలిసినా తెలియనట్లు నటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడమే ప్రధాన ధ్యేయంగా తప్పుడు కథనాలను నిత్యం వండి వారుస్తోంది. దానిలో భాగంగానే 'హిందుజాకు దోచిపెట్టింది రూ.1,234 కోట్లు' అంటూ అబద్ధాలు అచ్చేసింది. అందులో అసలు నిజాలను ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ బీఏవీపీ కుమార్‌రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె పద్మజనార్థనరెడ్డిలతో కలిసి రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం విద్యుత్ సౌధలో మీడియాకు వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం ఈనాడు అబద్ధాల వెనుక నిజానిజాలిలా ఉన్నాయి..

ఒప్పందాలు ఇప్పటివి కాదు..

హిందూజ సంస్థతో ప్రస్తుత ప్రభుత్వం ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ హిందుజా విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) మొదటిసారి 1994లోనే అప్పటి ఎలక్ట్రిసిటీ బోర్డుతో జరిగింది. తరువాత దానిని సవరించి 1998లో 1,040 మెగావాట్ల పవర్ ప్లాంట్ కడతామని ఒప్పందం చేసుకున్నారు. 2001 నాటికి ఆ పీపీఏ గడువు ముగిసింది. తర్వాత వారు మళ్లీ ప్రభుత్వాన్ని సంప్రదించి, మర్చంట్ పవర్ ప్లాంట్‌కైనా వెళ్తామని అనుమతి కోరారు. 2010లో మెగావాట్‌కు రూ.5.33 కోట్లు చొప్పున రూ.5,545 కోట్లతో ప్రాజెక్టు వ్యయాన్ని నిర్ధారించారు. వివిధ కారణాలతో విద్యుత్ కేంద్రం నెలకొల్పడంలో జాప్యం జరిగింది. హిందూజా రాకపోయినా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది కాబట్టి 2011లో 1,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచి, యూనిట్ రూ.3.60 చొప్పున కొనేందుకు ఒప్పందం చేసుకుంది. 2013లో హిందూజాతో ఒక మెమొరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్‌ను ప్రభుత్వం కుదుర్చుకుంది. కానీ, 2014లో పీపీఏ ప్రకారం హిందూజా సంస్థ విద్యుత్‌ను సరఫరా చేయలేకపోయింది. దీంతో 2016 జనవరిలో మొదటి యూనిట్, జూలైలో రెండవ యూనిట్‌లో ఈ విద్యుత్ కేంద్రం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించింది. 2016 ఆగస్టులో ఏపీఈఆర్‌సీ హిందూజా టారిఫ్‌ను యూనిట్ రూ.3.82గా నిర్ణయించి, ఏటా 2,828 మిలియన్ యూనిట్లు తీసుకోవాలని డిస్కంలకు చెప్పింది. రూ.5,623 కోట్లు ఫిక్స్‌డ్ చార్జీలుగా నిర్ధారించింది.

టీడీపీ అనాలోచిత నిర్ణయం ఫలితమే..

ఈ నేపథ్యంలో.. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒప్పందం నుంచి వైదొలగాలని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు నిర్దేశించింది. దానికి అనుగుణంగా ఈ ఒప్పందం వద్దని డిస్కంలు చేసిన అభ్యర్థనకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతిచ్చింది. అప్పటి నుంచి ఈ ఒప్పందంపై న్యాయ పోరాటం, చిక్కులు ప్రారంభమయ్యాయి. అప్పిలేట్ ట్రిబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (ఆప్టెల్)ను హిందూజా ఆశ్రయించింది. ట్రిబ్యునల్ టీడీపీ నిర్ణయాన్ని తప్పుబట్టింది. ఆ తరువాత ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. అంతిమంగా ఫిబ్రవరి 2022లో సుప్రీంకోర్టు 'ఈ ఒప్పందం రద్దు కుదరదు, విద్యుత్ కొనుగోలు ఒప్పందం వాణిజ్య కార్యకలాపాలు మొదలు పెట్టినప్పటి నుంచి అమలులో వున్నట్లే' అని తీర్పునిచ్చింది. అంటే సుప్రీంకోర్టు తీర్పు మేరకు హిందూజాకు స్థిర చార్జీలు చెల్లించక తప్పని పరిస్థితి. నిజానికి.. ఇన్ని రోజులు హిందుజా విద్యుత్ కేంద్రం అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తి విద్యుత్ తీసుకోలేకపోవటానికి కారణం గత ప్రభుత్వం 2018లో తీసుకున్న లోపభూయిష్ట నిర్ణయమే. టీడీపీ ఈ ఒప్పందాన్ని రద్దుచేసుకోకపోయి ఉంటే, హిందూజా నుంచి విద్యుత్ తీసుకుని ఆ మేరకు చెల్లింపులు చేసేవాళ్లం. కానీ, ఇప్పుడు విద్యుత్ తీసుకోకుండానే చార్జీలు చెల్లించాల్సి రావడం గత ప్రభుత్వ పాప ఫలితమే. అంతేగాని.. ఉత్పత్తి విద్యుత్‌కు ప్రభుత్వం డబ్బులు కట్టిందన్న మాటలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. అదీగాక.. 2022 మార్చి తర్వాత హిందూజా సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం 1,040 మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేసింది. రాష్ట్రానికి అదనంగా 15 మిలియన్ యూనిట్లు విద్యుత్ సరఫరా అవుతోంది.

చట్టప్రకారమే అనుమతి..

అప్పిలేట్ ట్రిబ్యునల్ వారి ఉత్తర్వుల్లో హిందూజా టారిఫ్‌ను స్థిర, చర ఛార్జీలుగా విభజించమని ఆదేశాలిచ్చింది. వాటి ప్రకారం కమిషన్ అప్పటి తాత్కాలిక (అడ్‌హాక్) చార్జీ అయిన యూనిట్ రూ.3.82ను స్థిరచార్జీ రూ.1.06గాను.. చరచార్జీ రూ.2.76గాను విభజించింది. దీని ముఖ్యోద్దేశ్యం.. మెరిట్ ఆర్డర్ సూత్రాలను ఈ విద్యుత్ కేంద్రానికి అమలుపరచడమే. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆగస్టు 2022లో ఇచ్చిన తుది ఉత్తర్వుల్లో అప్పటికున్న అసాధారణ పరిస్థితుల దృష్ట్యా ఇంతకుముందు నిర్ణయించిన తాత్కాలిక (అడ్‌హాక్) చార్జీయే 2016 నుంచి 2022 ఆగస్టు వరకు వర్తిస్తుందని చెప్పింది. టారిఫ్ అప్పటికే రెండు భాగాలుగా విభజించినందున ఇందులో స్థిరఛార్జీ చెల్లింపు అన్నది భాగమే కాబట్టి కమిషన్ నిర్ణయం మరోసారి ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన అవసరంలేదు. హిందుజాకు స్థిరఛార్జీల బకాయిలు వాళ్ల ఉత్పత్తి అందుబాటు ప్రకటనలను బట్టి చెల్లించాలని అడ్వొకేట్ జనరల్, ఆంధ్రప్రదేశ్ న్యాయ శాఖా కార్యదర్శి, న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌గుప్తా విద్యుత్ పంపిణీ సంస్థలకిచ్చిన న్యాయ సలహాలో ధ్రువీకరించారు. సుప్రీంకోర్టు, అప్పీలేట్ ట్రిబ్యునల్, ఏపీఈఆర్‌సీ ఇచ్చిన తీర్పులను, ఉత్తర్వులు, ఎలక్ట్రిసిటీ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ప్రభుత్వం డిస్కంలకు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్వహించే ఆలస్య చెల్లింపు సర్చార్జీ (ఎల్‌పీఎస్) స్కీం నిబంధనలకు లోబడి, హిందుజాకు రూ.1,234 కోట్లు స్థిర చార్జీలను చెల్లించడానికి అనుమతినిచ్చింది.

'ఈనాడు' అవగాహనా రాహిత్యం..

హిందుజాపై సుప్రీంకోర్టు, అప్పీలేట్ ట్రిబ్యునల్, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇచ్చిన తుది తీర్పుల ప్రకారం హిందూజా విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం అమలు చేయాల్సిన గురుతర బాధ్యత ఈ ప్రభుత్వంపైన, డిస్కంలపైన ఉంది. నిజానికి.. హిందూజా దాదాపు రూ.2,401 కోట్లకు అర్జీ పెట్టినప్పటికీ సాంకేతిక, న్యాయపరమైన అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుని, కోల్ ఎంత ఉంది, ఆ రోజు నార్మేటివ్ అవైలబిలిటీ ఎంత అనేది ప్రతి యూనిట్ ప్రకారం అన్ని స్థాయిల్లోనూ రోజువారీగా క్షుణ్ణంగా పరిశీలించి చివరికి వారికి మొత్తం రూ.1,234 కోట్లు చెల్లించాలని లెక్కించాం. ఈ చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో జరిగాయి. కాబట్టి, ఈ వివరాలు కమిషన్‌కు ఆర్థిక సంవత్సరం 2022–23 నాల్గవ త్రైమాసికానికి డిస్కంలు సమర్పించే ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయ సర్దుబాటు నివేదికలో నిబంధనల ప్రకారం పొందుపరుస్తాయి. వాస్తవాలిలా ఉంటే.. ఈ నిజాలను గాలికొదిలేసి, విద్యుత్ తీసుకోని కాలానికి స్థిరఛార్జీలు హడావిడిగా చెల్లించేశారని, కనీసం కమిషన్ అనుమతి తీసుకోలేదని ఈనాడు రాయడం పూర్తిగా అవగాహనా రాహిత్యం. విషయంపట్ల తగినంత పరిజ్ఞానం, ఏపీఈఆర్‌సీ ఇచ్చిన వివిధ నిబంధనలు, నియమావళి గురించి అవగాహన లేకుండా అబద్ధాలు అచ్చేశారు.

> తనని తాను పొగుడుకోక పోవడం, డంభము లేకుండా ఉండడం,
> ఇష్టం కానిది ప్రాప్తించినా మనస్సును సమస్థితిలో ఉంచుకోవడం...
> జ్ఞానము. దానికి భిన్నమైనది అంతా అజ్ఞానము.
> – భగవద్గీత

సాక్షి

శనివారం, 27 మే 2023

బహిష్కరణ సబబేనా?!


వాకౌట్లు, వాయిదాలు, అరుపులు, కేకలతో తరచు వార్తల్లోకెక్కే పార్లమెంటు కనీసం కొత్త భవనం ప్రారంభోత్సవ సందర్భంలోనైనా పండుగ కళను సంతరించుకుంటుందని ఆశిస్తే అది సాధ్యపడేలా లేదు. నూతన పార్లమెంటు భవనాన్ని ఎవరు ప్రారంభించాలన్న అంశం చుట్టూ ఇప్పుడు వివాదం రాజుకుంది. పనిలో పనిగా రాజ్యాంగ చట్రంలో ఎవరి పాత్రేమిటన్న చర్చ కూడా మొదలైంది. ఈ ఆదివారం నూతన పార్లమెంటు భవనం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమవుతుండటమే తాజా వివాదానికి మూలం. రాజ్యాంగం నిర్దేశించిన మూడు వ్యవస్థల్లో శాసన వ్యవస్థ ఒకటి కనుక రాజ్యాంగాధినేత అయిన రాష్ట్రపతి ప్రారంభిస్తేనే బాగుంటుందని విపక్షాలు వాదిస్తున్నాయి. కార్యనిర్వాహక వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే ప్రధాని పార్లమెంటులో మెజారిటీ పక్షానికి మాత్రమే నాయకుడని, అందువల్ల ఆయన ప్రారంభించటం సరికాదంటున్నాయి. తమ వాదనకు ప్రభుత్వం సమ్మతించటం లేదని అలిగి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించటానికి నిర్ణయించుకున్నాయి. మొత్తంగా 20 పార్టీలు బహిష్కరణ పిలుపులో భాగం కాగా, 25 పార్టీలు ఈ వేడుకకు హాజరవుతున్నాయి. ఏ నిర్ణయాన్నయినా అందరూ ఆమోదించాలని లేదు. విభేదించే హక్కు, భిన్నాభిప్రాయాన్ని ప్రకటించే హక్కు ప్రజాస్వామ్యంలో అందరికీ ఉంటుంది. కానీ ఆ పరిధి దాటి ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడే సమస్య మొదలవుతుంది.

సమస్త అధికార సౌధాలూ ఒకేచోట ఉండాలని నిర్ణయించి అందుకోసం బృహత్తరమైన సెంట్రల్ విస్టా ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం పూనుకుంది. అందులో నూతన పార్లమెంటు భవనం ఒకటి. పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా పరిగణిస్తారు. దేశ పౌరుల ప్రయోజనాలు, భద్రతతో ముడిపడివుండే అనేక అంశాలు అక్కడ చర్చకొస్తాయి. చట్టాలు రూపొందుతాయి. ప్రతి పక్షం ఏమి ఆశిస్తున్నదో ప్రభుత్వం తెలుసుకోవటం, ప్రభుత్వ వైఖరేమిటో విపక్షాలు గ్రహించటం ఎక్కడో ఒకచోట రెండు పక్షాలూ అంగీకారానికి రావటం ప్రజాస్వామ్యానికి శోభనిస్తుంది. లేదంటే పరస్పరం విభేదించుకోవటానికైనా ఆ పక్షాల మధ్య అంగీకారం కుదరాలి. ఇవేమీ లేకుండా ఎప్పుడూ కత్తులు నూరుకోవటమే, ఎదుటి పక్షంపై పైచేయి సాధించటమే ధ్యేయంగా మారితే అలాంటిచోట ప్రజాస్వామ్యం బతికి బట్టగడుతుందా? అందుకే బహిష్కరణ నిర్ణయం ఎలాంటి సందేశం పంపుతుందో విపక్షాలు ఆలోచించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్నదనో, దాని నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటున్నాయనో విమర్శిస్తే, నిలదీస్తే అర్థం చేసుకోవచ్చు. అడపా దడపా విపక్షాలు ఆ పని చేస్తూనే ఉన్నాయి. నూతన సౌధాన్ని రాష్ట్రపతి ప్రారంభించటమే సరైందన్న తమ అభిప్రాయాన్ని ప్రజలముందుకు తీసుకువెళ్లటంలో కూడా తప్పు పట్టాల్సిందేమీ లేదు. ఆ వాదనను ఆమోదించటమో, తిరస్కరించటమో ప్రజలు తేల్చుకుంటారు. జనం తీర్పుకే దాన్ని విడిచిపెట్టి యథావిధిగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటే విపక్షాల హుందాతనం వెల్లడయ్యేది. ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన పార్లమెంటు నూతన సౌధం సమకూర్చుకోవటం ఎంతో ప్రాముఖ్యతగల ఘట్టమని విపక్షాలే ప్రకటించివున్నాయి. మరి అటువంటి ముఖ్య ఘట్టానికి ముఖం చాటేయటం ఏం సబబన్న విజ్ఞత వాటికి ఉండొద్దా? స్వాతంత్ర్య వచ్చిన తొలినాళ్లలో పార్లమెంటుతోపాటు రాష్ట్రాల్లోని చట్టసభలన్నిటా పరిణత చర్చలు జరిగేవి. ఆరోగ్యకరమైన విధానాలూ, సంప్రదాయాలూ అమలయ్యేవి. కానీ రాను రాను అవి బలప్రదర్శనలకు వేదికలవుతున్నాయి. నేలబారు రాజకీయాలే దర్శనమిస్తున్నాయి. మొన్న మార్చిలో రూ. 45 లక్షల కోట్ల విలువైన కేంద్ర బడ్జెట్ లోక్‌సభలో ఎలాంటి చర్చా లేకుండా గిలెటిన్‌తో ముగిసిపోయిందని గుర్తుంచుకుంటే మన పార్లమెంటు ఎలాంటి దుఃస్థితిలో పడిందో అర్థమవుతుంది. అదానీ వ్యవహారంపై దర్యాప్తు కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటుకు అంగీకరించాలని విపక్షాలూ... దేశ వ్యవహారాల్లో విదేశీ జోక్యం కోరినందుకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అధికార పక్షమూ పట్టుబట్టడంతో బడ్జెట్ సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. కనీసం కొత్త పార్లమెంటు భవనంలోనైనా అధికార, విపక్షాలు సరికొత్త ఒరవడికి నాంది పలుకుతాయనుకుని భ్రమించిన వారికి విపక్షాల బహిష్కరణ పిలుపు నిరాశ మిగిల్చింది.

పార్లమెంటుపై రాజ్యాంగ నిర్ణాయక సభలో చర్చ జరిగినప్పుడు దాన్ని కేవలం రెండు చట్టసభల సముదాయంగా మాత్రమే పరిగణించటం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమైంది. దేశంలో మున్ముందు చోటుచేసుకోవాల్సిన సామాజిక, ఆర్థిక మార్పులకు దాన్నొక సాధనంగా రాజ్యాంగ నిర్మాతలు పరిగణించారు. ఈ లక్ష్యసాధనలో పార్లమెంటు విఫలమైతే దేశంలో అశాంతి ప్రబలుతుందని కూడా హెచ్చరించారు. కానీ వర్తమాన రాజకీయ నేతలకు అదేమీ గుర్తున్నట్టు లేదు. వారు ఎదుటి పక్షాన్ని శత్రువుగానే భావిస్తున్నారు. అంతకుముందు సంగతెలావున్నా గత పదేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. ప్రజాస్వామ్యానికి ఈ మాదిరి వైఖరి తోడ్పడుతుందో, దాన్ని కడతేరుస్తుందో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే ఇరుపక్షాలూ పరిణతితో మెలగాలి. దేశ ప్రజల విశాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలి. అలిగిన విపక్షాలను ఒప్పించేందుకు, వాటిని కలుపుకొని పోయేందుకు బీజేపీ ప్రయత్నించాలి. తమ అభ్యంతరాల అంతస్సారం ప్రజల్లోకి వెళ్లింది గనుక అంతకుమించటం మితిమీరడంతో సమానమవుతుందని విపక్షాలు గుర్తించాలి. ప్రజాస్వామిక స్ఫూర్తిని విస్మరించటం సరికాదని గ్రహించాలి.

ప్లాస్టిక్ ముప్పు ఇంతింత కాదయా!

విశ్లేషణ



దొంతి నరసింహా రెడ్డి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) ద్వారా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఈ యేడు ప్లాస్టిక్ మీద దృష్టి పెట్టాలని నిర్ణయం జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2023... ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రజలు చేపట్టే చర్యలు ముఖ్యమైనవని గుర్తు చేస్తున్నది. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు తీసుకునే చర్యలు ప్రజల ఆకాంక్షల మేరకే ఉంటాయని నొక్కి చెబుతున్నది. ప్రజా చైతన్యంతో ఒక 'వృత్తాకార ఆర్థిక వ్యవస్థ'కు నాంది పలికే సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ కాలుష్యంతో ఏర్పడే ప్రతికూల ప్రభావాల నుండి భూమిని, మానవ సమాజాన్ని, సహజ ప్రకృతి వ్యవస్థలను రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. ఇప్పటికే బిలియన్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అయింది. జీవవైవిధ్యంతో పాటు మానవ ఆరోగ్యం మీద కూడా ప్లాస్టిక్ దుష్ప్రభావం చూపుతుంది. ఆహారంలో, నీటిలో మైక్రో ప్లాస్టిక్ చేరి నేరుగా మనుష్యుల ఆరోగ్యంపై త్వరగా ప్రభావం చూపే దశకు చేరుకున్నాం. ప్లాస్టిక్ వస్తువులను కాల్చడంవల్ల విష వాయువులు వెలువడి ఆహారం, నీరు కలుషితం అవుతున్నాయి. అయినా ప్లాస్టిక్ ఉత్పత్తి పెరుగుతున్నది. సంవత్సరానికి 40 కోట్ల టన్నులకు చేరుకుందని అంచనా. ఈ ఉత్పత్తిని అరికట్టడానికి నిర్ణయాత్మక చర్యలు చేపట్టకుంటే 2040లోపే ఇది రెట్టింపు అవుతుందని అంచనా.

ప్లాస్టిక్ కాలుష్య సమస్య భౌగోళికంగా ఏదో ఒక దేశానికి పరిమితమైనది కాదు. నదులు, మహాసముద్రాల ద్వారా, గాలి ద్వారా, వివిధ సరఫరా గొలుసు వ్యవస్థల ద్వారా, ఎగుమతులు, దిగుమతుల ద్వారా ఈ కాలుష్యం ఎల్లలు దాటుతున్నది. ముఖ్యంగా మైక్రో, నానోప్లాస్టిక్‌ల విషయంలో ఇది కచ్చితం! మొత్తం సముద్ర వ్యర్థాలలో ప్లాస్టిక్ 85 శాతం ఉందని అంచనా. ఈ వ్యర్థాలు సముద్ర జలచరాలకు ప్రాణ సంకటంగా మారాయి. జీవాల మనుగడ, సుస్థిర పునరుత్పత్తి సమస్యగా మారింది. సముద్రంలో చేరడం కాకుండా, 46 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి మీద గుట్టలుగా మిగులుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాల్లో 17 శాతం కాల్చేస్తున్నారు. కేవలం 15 శాతం పునర్వినియోగం అవుతోంది. ఈ రెండు ప్రక్రియల ద్వారానూ గాలి కాలుష్యం అవుతున్నది. ప్లాస్టిక్ ఉపయోగం క్రమంగా తగ్గించుకోవడమే సుస్థిర మార్గం. దీర్ఘకాలిక పరిష్కారం అంటే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ పదార్థాలను వాడటం.

మైక్రో ప్లాస్టిక్ ఇంకా తీవ్ర సమస్య

ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవడానికి వందల ఏండ్లు పడుతుందని మనందరికీ తెలుసు. ఇప్పుడు కొత్తగా గమనించిన విషయం ఆందోళన కలిగిస్తున్నది. ఈ వ్యర్థాలు ఎండకు, వానకు, గాలికి, సముద్రంలో ఉప్పు నీటికి పగిలిపోతూ, చిన్న సూక్ష్మ పరిమాణంలోకి మారి, కంటికి కనపడని కణాలుగా, ఫైబర్‌గా మారుతున్నాయి. ఈ మైక్రో ప్లాస్టిక్... కణాలుగా, ఫైబర్ (నూలు)గా తాగే నీటిలో, జలచరాల శరీరాలలో చేరి, తరువాత క్రమంగా మనుష్యులలో చేరుతున్నది. ప్లాస్టిక్ ఉత్పత్తిలో మైక్రో ప్లాస్టిక్ ఉత్పత్తి కూడా ఉన్నది. పెళ్లిళ్లలో ఒకరి మీద ఒకరు పోసుకునే చమ్కీలు, పుట్టిన రోజు కేకు కట్ చేసేటప్పుడు వాడుతున్న ప్లాస్టిక్ గోలీలు మైక్రో ప్లాస్టిక్ ఉత్పత్తులే. ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌తో పాటు, అసలు అవసరం లేని (జీరో యూజ్) ప్లాస్టిక్ కూడా ఉత్పత్తి అవుతున్నది. అరటి పండు తొక్క తీసేసి ప్లాస్టిక్ కవర్ ప్యాక్ చేయడం, కొబ్బరి బోండాం ప్లాస్టిక్ కవర్లో పెట్టి అమ్మడం, పళ్లను 'ఫోమ్'తో



చేసిన తొడుగుల మీద పెట్టడం వంటివి అనవసర ప్లాస్టిక్ వినియోగంలోకి వస్తాయి. ప్యాకేజింగ్ పరిశ్రమ పూర్తిగా ప్లాస్టిక్ మీద ఆధారపడి, అనవసర వినియోగాన్ని ప్రజల మీద రుద్దుతున్నది. ఇటువంటి అనవసర ప్లాస్టిక్ వినియోగం మీద ప్రభుత్వ నియంత్రణ అవసరం.

మన జీవన శైలి వల్ల కూడా ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్నది. ప్లాస్టిక్ బాధ పోవాలంటే ఉత్పత్తి తగ్గడంతో పాటు దాని వినియోగం తగ్గాలి. అన్నింటికీ ప్లాస్టిక్ వాడే బదులు అవసరమైన వాటికే వాడితే వ్యర్థాలు తగ్గుతాయి. ప్రతి మనిషీ తన ప్లాస్టిక్ వినియోగం మీద దృష్టి పెట్టి, ప్రణాళిక ప్రకారం చేస్తే, వినియోగం తగ్గించవచ్చు. ప్రతి ఇంటిలో స్వల్ప మార్పులతో, భారీ త్యాగాలు చేయకుండా ప్లాస్టిక్ వినియోగం తగ్గించవచ్చు. అపార్ట్‌మెంట్ సంస్కృతి వల్ల కూడా ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ అవుతున్నది. ప్రతి బహుళ అంతస్తుల నివాస సముదాయాలలో, గేటెడ్ కమ్యూనిటీలలో ప్లాస్టిక్ ఆడిట్ చేసుకుని, పునర్వినియోగ పద్ధతులు అవలంబిస్తే ప్లాస్టిక్ డిమాండ్ తగ్గుతుంది. ప్రభుత్వం కూడా ప్రజా రవాణా వ్యవస్థను విస్తృత పరిస్తే ప్రైవేటు కార్ల వినియోగం తగ్గుతుంది. కార్లు తగ్గాయంటే, ఆ మేరకు వినియోగం ఉండదు. మనం ప్లాస్టిక్ వాడకున్నా ప్లాస్టిక్ భూతం స్పష్టమైన ప్రభావం చూపుతుంది. కర్బన ఉద్గారాల వల్ల భూతాపం పెరుగుతున్నట్లు, ప్లాస్టిక్ ఎవరో ఎక్కడో వాడినా దాని దుష్ప్రభావం వారితో పాటు మనం కూడా ఎదుర్కోవచ్చు.

ఎవరి బాధ్యత ఎంత?

2022 ఫిబ్రవరిలో ఐక్యరాజ్యసమితి 'పర్యావరణ అసెంబ్లీ' ప్లాస్టిక్ కాలుష్యంపై అంతర్జాతీయ, చట్టబద్ధమైన ఒడంబడిక అభివృద్ధి చేయడానికి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 'ఇంటర్ గవర్నమెంటల్ నెగోషియేషన్' కమిటీ (ఐఎన్‌సీ) ద్వారా, ఈ ఒప్పందం 2024 చివరి నాటికి పూర్తవుతుందని భావిస్తున్నారు. మొత్తం ప్లాస్టిక్ జీవిత చక్రంపై దృష్టి సారించి, సుస్థిరమైన ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఒక సమగ్ర విధానాన్ని ఈ ఒప్పందం ద్వారా సాధించవచ్చని ఆశిస్తున్నారు. వనరుల సామర్థ్యం పెంచడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను పరిమాణ పరంగా తగ్గిస్తూ చక్రాకార ఆర్థిక వ్యవస్థ వంటి పరిష్కారాలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు.

2022 డిసెంబర్లో 'ఐఎన్‌సీ–1' మొదటి సమావేశాల్లో చర్చలు జరిగాయి. ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను నిషేధించడం, ఉత్పత్తి మీద ఆంక్షలు విధించడం, మెరుగైన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన విధానాల కూర్పు పైన దృష్టి సారించారు. వివిధ వ్యక్తులు, వర్గాలకు సంబంధించి ఎవరికి ఎంత బాధ్యత ఉంటుంది అనే ప్రశ్నలపై కూడా దృష్టి పెట్టారు. ఉత్పత్తిదారుల మీద కూడా బాధ్యత ఉంది. అదనంగా వ్యర్థాల నిర్వహణలో సాధించాల్సిన మార్పులో సామాజిక న్యాయ కోణం కూడా చర్చించారు. వ్యర్థాల నిర్వహణ మీద ఆధారపడిన జీవనోపాధులకు నష్టం వాటిల్లకుండా చేపట్టవలసిన చర్యలు ఆలోచిస్తున్నారు. ఇక్కడ కొంత సున్నితత్వం అవసరం అని భావిస్తున్నారు. పారదర్శక పర్యవేక్షణ యంత్రాంగాల అవసరం, పర్యావరణానికి హాని కలిగించని ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ వంటివి ఈ ఒప్పందంలోని కీలక అంశాలు కానున్నాయి. ప్రపంచ ప్లాస్టిక్ ఒప్పందం, కాలుష్యం తగ్గించే చర్యల అమలుకు తీసుకునే నిర్ణయాలు, చేపట్టే ప్రక్రియలలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం. ప్రజలు పాల్గొనే విధంగా ఒప్పంద ప్రక్రియలను రూపొందించడం అవసరం. ఈ ఒప్పందం తయారీలో, అన్ని దేశాలు ఆమోదించే దశలలో ఎదురయ్యే సవాళ్లు, తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలలో అవగాహన పెరగాలని ఈ ఒప్పందం మీద ఆశ పెట్టుకున్నవాళ్ళు భావిస్తున్నారు.

ప్లాస్టిక్ మీద ఈ ఒప్పందాన్ని ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్ర వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి ప్రక్రియలతో అనుసంధానించేలా ముడిపెడితే బాగుంటుంది. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి శిలాజ ఇంధనాలను తగ్గిస్తూ, ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకం పెంచే క్రమంలో ప్లాస్టిక్ ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ప్లాస్టిక్ ఉత్పత్తి ముడి చమురు శుద్ధి నుంచి వస్తుంది కనుక. ముడి చమురు వినియోగం తగ్గితే ప్లాస్టిక్ వినియోగం తగ్గవచ్చు. ప్రత్యామ్నాయ ఇంధనాలతో పాటు ప్లాస్టిక్‌కు కూడా ప్రత్యామ్నాయం తేవాలి. అయితే ఇదంత సులువు కాదు. కాగా, మనుషులు ధరించే దుస్తులలో పత్తి, పట్టు, ఉన్ని వంటి సహజమైనవి ప్రోత్సహిస్తే, వేల టన్నుల పాలిస్టర్ వస్త్ర వ్యర్థాలు తగ్గుతాయి. ఎక్కడ వీలైతే అక్కడ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులకు ప్రభుత్వం పెట్టుబడులు పెంచి, తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి. భారతదేశంలో చేనేత రంగానికి ఊతం ఇస్తే ప్లాస్టిక్ తగ్గించవచ్చు. కాలుష్యం తగ్గుతుంది, ఉపాధి పెరుగుతుంది, దేశ ఆర్థిక వ్యవస్థ లాభపడుతుంది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు । 90102 05742

(ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ కోసం ఐరాస 'ఐఎన్‌సీ' రెండో సమావేశాలు మే 29 నుంచి జూన్ 2 వరకు ఫ్రాన్స్‌లో జరగనున్నాయి.)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెనక్కి నడుద్దామా?



సెంగోల్ (రాజదండం) అనేది రాచరికం, భూస్వామ్యవాదాలకు ప్రతీక. అది మ్యూజియంలో ఉండటమే సరైనది. దాన్ని పార్లమెంటులోకి తేవడం అంటే, మనల్ని వెనక్కి తీసుకెళ్లడానికి ప్రయత్నించడమే!

– మినీ నాయర్, రచయిత్రి

ఉప్పొంగిన ఉద్వేగాలు



'సెంగోల్' వార్తలు వచ్చినప్పటినుంచీ ఉద్వేగాలు వెల్లువెత్తుతున్నాయి. ఏ ఒక్క ఉత్తర భారతీయుడూ అది దక్షిణాది సంప్రదాయమని అనలేదు. ఏ దక్షిణ భారతీయుడూ దాన్ని గంగాజలంతో ఎందుకు శుద్ధి చేయాలని అడగలేదు. అంతటా హర్షాతిరేకాలే. ఒక ఉద్వేగం అందరినీ కలుపుతోంది.

– సునందా వశిష్ట్, కాలమిస్ట్

బతకడం సులభం కాదు!



చీతాలు ఎందుకు బతకడం లేదు? ఇదొక కొత్త అక్వేరియం ఏర్పాటు చేయడం లాంటిది. ముందు ట్యాంక్‌ను సిద్ధం చేయాలి, నీరు స్థిరపడాలి, పీహెచ్ విలువలు, ఆక్సిజన్ సరిగ్గా ఉండాలి. నెమ్మదిగా చేపల్ని విడవాలి. అయినప్పటికీ ప్రారంభంలో కొన్ని చనిపోతాయి. ఒక జీవావరణం ఏర్పడాలంటే దానికి సమయం పడుతుంది.

– టైగర్ రమేశ్, వన్యప్రాణి ఔత్సాహికుడు

తప్పుడు వార్తలు



మీ వ్యూస్, హిట్స్ కోసం దయచేసి తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దు. దాన్ని చీప్ టీఆర్‌పీ అంటారు. నేను ఏ సినిమానూ నిషేధించమని అనలేదు, మున్ముందూ అనను. సినిమాలను నిషేధించడం ఆపండి. తప్పుడు వార్తలు ప్రచారం చేయడం మానండి.

– నవాజుద్దీన్ సిద్ధిఖీ, నటుడు

నియమాలకు బలి




నాకు 26 ఏళ్లకు పెళ్లయింది. 27 ఏళ్లకు తల్లినయ్యాను. 32వ యేట విడాకులు తీసుకున్నాను. సమాజ నియమాలకు అనుగుణంగా నడుచుకున్నప్పటికీ ఒంటరిగా మిగిలిపోయాను. వయసు కాదు, వివేకం ముఖ్యం.

– శిఖా భట్, కంటెంట్ పబ్లిషర్

తెలంగాణ సాంస్కృతిక కేతనం

భాషా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో గాఢాంధకారం అలముకున్న గడ్డు కాలాన వెలుగులు పంచి తరతరాల జాతిజనులు రుణపడేలా చేసిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణలో 90 శాతం ప్రజలకు వారి భాషలో మాట్లాడుకునే అవకాశం లేదు. తమ భాషల్లో విద్యాభ్యాసం చేసే సౌకర్యం లేదు. ప్రాథమిక హక్కులు లేవు. అటువంటి పరిస్థితుల్లో భాషా సాహిత్యాల వికాస యుగానికి సూర్యోదయంలా రంగం మీదకు వచ్చిన వ్యక్తుల్లో సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, దేవులపల్లి రామానుజరావు వంటి వారు గణనీయులు. శ్రీకృష్ణ 'దేవరాయాంధ్రభాషా నిలయం', 'ఆంధ్ర సారస్వత పరిషత్తు', 'గోల్కొండ' పత్రిక, 'సుజాత' పత్రిక, 'ఆంధ్ర మహాసభ'లు, గ్రంథాలయోద్యమం వంటి వేదికల ద్వారా తెలంగాణ అభ్యుదయాన్ని శీఘ్రతరం చేయడానికి మాడపాటి, సురవరం చేసిన కృషి చిరస్మరణీయం.



సురవరం ప్రతాపరెడ్డి

1896, మే 28న పాలమూరు జిల్లా బోరవెల్లిలో సురవరం ప్రతాపరెడ్డి జన్మించారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే సంస్కృత విద్వాంసులు వెల్లాల శంకరశాస్త్రి వద్ద 'రఘువంశం', 'కుమార సంభవం', 'భారత చంపూ', 'కిరాతార్జునీయం', 'లఘుసిద్ధాంత కౌముది' వంటి గ్రంథాలను అధ్యయనం చేశారు. నిజాం కళాశాలలో ఎఫ్.ఎ. ఇంటర్మీడియెట్, బీఏ పూర్తి చేశారు. తర్వాత న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేశారు. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో లోతైన ప్రజ్ఞను సముపార్జించారు. తెలంగాణలో కవులెక్కడున్నారన్న విమర్శలకు ధీటైన సమాధానం చెప్పడానికి ఆయన చేసిన పరిశోధనా కృషి నుంచి ఉద్భవించిందే 'గోల్కొండ కవుల సంచిక'. 'గోల్కొండ' పత్రిక ద్వారా ఆ విజ్ఞాన సారాన్ని అనుదినం పంచి పెడుతూ తెలంగాణ జ్ఞానార్తిని తీర్చారు. ఆత్మాభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ఏమీలేక స్తబ్ధుగా ఉన్న తెలంగాణను వెన్నుతట్టి జాగృతం చేసిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. భాషపైనే గాక భావ ప్రకటనపైన కూడా తీవ్ర నిర్బంధం అమల్లో ఉన్న కాలంలో గోల్కొండ పత్రిక ద్వారా ప్రతాపరెడ్డి అత్యంత సాహసోపేతంగా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

పత్రికా సంపాదకునిగా, ఆ పత్రికకు ప్రూఫ్ రీడర్ గా, అన్నీ తానే అయ్యి గోల్కొండను నడుపుతూనే కవిత్వం, కథలు, నవలలు, నాటికలు, విమర్శలు... ఒక్కటేమిటీ అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. 'పరుసవేది', 'ధర్మశాల', 'మిత్రుడా', 'తెలుగువాడు' వంటి ఖండకావ్యాలు, 'శుద్ధాంతకాంత' అనే నవల, 'ఉచ్చల విషాదం', 'భక్తతుకారం' నాటకాలు, 'హైందవ ధర్మ వీరులు', 'రామాయణ విశేషాలు', 'హిందువుల పండుగలు', 'మొగలాయి కథలు', 'ప్రతాపరెడ్డి కథలు' ఇలా ఎన్నో రచనలు చెప్పుకోదగినవి. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' ప్రతాపరెడ్డికి అపారమైన గౌరవం, ఆదరణ తెచ్చిపెట్టినది. కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి తెలుగు వారికి లభించిన తొలి పురస్కారం ఈ గ్రంథానికి దక్కింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈ గ్రంథాన్ని ప్రచురించింది. 1952లో శాసనసభకు పోటీచేసి వనపర్తి నుంచి విజయం సాధించారు. అయితే నాటి రాజకీయాలలో ఇమడలేకపోయారు. తన జీవితాన్ని, తన కృషిని తన సందేశంగా మిగిల్చి 1953, ఆగస్టు 25న కన్నుమూశారు.

– డా।। జె. చెన్నయ్య, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి

(రేపు సురవరం ప్రతాపరెడ్డి జయంతి)

సారాంశం

సరికొండ చలపతి

బ్లాక్ అండ్ వైట్‌లో కరెన్సీ కథ

ముందు సరదాగా అక్బర్, బీర్బల్ లోపలికి, బయటకి కథ చెప్పుకుందాం.

ఎప్పటిలాగే ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. రాజకీయాలు, వ్యూహాలు, ఆర్థిక విషయాలు చాలాసేపు మాట్లాడేసుకున్నారు. ఓ గంట పాటు సంభాషణ సాగాక, అక్బర్‌కు కాస్త చిల్ అవుదామనిపించి.. ''బీర్బల్!.. నీకు ఓ పరీక్ష, మన మధ్య ఇలాంటి సరదా జరిగి చాలా రోజులయింది. కానీ, ఈ సారి అంత తేలిగ్గా నన్ను ఏమార్చలేవు..' అన్నాడు. దానికి బీర్బల్ సరేనన్నాడు. వెంటనే అక్బర్.. 'నన్ను ఒక్క నిమిషంలో ఈ గది నుంచి బయటకు పంపగలవా..' అని అడిగాడు. సీరియస్ విషయాల నుంచి సడెన్‌గా సరదా సంభాషణకు మారడంతో కంగుతిన్న బీర్బల్.. రెప్పపాటు కాలం ఆలోచించి.. 'నాకు సాధ్యం కాదు జహాపనా!, నేను ఓడిపోయాను. కానీ, మీరు బయటకు వెళ్తే మాత్రం ఒక్క నిమిషంలో లోపలికి తీసుకురాగలను..' అని అన్నాడు. అక్బర్ విజయ దరహాసంతో .. ఓకే అదీ చూద్దాం, ఎలా తీసుకురాగలవో..' అంటూ గదిలోంచి బయటకు వెళ్లాడు. అలా గదిలోంచి బయటకు వెళ్లిన అక్బర్ బీర్బల్ రాకకోసం ఎదురు చూడసాగాడు. కొంతసేపటికి అక్బర్‌కు లైట్ వెలిగింది. తాను అడిగినట్టుగానే బీర్బల్ తనను బయటికి పంపినట్టు అర్థమయి మొహాన చిరునవ్వు ప్రత్యక్షమయింది.

లోపలికి తీసుకు వస్తానన్న బీర్బల్ మాట, పందెం అక్బర్‌ను బయటకు పంపింది.. ఇది సరదా కథే కానీ.. 2016లో దాదాపు ఇదే కథ జరిగింది.

బయట నల్లధనం రూపంలో ఉన్న 3 లక్షల కోట్లను ఆర్థిక వ్యవస్థ లోపలికి తీసుకువస్తానన్న మాటతో నోట్లను రద్దు చేసి, ఆపై కొత్త రూ. 2000 నోట్లతో మళ్లా అంతా బయటకు పంపిన కథ ఇది.

పైన కథలో అక్బర్ మొహంలో చిరునవ్వు కనిపిస్తే, 2016లో బ్లాక్‌మనీ వైట్ అయి.. దాని యజమానుల



ముఖాన నవ్వు కనిపించింది.

పెద్ద నోట్లు 500, 1000 రూపాయలు బ్లాక్ మనీకి, టెర్రర్ ఫైనాన్సింగ్‌కు ఉపయోగ పడతాయని, వాటిని రద్దు చేసి.. మొత్తం భారతదేశాన్ని తెల్లముఖాలతో క్యూలో నిలబెట్టి... బ్లాక్‌మనీని ఇంకా ఈజీగా దాచుకునేలా 2000 రూపాయల నోట్లు ముద్రించి పంచేశారు. మొత్తం ధనాన్ని బ్లాక్ హోల్‌లోకి పంపేశారు.

దానితో సుప్రీం కోర్టులో చెప్పిన 3 లక్షల కోట్లు కాదు కదా.. విరమించుకున్న నోట్లు మళ్లీ ముద్రించడానికి అయ్యే ఖర్చు లెవెల్లో కూడా నల్లధనం నుంచి రానేలేదన్న విమర్శ వినిపించింది.

ఇప్పుడు రూ. 2000 నోట్ల రద్దు దిశగా ప్రయత్నాలు. అదే కారణం 'నల్లధనం కంట్రోల్ చేయడానికే..'

బ్లాక్‌మనీని ఎకానమీ లోపలికి తీసుకురావడానికే రూ. 2000 నోట్ల ముద్రణ, బ్లాక్ మనీ లోపలకి తీసుకురావడానికే రూ. 2000 నోట్ల ఉపసంహరణ... కానీ అంతిమంగా చిరునవ్వుతో బ్లాక్‌మనీ బయటకు పోవడానికే దారి తీస్తోంది. అక్బర్, బీర్బల్ కథలా.

నల్ల ధనం వెలికితీత... అది భారతీయుల ఎకౌంట్‌లోకి డిపాజిట్ కావడం..అనేది 2016 నుంచీ ఓ ప్రహసనమే. అమిత్ షా అన్నట్టుగా 'పొలిటికల్ జుమ్లా'లా తయారయ్యింది.

''ఇప్పుడు మార్కెట్లో రూ. 2000 నోట్లు కనిపించడమే లేదు..అంటే లక్షలాది రూ.2000 నోట్లు ఏమయ్యాయి. ఎక్కడో బ్లాక్‌మనీ రూపంలో ఉన్నాయన్న మాట. ఇప్పుడు ఆ లక్షల కోట్ల డబ్బు బయటకి రాబోతోంది..''..అని రద్దు అభిమానులు ఆనందిస్తోంటే..

''2016లో చూశాంగా ఎంత వచ్చిందో. అది రాజమార్గంలో బయటకి పోయింది. అంత స్ట్రిక్ట్‌గా చేసినప్పుడే ఏమీ చెయ్యలేక పోయారు. ఇప్పుడిలా బ్యాంకుకు పోతే అలా రూ. 2000 నోట్లు మార్చుకుని రావచ్చు.. ఐడీ కార్డు కూడా లేకుండా. కోటి రూపాయలు ఉన్నా కాసింత తిరిగే ఓపిక ఉంటే బ్లాక్ ఇట్టే వైట్ అయిపోతుంది. మళ్లీ అంతా బ్లాక్‌హోల్‌లో పోసినట్టే..''

– అని 2016 లో నోట్ల మార్పిడి కోసం మండుటెండల్లో క్యూలో నిల్చుని, కాళ్లకు కాయలుకాసిన వారి కడుపు మంట.

నల్లధనాన్ని కంట్రోల్ చేయడానికే రూ. 2000 నోట్ల ఉపసంహరణ అన్న వార్త విని.. ఆహా!.. రాజకీయాలు ప్రక్షాళన అవుతాయి అని ఎవరైనా అంటే.. 2016 నోట్ల రద్దు తర్వాత ఎన్ని ఎన్నికలు జరిగాయి.. ఎక్కడయినా మనీ పంపకం ఆగినట్టు కనిపించిందా.. మన పక్కన మునుగోడు ఎలక్షన్‌లోనే రాజకీయ పార్టీలు 100 కోట్లు ఖర్చుపెట్టినట్టు విన్నాం కదా..

– నల్ల ధనాన్ని ఎక్కువగా ఎంకరేజ్ చేసేది రియల్ ఎస్టేట్ ..అక్కడ ఇప్పుడు లావాదేవీలన్నీ తెల్లమొహం వేశాయా..?

– టెర్రర్ ఫైనాన్సింగ్, వారి యాక్టివిటీ ఆగిందా..?

– మేం క్యూల్లో గంటల తరబడి, రోజుల తరబడి నిలబడ్డ ఏడేళ్ల తర్వాత సర్కారు దొరకబుచ్చుకున్న బ్లాక్ మనీ ఎంత..? ఇప్పుడీ తంతు ఎఫెక్ట్ ఎంత? అని ఘాటుగా విసుర్లు వస్తున్నాయి. దీనితో పాటు జోక్‌లు కూడా మస్తుగా పేలుతున్నాయ్..

■ రెండువేల రూపాయలనోటు బీఆర్ఎస్ జెండా రంగులో పింక్‌కలర్‌లో ఉంటది.. అది మోదీకి నచ్చలేదు.. అందుకే రద్దుచేస్తున్నాడని వెటకారాలు..

'నోట్' దిస్ పాయింట్..

■ 1873లోనే అమెరికా డీమానిటైజేషన్ చేసింది. బంగారు నాణేలకు అధికారిక చలామణీ కల్పించేందుకు అప్పటికే ఉన్న వెండి నాణేలను రద్దు చేసింది. దీంతో నగదు చలామణీకి కొరత ఏర్పడి తర్వాతి ఐదేళ్లు ఆర్థిక సంక్షోభం తలెత్తింది. దీనితోపాటు వెండి గనుల యజమానులు, రైతుల ఒత్తిడితో 1878లోనే తిరిగి వెండి నాణేలను పునరుద్ధరించింది.

■ పన్నుల ఎగవేత, అధిక నగదు చలామణీని అరికట్టేందుకు 1982లో ఘనా కరెన్సీ 50 సెడిని రద్దు చేసింది. కానీ ఇది పూర్తిగా ఫెయిలైంది. జనం బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసం కోల్పోయారు.

■ 1987లో బ్లాక్ మనీని అరికట్టేందుకంటూ మయన్మార్ మిలటరీ ప్రభుత్వం 80 శాతం నోట్లను రద్దు చేసింది. అది ఫెయిలవడమేగాక.. విద్యార్థుల ఆందోళనలతో ప్రభుత్వం దిగిపోవాల్సి వచ్చింది.

■ నల్ల ధనాన్ని నియంత్రించడం కోసమంటూ 1991లో సోవియట్ యూనియన్ అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచేవ్ 50, 100 రూబుల్ నోట్లను రద్దు చేశారు. చెలామణీలో ఉన్న నగదులో అవి ఏకంగా మూడో వంతు కావడంతో.. సమస్యలు తలెత్తాయి. యూనియన్‌లో భాగమైన కజకిస్తాన్, ఉక్రెయిన్‌లపై తీవ్ర ప్రభావం పడింది. జనానికి ప్రభుత్వంపై, బ్యాంకులపై నమ్మకం దెబ్బతిన్నది. అంతిమంగా ఈ పరిస్థితి సోవియట్ యూనియన్ విచ్ఛిన్నానికి ఆజ్యం పోసింది.

■ 1993లో జైరేలో సంస్కరణల పేరిట నోట్లను రద్దు చేయడం ఆర్థిక సమస్యలకు దారితీసి.. నాటి నియంతృత్వ పాలకుడు మొబుటు పదవి నుంచి దిగిపోవడానికి దారి తీసింది.

■ 2010లో ఉత్తర కొరియా నియంత కిమ్‌జోంగ్–ఐఐ బ్లాక్ మార్కెట్ నియంత్రణ, ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడం లక్ష్యంగా కరెన్సీ నోట్లలో మార్పులు చేశారు. దీనితో నిత్యావసరాల ధరలు పెరిగి జనం ఆందోళనల బాట పట్టారు. ఈ పరిస్థితి నాటి ఆర్థిక మంత్రి హత్య వరకు దారితీసింది.

■ భారత్‌లో నోట్ల రద్దు చేపట్టిన 2016లోనే వెనెజువెలాలో నికోలాస్ మదురో ప్రభుత్వం 100 బొలివర్ నోట్లను రద్దు చేసింది. మొత్తం చలామణీలో ఉన్న నగదులో 77 శాతం ఉన్న ఆ నోట్లను మార్చుకోవడానికి కేవలం మూడు రోజుల గడువు ఇచ్చింది. కానీ హింసాత్మక నిరసనలు చెలరేగడంతో నోట్లను మార్చుకునే గడువు పెంచింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.అష్టమి పూర్తి (24గంటలు), **నక్షత్రం:** మఖ రా.9.54 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.8.15 నుండి 10.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.28 నుండి 7.11 వరకు, **అమృతఘడియలు:** సా.6.54 నుండి 7.34 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.24.

క్లుప్తంగా...

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

శ్రీవారి దర్శనానికి 36 గంటలు


ఆలయం వెలుపల జస్టిస్ శ్యాంసుందర్

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూ లైన్లు చేరాయి. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. వీరికి ఆయా ప్రాంతాల్లో ఆహారం, పాలు, తాగు నీరును టీటీడీ అందిస్తోంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే శుక్రవారం మధ్యాహ్నానికి 70 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 70 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్‌డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కాగా, శ్రీవారిని గురువారం 74,583 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.37 కోట్లు వేశారు. శ్రీవారిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్, తెలంగాణ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు దర్శించుకున్నారు.

హజ్ యాత్ర ఏర్పాట్లు సంతృప్తికరం

తాత్కాలిక హజ్ హౌస్ ఏర్పాట్లు పరిశీలించిన మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్

సాక్షి, అమరావతి: హజ్–2023 యాత్ర కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంతృప్తికరమైన ఏర్పాట్లు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ అన్నారు. హజ్ యాత్రికుల కోసం నంబూరులో ఏర్పాటు చేసిన తాత్కాలిక హజ్ హౌస్ (సిరాజుల్ ఉలూమ్ మదరస)లో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తొలిసారిగా హాజీలు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పవిత్ర మక్కా, మదీన నగరాలకు నేరుగా విమానాల్లో వెళ్తున్నారన్నారు. టికెట్ ధరలో వ్యత్యాసం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పెద్ద మనస్సుతో స్పందించి ఆ మొత్తాన్ని ప్రభుత్వం తరఫున విడుదల చేశారని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికులు దువా చేయాలని ఇక్బాల్ అహమ్మద్ కోరారు.

రూ. 631 కోట్లతో హైవే టు హైవే కనెక్టివిటీ రోడ్డు

డోన్‌లో శంకుస్థాపన చేసిన మంత్రి బుగ్గన


పనులు ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

డోన్: నంద్యాల జిల్లా డోన్‌లోని శ్యాంజో స్కూల్ వద్ద 44వ జాతీయ రహదారి నుంచి ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె 430బీ ఎన్‌హెచ్ వరకు 53 కిలోమీటర్ల దూరం నిర్మిస్తోన్న నేషనల్ హైవే లింకు రోడ్డు పనులకు శుక్రవారం మంత్రి బుగ్గన శంకుస్థాపన చేశారు. నేషనల్ హైవే ఈఈ ఇందిర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పొక్లెయిన్ నడిపి పనులను మంత్రి ప్రారంభించారు. బుగ్గన మాట్లాడుతూ రూ.631 కోట్లతో హైవే టు హైవే కనెక్టివిటీ రోడ్డును నిర్మించడం రాష్ట్రంలో ఇదే ప్రథమమని చెప్పారు. బేతంచెర్ల నుంచి 4 లైన్ల రహదారి ఇప్పటికే పూర్తయినందున.. సోమయాజుపల్లె వరకు 4లైన్ల రహదారిని వచ్చే ఏడాదికంతా పనులు పూర్తి చేస్తామన్నారు.

28న జీఎస్ఎల్వీ-ఎఫ్12 కౌంట్‌డౌన్ ప్రారంభం


షార్‌లోని రెండో ప్రయోగవేదికపై నింగికి ఎక్కుపెట్టిన బాణంలా సిద్ధంగా ఉన్న జీఎస్ఎల్వీ ఎఫ్12 ఉపగ్రహ వాహకనౌక

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి సోమవారం ఉదయం 10.42 గంటలకు జియో సింక్రోనస్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (జీఎస్ఎల్వీ–ఎఫ్12) ప్రయోగించేందుకు ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్ నిర్వహించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ప్రయోగానికి 27.30 గంటల ముందు కౌంట్‌డౌన్ నిర్వహిస్తారు. అయితే శనివారం ఎంఆర్ఆర్ సమావేశం, లాబ్ సమావేశం అనంతరం కౌంట్‌డౌన్ సమయం, ప్రయోగ సమయం అధికారికంగా ప్రకటించనున్నారు. శుక్రవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం నిర్వహించారు. రాకెట్‌లోని అన్ని దశలకు తుది విడత పరీక్షలు పూర్తి చేసి ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించిన అనంతరం ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) వారికి అప్పగించారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో మరోమారు ల్యాబ్ సమావేశం నిర్వహించారు. జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్‌కు సంబంధించి లాంచ్ రిహార్సల్స్ నిర్వహించారు. 26 గంటల కౌంట్‌డౌన్ అనంతరం సోమవారం 10.42 గంటలకు 2,232 కిలోలు బరువు కలిగిన నావిక్–01 ఉపగ్రహాన్ని మోసుకుని జీఎస్ఎల్వీ రాకెట్ నింగి వైపుకు దూసుకెళ్లేందుకు షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై సిద్ధంగా వుంది.

కలాం స్ఫూర్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలి


సర్టిఫికెట్లను అందజేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

మిసైల్‌మ్యాన్ ఏపీజే అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్ పిలుపునిచ్చారు. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ కేంద్రంలోని బ్రహ్మప్రకాష్ హాలులో దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన ఈ ఏడాది పదో తరగతిలోకి వెళ్లనున్న విద్యార్థులు 56 మందిని ఎంపిక చేసి యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంలో భాగంగా యువికా–2023 కార్యక్రమానికి ఆహ్వానించి తీసుకొచ్చారు. శుక్రవారం ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో వర్చువల్ పద్ధతిలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సుమారు గంటకు పైగా సమాధానాలు ఇచ్చి వారిని ఉత్తేజపరిచారు. అనంతరం చైర్మన్ ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులు ఎంతో తెలివైన వారని, వారిలో దాగివున్న సృజనాత్మకతను బయటకు తీస్తే మంచి పౌరులుగా తయారవుతారని తెలిపారు. నేటి తరం విద్యార్థులు స్పేస్ టెక్నాలజీ వైపు రాకుండా ఇతర రంగాల వైపు మొగ్గు చూపుతు న్న నేపథ్యంలో వారిని స్పేస్ సైన్స్ వైపు మళ్లించేందుకు యువ విజ్ఞాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామ ని చెప్పారు. రాకెట్లు, ఉపగ్రహాలు, ఆర్బిట్లు అనే వి మేథమేటిక్స్‌తో ఎక్కువగా ముడిపడి ఉంటా యని అన్నారు. అందుకే మేథమేటిక్స్‌లో మంచి ప్రావీణ్యం ఉంటే ఇస్రో శాస్త్రవేత్తలుగా రావడానికి ఎంతో వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, షార్ కంట్రోలర్ శ్రీని వాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఆర్.వెంకట్రామన్, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9 మంది ఎర్ర స్మగ్లర్లు అరెస్ట్

ఆళ్లగడ్డ(నంద్యాల): తమిళనాడుకు చెందిన 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను శుక్రవారం అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మొబైల్ పార్టీ అటవీ అధికారి నాగేంద్రనాయక్ తెలిపిన వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం నంద్యాల, వైఎస్సార్ జిల్లాల సరిహద్దుల్లో కానగూడురు సమీపంలోని హైవేలో బస్సు దిగిన తమిళ కూలీలు అహోబిలం అడవిలోకి చొరబడ్డారు. దీంతో రుద్రవరం రేంజ్ పరిధిలోని అటవీ అధికారులు, సిబ్బంది గురువారం రాత్రి నుంచి అడవిలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున స్మగ్లర్లు కడప, ప్రకాశం జిల్లా సరిహద్దుల్లోని చింతమాను రస్తా సమీపంలో ఉన్నట్లు గుర్తించి.. ఒక్కసారిగా చుట్టుముట్టి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రెండు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రామకృష్ణన్, అశోకన్, మణి, పాండు, జయశంకర్ రాజి, షణ్ముగం సురులాయన్, చిన్నపాయన్, క్రిష్ణమూర్తి, వెంగటేశన్‌ను అరెస్ట్ చేసి తిరుపతిలోని ఎర్ర చందనం ప్రత్యేక కోర్టులో హాజరు పరచగా నిందితులకు రిమాండ్ విధించారు. దాడుల్లో నంద్యాల మొబైల్ పార్టీతో పాటు ఆలమూరు, అహోబిలం, డి.వనిపెంట, నూతల సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనకు మరో ముందడుగు

- సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా కార్యాచరణ
- ఆరుగురు అధికారులతో అధ్యయన కమిటీ ఏర్పాటు
- కులగణన చేపట్టిన రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం
- త్వరలో మంత్రుల బృందానికి నివేదిక



సాక్షి, అమరావతి/రామచంద్రపురం: ఆంధ్రప్రదేశ్‌లో కుల జనగణన చేపడతామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు అనుగుణంగా మరో ముందడుగు వేశారు. రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు అవసరమైన అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. వార్డు, గ్రామ సచివాలయాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి, ప్లానింగ్ సెక్రటరీ ఈ కమిటీ సభ్యులు. సభ్యుడైన ప్లానింగ్ సెక్రటరీ.. కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కులగణన చేపట్టిన పలు రాష్ట్రాల్లో ఈ కమిటీ పర్యటించి అక్కడ క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న పద్ధతులను అధ్యయనం చేసి మంత్రుల బృందానికి నివేదిక ఇస్తుంది. రాష్ట్రంలో కుల జనగణన చేపట్టేందుకు అవసరమైన ఉత్తమ పద్ధతిని రూపొందించడంలో సాంకేతిక సహకారం అందించాలని రాష్ట్ర ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగాన్ని సీఎస్ ఆదేశించారు. కులగణన కోసం దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టినప్పటికీ కేంద్రప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదు. బీసీ సంఘాల ఆవేదనను అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్ ఏప్రిల్ 11వ తేదీన కులగణన చేపట్టేందుకు హామీ ఇచ్చారు. దీంతో రాష్ట్రంలోని బీసీ సంఘాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. భారత దేశంలో కులాల వారీగా జనాభా లెక్కలను 1872 లోనే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టింది. 1931 నుంచి కులాల వారీ జనగణన ఆగిపోయింది. 1951 నుంచి జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల జనాభాను మాత్రమే లెక్కిస్తున్నారు. మిగిలిన జనాభాను జనరల్ కేటగిరీగా పేర్కొంటున్నారు.

మాట నెరవేర్చిన సీఎం వైఎస్‌జగన్

కులగణన చేపట్టేందుకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీనివాసవేణుగోపాలకృష్ణ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన ఆయా కులాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అధికారం కోసం అబద్ధాలను చెప్పేందుకే మహానాడు అన్నారు.

గ్రామ సచివాలయాల పనితీరు భేష్

- కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల ప్రశంస
- తేటగుంట గ్రామ సచివాలయం సందర్శన

తుని రూరల్: గ్రామ సచివాలయాల పనితీరు బాగుందని కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల బృందం ప్రశంసించింది. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట–1 గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఏపీపీఎస్సీ సభ్యుడు నూతలపాటి సోనివుడ్‌తో కలసి కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల బృందం సందర్శించింది. గ్రామంలోనే సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న 11 విభాగాల సేవలు, ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉన్న వలంటీర్ వ్యవస్థ గురించి డీఎల్‌డీవో ప్రసాదరావు వారికి వివరించారు. ప్రజల ఆర్థిక ప్రగతి కోసం క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు సమన్వయంతో పని చేస్తున్నాయని కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బృందం సభ్యులు కె.ప్రకాషన్, డాక్టర్ సీకే సాజిత్, డాక్టర్ జిప్సన్ వీల్, అడ్వొకేట్ సి.జయచంద్రన్ ప్రశంసించారు. ఏపీపీఎస్సీ విధివిధానాలపై తాము అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు తెలిపారు. జగన్నాథగిరిలోని నాసా క్యాంపస్‌లో ఉన్న ఏపీపీఎస్సీ సభ్యుడు నూతలపాటి సోనివుడ్ నివాసానికి వచ్చిన కేరళ బృందం సభ్యులు విలేకరులతో మాట్లాడారు. అనంతరం కేరళ బృందం విజయవాడ బయలుదేరి వెళ్లింది.

నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారమే పదోన్నతులు కల్పించాలి

- నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ప్రమోషన్లు కల్పించడం చట్ట వ్యతిరేకం
- క్యాట్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోం
- రాత పరీక్ష మెరిట్ ఆధారంగానే పదోన్నతులు కల్పించాలి
- దక్షిణ మధ్య రైల్వే అధికారులకు హైకోర్టు ఆదేశం
- రైల్వే మంత్రిత్వ శాఖ పిటిషన్లు కొట్టివేత

సాక్షి, అమరావతి: ఉద్యోగుల పదోన్నతుల నిమిత్తం జారీ చేసిన నోటిఫికేషన్‌లో నిర్దేశిత ప్రమాణాలతో నిర్దిష్ట ఎంపిక విధానాన్ని పేర్కొన్నప్పుడు దాని ప్రకారమే పదోన్నతులు కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పర్మినెంట్ వే సూపర్‌వైజర్లకు పరిమిత శాఖపరమైన పోటీ పరీక్షల (ఎల్‌డీసీఈ) ద్వారా పదోన్నతులకు ఎంపిక చేసేందుకు రాత పరీక్ష నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు... ఆ తర్వాత రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా కాకుండా సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. సీనియారిటీ ఆధారంగా కల్పించిన పదోన్నతులను రద్దు చేస్తూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఇదే సమయంలో ఇప్పటికే ప్రయోజనాలు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను మెరిట్‌లో వారు సాధించిన స్థానం ఆధారంగా రిజర్వ్‌డ్ పోస్టుల్లో సర్దుబాటు చేయాలన్న క్యాట్ ఆదేశాలను హైకోర్టు తప్పుపట్టింది. ఈ ఆదేశం చట్ట ప్రకారం చెల్లుబాటు కాదని చెప్పింది. ఈ 16 పోస్టుల్లో ఒక్కటి కూడా ఎస్టీ అభ్యర్థులకు కేటాయించలేదని, అలాంటప్పుడు వారు రాత పరీక్ష రాసి మెరిట్ ద్వారా ఇతరుల్లాగే పదోన్నతికి ఎంపిక కావొచ్చని తెలిపింది. క్యాట్ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎస్టీ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు అనుమతించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమిల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

మెరిట్ కాకుండా.. సీనియారిటీ ఆధారంగా ఎంపిక...

పర్మినెంట్ వే సూపర్‌వైజర్లకు 25 శాతం ఎల్‌డీసీఈ కోటా కింద 16 పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు వీలుగా దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ ఆఫీస్ 2004లో నోటిఫికేషన్ జారీ చేసింది. రాత పరీక్ష ద్వారా పదోన్నతులు కల్పిస్తున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. 181 మంది దరఖాస్తు చేసుకోగా, 176 మంది అర్హులుగా తేలారు. వీరికి రాతపరీక్ష నిర్వహించగా 59 మంది ఉత్తీర్ణులయ్యారు. అయితే, రైల్వే అధికారులు మాత్రం రాత పరీక్షలో అభ్యర్థులు సాధించిన మెరిట్ ఆధారంగా కాకుండా వారి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించారు. దీనిని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన క్యాట్... రైల్వే అధికారుల తీరును తప్పుపట్టింది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే పదోన్నతులకు ఎంపిక చేయాలని 2008లో ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ అదే ఏడాది హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలపై ఇటీవల జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తుది విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వెలువరిస్తూ దక్షిణ మధ్య రైల్వే జారీ చేసిన నోటిఫికేషన్‌లో రాత పరీక్ష ద్వారా మాత్రమే పదోన్నతులకు ఎంపిక చేస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. కాబట్టి ఆ ప్రకారమే చేయాలి తప్ప, మరో విధానాన్ని అనుసరించడం సరికాదంది. ఈ విషయంలో క్యాట్ ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి తప్పులేదని, అందులో జోక్యం చేసుకోబోమని స్పష్టంచేసింది. రైల్వే శాఖ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే పదోన్నతులకు ఎంపిక చేయాలని రైల్వేశాఖను ధర్మాసనం ఆదేశించింది.

కొప్పర్తిపై కడుపు మంట!

కొత్త నగర నిర్మాణానికి వైఎస్సార్ జిల్లాలో కొప్పర్తి ఎంపిక

- ఈ మేరకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు
- ఏడాదికి రూ.250 కోట్లు చొప్పున కేటాయించనున్న కేంద్రం
- ఇంతలోనే 'ఈనాడు' ఏడుపులు, పెడబొబ్బలు
- అమరావతిని ఎంపిక చేయలేదంటూ రామోజీ శివాలు
- అమరావతి తప్ప రాష్ట్రంలో మరేదీ ఊరు కాదన్నట్టుగా చిందులు
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని జీర్ణించుకోలేక సీమపై విషం



సాక్షి ప్రతినిధి, కడప: వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే 'ఈనాడు' ఏడుపులు, పెడబొబ్బలు పెడుతోంది. సీమ ప్రగతిని తట్టుకోలేక విషం కక్కుతోంది. అయితేగియితే తమ పెట్టుబడిదారుల మానస పుత్రిక అమరావతి అభివృద్ధి చెందాలి కానీ మిగతా ప్రాంతాలు అభివృద్ధి చెందడం ఏమిటనే రీతిలో శివాలెత్తిపోతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈనాడులో ఒక కథనాన్ని వండివార్చింది. అన్ని వసతులు ఉన్న అమరావతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని యథావిధిగా రామోజీ చిందులు తొక్కారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు దేశంలో 8 కొత్త నగరాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూనుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి రాష్ట్రంలో ఒక నగరాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు కోరగా ప్రభుత్వం కడప సమీపాన ఉన్న కొప్పర్తిని ఎంపిక చేసింది. కొప్పర్తి ఇప్పటికే ఇండస్ట్రియల్ హబ్‌గా భాసిల్లుతోంది. పలు కంపెనీలు ఇక్కడ తమ తయారీ యూనిట్లను సైతం ప్రారంభించాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తిని కొత్త నగరంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపింది. అయితే ఇది తప్పన్నట్టుగా.. రాష్ట్రంలో అమరావతి తప్ప మరేదీ ఊరు కాదన్నట్టుగా 'ఈనాడు' కడుపు మంట'తో చెలరేగిపోయింది. కేంద్ర ప్రభుత్వం కొత్త నగరాల ఎంపికకు అమరావతి అచ్చు గుద్దినట్టు సరిపోతుందని.. అమరావతిలో అన్ని వసతులు ఉన్నాయని యథావిధిగా తనకలవాటైన రీతిలో రామోజీ చెలరేగిపోయారు.

కొప్పర్తికి అనుకూలతలు ఇవే..

ఇప్పటికే కొప్పర్తి పారిశ్రామికవాడను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసింది. 6,914 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తోంది. అందులో రూ.750 కోట్లుతో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్‌ను నెలకొల్పింది. ఒక్క దీని పరిధిలోనే రూ.10 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. తద్వారా లక్ష మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు దక్కనున్నాయి. భవిష్యత్‌లో మొత్తంగా కొప్పర్తి పరిధిలో 2 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఈ నేపథ్యంలో కొప్పర్తిలో కొత్త నగరాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. దీంతో కేంద్రానికి కొప్పర్తి పేరును సూచిస్తూ ప్రతిపాదనలు పంపింది. దీన్ని జీర్ణించుకోలేని ఈనాడు తనకలవాటైన యధేచ్ఛగా శివాలెత్తిపోయింది.

రూ.1000 కోట్లతో కొత్త నగరం

కేంద్ర ప్రభుత్వం కొత్తగా నిర్మించాలనుకున్న ఒక్కో నగరానికి రూ.1,000 కోట్లు ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదించింది. కొత్త నగరాలకు ఎంపిక చేసిన ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.250 కోట్లు చొప్పున నాలుగేళ్లు ఇస్తుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లా అధికార యంత్రాంగం కొప్పర్తిని కొత్త నగరంగా ఎంపిక చేయాల్సిన ఆవశ్యకత, భవిష్యత్‌లో ప్రత్యక్షంగా లభించే ఉద్యోగాలు, చెన్నై, బెంగళూరు, బొంబాయి వంటి మహానగరాలకు ఉన్న కనెక్టివిటీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని కేంద్రానికి ప్రతిపాదించింది. వాస్తవం ఇదయితే.. సీఎం వైఎస్ జగన్ తన సొంత గడ్డ కోసం అమరావతిని విస్మరిస్తున్నారని 'ఈనాడు' తన కడుపు మంటను వెళ్లగక్కింది. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు తమ పెట్టుబడిదారుల ప్రయోజనాలు ఉన్న అమరావతిని తప్ప మరే ప్రాంతాన్ని పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం జగన్ సైతం అమరావతినే కొత్త నగరంగా ఎంపిక చేయాలని ఈనాడు పల్లవి ఎత్తుకుంది.

పెళ్లికి వచ్చి ప్రాణాలు కోల్పోయారు!

- ముగ్గురిని మింగిన చెరువు
- బాలుడిని కాపాడబోయి ఇద్దరు మహిళల మృతి
- మరో ఇద్దరు మహిళలను కాపాడిన బాలికలు
- మూడు కుటుంబాల్లో విషాదం


సులోచన, లక్కీ మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

ఎమ్మిగనూరు రూరల్(కర్నూలు): ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి ఓ బాలుడు, ఇద్దరు మహిళలు మృతిచెందారు. ఈ ఘటన శుక్రవారం ఎమ్మిగనూరు మండలం సిరాలదొడ్డి గ్రామంలో జరిగింది. సిరాలదొడ్డికి చెందిన గోకారి ఇంట్లో గురువారం జరిగిన పెళ్లికి బంధువులు వచ్చారు. వారిలో దేవనకొండ మండలం వరిముక్కలకు చెందిన మరియమ్మ (28), గోనెగండ్ల మండలం చెన్నెనెలటూరుకు చెందిన సులోచనమ్మ(26), సరోజమ్మ, కవిత, మరో ఇద్దరు బాలికలు దైవకుమారి, అనందమ్మ కలిసి బట్టలు ఉతుక్కునేందుకు గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. వారి వెంట సులోచనమ్మ తన మేనల్లుడు లక్కీ(5)ని కూడా తీసుకువెళ్లింది. బాలుడు లక్కీ ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడు. సులోచనమ్మ తన మేనల్లుడిని రక్షించేందుకు చెరువులోకి దిగింది. ఆమెకు లోతు తెలియక మునిగిపోతుండటంతో కాపాడేందుకు సరోజమ్మ, కవిత కూడా చెరువులోకి దిగారు. వారు ముగ్గురూ నీటిలో మునిగిపోతుండటంతో రక్షించేందుకు మరియమ్మ చెరువులోకి దూకింది. ఒడ్డున ఉన్న బాలికలు చాకచక్యంగా వ్యవహరించి చీరలు విసరడంతో చెరువులో మునిగి తేలుతున్న సరోజమ్మ, కవిత వాటి సాయంతో ఒడ్డుకు చేరుకున్నారు. లక్కీ, మరియమ్మ, సులోచనమ్మ మాత్రం నీటిలో మునిగి మృతిచెందారు. మరియమ్మకు భర్త తిక్కయ్య, ముగ్గురు సంతానం ఉన్నారు. సులోచనమ్మకు భర్త ప్రకాశం, నలుగురు పిల్లలు ఉన్నారు. రమేష్, కవిత దంపతులకు లక్కీ ఏకైక కుమారుడు. పెళ్లికి వచ్చిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన బాలికలు


ఆనందమ్మ, దైవకుమారి

చెరువులో మునిగి తేలుతున్న సరోజమ్మ, కవితను ఒడ్డున ఉన్న బాలికలు దైవకుమారి, ఆనందమ్మ సమయస్ఫూర్తితో వ్యవహరించి కాపాడారు. ఒకవైపు కేకలు వేస్తూ ఏడుస్తూనే తమ వద్ద ఉన్న చీరలను చెరువులోకి విసిరారు. వాటిని సరోజమ్మ, కవిత పట్టుకోగా... ఇద్దరు బాలికలు అతి కష్టం మీద బయటకు లాగారు. దీంతో వీరిద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. బాలికల కేకలు విని సమీపంలో పని చేస్తున్న ఉపాధి కూలీలు వచ్చి చెరువులోకి దిగి లక్కీ, సులోచనమ్మ, మరియమ్మను బయటకు తీయగా, అప్పటికే వారు మృతిచెందారు. పోలీసులు వచ్చి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

ఎడాపెడా 'ఈనాడు' అబద్ధాలు

- రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు
- గాలివానకు విరిగి లైన్లపై పడుతున్న చెట్ల కొమ్మలు
- ఎండలవల్ల కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు
- దీంతో అక్కడక్కడ కొంతసేపు సరఫరాకు అంతరాయం
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె. సంతోషరావు, ఏపీఈపీడీసీఎల్ సీజీఎం వి.విజయలలిత స్పష్టీకరణ



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతల్లేవని, వినియోగదారులకు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషిచేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) సీఎండీ కె. సంతోషరావు, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీజీఎం వి. విజయలలిత స్పష్టంచేశారు. ఈనాడు దినపత్రికలో శుక్రవారం 'ఎడాపెడా విద్యుత్ కోతలు'.. 'కరెంటు కోతతో రోగుల కన్నీరు'.. 'రొయ్యకు కరెంట్ షాక్'.. శీర్షికలతో ప్రచురితమైన కథనాలపై వారు స్పందించారు. కేవలం సాంకేతిక సమస్యలతోనే అక్కడక్కడా సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయే తప్ప, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలను అమలుచేయడంలేదని వారు వెల్లడించారు. వారు పేర్కొన్న అంశాలివీ..

- తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామంలో విద్యుత్ కోతలులేవు. గ్రామ పరిధిలోని ఓ వినియోగదారుడు చెట్ల కొమ్మలను తొలగిస్తున్నప్పుడు కొమ్మలు విద్యుత్ లైనుపై పడడంతో సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో మాత్రమే గురువారం ఉ.8 నుంచి 10 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా నాయుడుపేటలో కండక్టర్ తెగిపోయిన కారణంగా బుధవారం రాత్రి అరగంటపాటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రత్యామ్నాయ ఫీడరు ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. అయితే, లైన్ మరమ్మతు పూర్తయిన తర్వాత ఫీడర్‌ను మార్చేందుకు మరోమారు పది నిమిషాలపాటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.
- ఏలూరు జిల్లా, దెందులూరులో విద్యుత్ కోతలులేవు. కానీ, గత శుక్ర, శనివారాలలో రాత్రి వేళల్లో భీమడోలు, పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఈదురుగాలులు, వర్షాల కారణంగా, 33కేవీ లైనులో సాంకేతిక లోపాలు తలెత్తాయి. వాటి మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఎండల తీవ్రతకు, అధిక లోడు వలన 220 కేవీ నుంచి ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌లో మూడో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ కారణంగా దానిని మార్చడానికి లైన్ క్లియర్ తీసుకున్నారు. దీంతో గణపవరం, నిడమర్రు, ఉండి, భీమవరం, పాలకోడేరు, కాళ్ళ, ఆకివీడు మండలాల్లో ఆక్వా రైతులకు కొంతమేర విద్యుత్ అంతరాయం ఏర్పడింది.
- విజయనగరం జిల్లాలో గురువారం ఉ.11.02 నుండి 11.08 వరకు, బుడతనాపల్లి గ్రామంలో ఎల్‌టి సర్వీసు ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏబీ స్విచ్ ఆపడంవల్ల అంతరాయం కలిగింది. గురువారం 11 కేవీ ఉడా ఫీడర్‌పై 14.42 గంటలకు యూకలిప్టస్ చెట్టు కొమ్మలు పడటంవల్ల అదే ఫీడర్‌పై ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల కార్యాలయానికి విద్యుత్ అంతరాయం కలిగిన వెంటనే సిబ్బంది చెట్లు, కొమ్మలు తొలగించి 15.48 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.
- శ్రీకాకుళం జిల్లా పాతపట్నం 50 పడకల ఆసుపత్రి, ఏలూరు గవర్నమెంట్ ఆస్పత్రికి ఎలాంటి విద్యుత్ అంతరాయం ఏర్పడలేదు. టెక్కలి గవర్నమెంట్ ఆస్పత్రికి గురువారం 12 నిమిషాల పాటు, పలాస కమ్యూనిటీ ఆస్పత్రికి గంట 40 నిమిషాలు పాటు ఈదురుగాలులు వేస్తున్న సమయంలో మాత్రమే అంతరాయం ఏర్పడింది.
- వేసవిలో ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా వున్నందున విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోంది. సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగినప్పటికీ డిమాండుకు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వేడి నుంచి ఉపశమనం కోసం ఏసీల వినియోగం పెరగడంవల్ల లోడ్ ఎక్కువైనపుడు కొన్ని ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో ఫ్యూజులు పోతున్నాయి. గత కొన్నిరోజులుగా బలమైన గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోవడం, లైన్లు తెగిపోవడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

ఎండలు, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా..

ఇక ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కరెంటు కోటాను అందిస్తోంది. రోజువారీ వినియోగం 255 మిలియన్ యూనిట్లు ఉన్నప్పటికీ కోతలు లేకుండా సరఫరా చేస్తోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు అధికారులు, సిబ్బంది ఎండలు, వర్షాన్ని లెక్కచేయకుండా త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించేందుకు కృషిచేస్తున్నారు. ముఖ్యంగా ఆస్పత్రులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు విధించడంలేదు. అదేవిధంగా రాత్రి సమయాల్లో విధుల నిర్వహణకు టీమ్‌లను ఏర్పాటుచేశారు. సమాచారం అందుకున్న సిబ్బంది సత్వరం స్పందించి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. కార్పొరేట్ ఆఫీస్ నుంచే కాకుండా సర్కిల్ స్థాయి, డివిజన్ స్థాయిల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాల పర్యవేక్షణకు లోడ్ మానిటరింగ్ సెల్‌లు 24గంటలూ పనిచేస్తున్నాయి. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు తలెత్తితే వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్‌చేసి పరిష్కారం పొందవచ్చు.

క్లుప్తంగా

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా
జస్టిస్ రావు, జస్టిస్ భట్టి


జస్టిస్ రావు


జస్టిస్ భట్టి

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పదోన్నతి పొందారు. పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మామిడాన సత్యరత్న శ్రీరామచంద్రరావు హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కేరళ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ సారస వెంకటనారాయణ భట్టి అదే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. కేంద్ర న్యాయ శాఖ ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్లు జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన జస్టిస్ రావు 2021లో జస్టిస్ హిమా కోహ్లి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టుకు కొంతకాలం పాటు తాత్కాలిక సీజేగా సేవలందించారు. జస్టిస్ భట్టి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె. వీరితో పాటు మరో ముగ్గురు న్యాయమూర్తులు జస్టిస్ విజయ్‌కుమార్ గంగాపూర్‌వాలా (మద్రాస్ హైకోర్టు), జస్టిస్ రమేశ్ దేవకీనందన్ ధనూకా (బాంబే హైకోర్టు), జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి (రాజస్తాన్) కూడా పదోన్నతి పొందారు. జస్టిస్ ధనూకా ఈనెల 30న రిటైరవుతున్నారు.

సత్యేంద్ర జైన్‌కు ఆరు వారాలపాటు
మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి, ఆప్ నేత సత్యేంద్ర జైన్(58)కు సుప్రీంకోర్టు ఆరు వారాలపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న జైన్ గురువారం తిహార్ జైలులో కుప్పకూలడం తెలిసిందే. ఆయనకు ప్రభుత్వాసుపత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. జైన్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. నచ్చిన ఆసుపత్రిలో చికిత్స పొందవచ్చని, జూలై 10వ తేదీలోగా మెడికల్ రిపోర్టులు సమర్పించాలని ఆదేశించింది. జూలై 11 దాకా మీడియాతో మాట్లాడవద్దని, ఢిల్లీ విడిచి వెళ్లవద్దని స్పష్టం చేసింది. జైన్ తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నారని, జైలులో 35 కిలోల బరువు తగ్గారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు.

భూగోళం మండిపోతోంది.. ఎండ ప్రచండంగా మారుతోంది.. వాతావరణంలో మార్పులతో రుతువులు గతి తప్పుతున్నాయి. పెట్రోల్, డీజిల్, ఇతర శిలాజ ఇంధనాల మితిమీరిపోయిన వాడకంతో కర్బన ఉద్గారాలు అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదలతో భూతాపం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. ఉష్ణోగ్రతల పెరుగుదల ఇలాగే ఉంటే ముందు ముందు మరిన్ని అనర్థాలు ఎదుర్కోబోతున్నాం. 2030కి భారత్ ఎన్నో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటుందని ఆర్‌బీఐ నివేదిక హెచ్చరిస్తోంది.

అన్నీ అనర్థాలే

భారత ఆర్థిక రంగంపై వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావం

2030 నాటికి 4.5% జీడీపీకి ముప్పు


3.4 కోట్ల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం

వాతావరణ మార్పులపై ఆర్‌బీఐ నివేదిక

మండే ఎండలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. శ్రామిక శక్తి నిర్వీర్యమైపోతోంది. సూర్యుడు నిప్పులు కురిపిస్తూ ఉంటే శ్రామికులు సత్తువ కోల్పోతున్నారు. పని గంటలు తగ్గిపోతున్నాయి. ఫలితంగా వాతావరణ మార్పులతో మన దేశం ఆర్థికంగా కుదేలయ్యే దుస్థితి రాబోతోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా నివేదిక హెచ్చరించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాలు ఊడిపోతే అందులో దాదాపుగా సగం 3.4 కోట్లు భారత్‌లోనేనని ఆర్‌బీఐ నివేదిక అంచనా వేసింది. ఇక స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 4.5 శాతం వరకు కోల్పోయే ముప్పు ఉందని హెచ్చరించింది....!

పర్యావరణం ఆర్థిక ప్రభావం

స్థూలజాతీయోత్పత్తిలో మార్పులు



భారత్‌లో కర్బన ఉద్గారాల విడుదల ఇలా (టన్నుల్లో)

(ప్రతి 10 లక్షల డాలర్ల విలువైన ఉత్పత్తికి విడుదలయ్యే కర్బన ఉద్గారాలు)

రంగం	ఉద్గారాలు
నిర్మాణం	26
నీటి వ్యర్థాల నిర్వహణ	110
భూ రవాణా	379
రియల్ ఎస్టేట్	49
గనులు, క్వారీయింగ్	567
వ్యవసాయం, అడవులు	85
వైమానిక రవాణా	1210
లోహ ఉత్పత్తులు	2797
నీటి రవాణా	1588
విద్యుత్, గ్యాస్ పంపిణీ	7264

వచ్చే ఐదేళ్లలో భగభగలే..!

వచ్చే అయిదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతల్లో భారీగా పెరిగిపోనున్నాయి. గ్రీన్ హౌస్ గ్యాస్‌లు, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో ప్రభావంతో ఎండ ప్రచండంగా మారుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. 2023–2027 మధ్యలో సగటు ఉష్ణోగతల్లో పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటుందని అంచనా. వచ్చే అయిదేళ్లలో ఏదో ఒక ఏడాది రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడానికి 98% అవకాశం ఉంది. 2015 నుంచి ఉష్ణోగ్రతల్లో సగటు పెరుగుదల 1.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటూ వస్తోంది. ఆర్కిటిక్ కరిగి మంచు కరిగిపోయే పరిస్థితులు ఎదురవుతాయి. వందేళ్లలో ఒక్కసారి ఇలా జరుగుతూ ఉంటుంది.

వ్యవసాయం: భారత్ వ్యవసాయ ఆధారిత దేశం. అత్యధికులు ఇప్పటికీ వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ సీజన్‌లే మారిపోతాయి. దీని వల్ల పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఫలితంగా గ్రామీణ ఆర్థిక రంగం కుదేలైపోతుంది. దాని ప్రభావంతో పట్టణాల్లో ధరాభారం పెరిగిపోతుంది.

పరిశ్రమలు: పారిశ్రామిక రంగంలో నిర్వహణ వ్యయాలు తడిసిమోపెడయిపోతాయి. లాభాలు తగ్గుతాయి. పర్యావరణ పరిరక్షణ కోసం కొత్త నియంత్రణలు పాటించాల్సి రావడంతో పెట్టుబడులు పెరుగుతాయి.

సేవలు : ఆర్థిక సేవలపై ఒత్తిడి పెరిగిపోతుంది. అనారోగ్యాల బారిన పడేవారి సంఖ్య పెరిగి బీమా క్లెయిమ్‌లు పెరుగుతాయి. ప్రయాణాలు తగ్గి ఆతిథ్య రంగం కుదేలవుతుంది.

శ్రామిక మార్కెట్: పర్యావరణ మార్పులతో ఉత్పాదకత తగ్గి వలసలు పెరుగుతాయి. ఎండలకు శ్రామికుల పని గంటలు తగ్గుతాయి. రుణాలు, మార్కెట్, లిక్విడిటీ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలపైనా ప్రభావం పడనుంది.

పార్లమెంట్ నూతన సౌధం
ప్రారంభోత్సవం ఇలా...

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం 7.15 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రెండు దశలుగా ప్రారంభోత్సవం ఉంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

ఉదయం **7.15** గంటలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నూతన భవనం వద్దకు చేరుకుంటారు.

7.30: యజ్ఞం, పూజ ప్రారంభం. దాదాపు గంటపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

8.30: ప్రధాని మోదీ లోక్‌సభ చాంబర్‌లోకి ప్రవేశిస్తారు.

9.00: చరిత్రాత్మక రాజదండం సెంగోల్‌ను లోక్‌సభ స్పీకర్ స్థానం సమీపంలో ప్రతిష్ఠిస్తారు.

9.30: పార్లమెంట్ లాబీలో ప్రార్థనా కార్యక్రమం ప్రారంభమవుతుంది. పార్లమెంట్ నుంచి ప్రధాని మోదీ బయటకు వెళ్తారు.

11.30: ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అతిథులు కొత్త భవనం వద్దకు చేరుకుంటారు.

12.00: ప్రధాని మోదీ రాక. జాతీయ గీతాలాపాన ప్రారంభం.

12.10: రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రసంగం. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పంపించిన సందేశాన్ని చదివి వినిపిస్తారు.

12.17: రెండు షార్ట్ ఫిలింలు ప్రదర్శిస్తారు.

12.38: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రసంగిస్తారు.

1.05: రూ.75 నాణెం, స్మారక పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని మోదీ విడుదల చేస్తారు.

1.10: ప్రధానమంత్రి ప్రసంగం ప్రారంభం

2.00: అధికారికంగా వేడుకల ముగింపు

ప్రతి భారతీయుడికీ
గర్వకారణం

నూతన పార్లమెంట్ భవనం వీడియోను షేర్ చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: నూతన పార్లమెంట్ భవనం ప్రతి భారతీయుడినీ గర్వపడేలా చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం పేర్కొన్నారు. కొత్త సౌధం వీడియోను ఆయన శుక్రవారం తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. ఈ వీడియోను తిలకిస్తే అద్భుతమైన మన పార్లమెంట్ కొత్త భవనం గురించి సమాచారం తెలుస్తుందని వివరించారు. వీడియోను 'మైపార్లమెంట్‌మైప్రైడ్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియా వేదికలపై పంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సొంత వ్యాఖ్యానం సైతం జోడించాలని సూచించారు. ప్రజల ట్వీట్లను రీట్వీట్ చేస్తానన్నారు. ప్రధాని మోదీ ట్విట్టర్‌లో షేర్ చేసిన వీడియో పార్లమెంట్ బిల్డింగ్‌లో వర్చువల్ టూర్‌లా ఉందని నెటిజన్లు చెబుతున్నారు. కొత్త భవనాన్ని మోదీ ఆదివారం ప్రారంభించనుండటం తెలిసిందే.


పార్లమెంటు నూతన భవనం విహంగ వీక్షణం

న్యూఢిల్లీ: మన దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవమైన ఈ నెల 28న కేంద్ర ప్రభుత్వం రూ.75 నాణేన్ని విడుదల చేయనుంది. ఆర్థిక శాఖలోని ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం

రూ.75 నాణెం విడుదల

ఈ నాణెం బరువు 34.65–35.35 గ్రాములు ఉంటుంది. నాణేనికి ఒక వైపు అశోకుడి స్థూపం నాలుగు సింహాలతో పాటు దేవనాగరి లిపిలో భారత్, ఆంగ్లభాషలో ఇండియా అన్న అక్షరాలు ఉంటాయి. రెండో వైపు పార్లమెంటు కొత్త భవనాన్ని ముద్రించారు.

పార్లమెంటు భవన ప్రారంభోత్సవ బహిష్కరణ నిర్ణయం...
కుటుంబ పార్టీల నిర్వాకం!

పలు రంగాలకు చెందిన 270 మంది ప్రముఖుల ఆగ్రహం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించాలన్న విపక్షాల నిర్ణయాన్ని ప్రముఖులు ఖండించారు. కుటుంబ పార్టీల నిర్వాకం ఇలాగే ఉంటుందని విమర్శించారు. ఈ మేరకు 270 మంది ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. వీరిలో మాజీ ఉన్నతాధికారులు, రాయబారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రారంభించుకోవడం దేశ ప్రజలు గర్వపడాల్సిన సందర్భమని వివరించారు. ప్రతిపక్షాలు అపరిపక్వ, డొల్ల వాదనలతో బహిష్కరణ నిర్ణయం తీసుకోవడం సరికాదని హితవు పలికారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రధాని ప్రారంభిస్తే తప్పుపట్టడానికి ఏముందని ప్రశ్నించారు. 'ఇండియా ఫస్ట్' నినాదంతో కేంద్రం ముందుకు సాగుతోందని, కొన్ని పార్టీలు 'ఫ్యామిలీ ఫస్ట్' అంటున్నాయని ఎద్దేవా చేశారు.

చైనాలో మరో కరోనా వేవ్

జూన్‌లో వారానికి 6.5 కోట్ల కేసులు నమోదయ్యే ప్రమాదం!

బీజింగ్: కరోనాకు పుట్టిల్లయిన చైనా మరో వేవ్‌తో వణికిపోతోంది. ఒమిక్రాన్ సబ్ వేరియెంట్ ఎక్స్‌బీబీతో నెల రోజులుగా అక్కడ కరోనా కేసుల సంఖ్య పెరిగిపోతోంది. జూన్ చివరికి కరోనా తారస్థాయికి చేరి వారానికి ఏకంగా 6.5 కోట్ల కేసులు నమోదు కావచ్చన్న అంతర్జాతీయ మీడియా కథనాలు ఆందోళన పెంచుతున్నాయి. దీనికి సరైన వ్యాక్సిన్ రాకపోతే చైనా మృత్యు దిబ్బగా మారుతుందని చైనా అంటువ్యాధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులపై ఈ వేరియెంట్ అత్యధిక ప్రభావం చూపిస్తుందని చెబుతున్నారు.

ప్రతి 10 మందిలో ఒకరికి లాంగ్ కోవిడ్

వాషింగ్టన్: ఒమిక్రాన్ వేరియెంట్ తర్వాత కరోనా బాధితుల్లోని ప్రతీ 10 మందిలో ఒకరికి లాంగ్ కోవిడ్ బయటపడుతోందని అమెరికా అధ్యయనంలో వెల్లడైంది. కోవిడ్ సోకిన ప్రతీ పది మందిలో ఒకరు ఇప్పటికీ అనునిత్యం ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నట్టుగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనం నివేదిక తెలిపింది. చిన్న పనికే అలిసిపోవడం, మెదడుపై ప్రభావం, తల తిరగడం, గ్యాస్ట్రిక్ సమస్యలు, గుండె దడ, సెక్స్‌పై అనాసక్తత, తరచూ దాహం వేయడం, రుచి, వాసన కోల్పోవడం, విపరీతమైన దగ్గు, ఛాతీలో నొప్పి వంటివన్నీ లాంగ్ కోవిడ్ ఉన్న వారిలో కనిపిస్తున్నాయని ఆ నివేదిక వివరించింది.


సెంగోల్‌పై రగడ

అది రాజదండం కాదు: కాంగ్రెస్

తమిళనాడులో రాజకీయ లబ్ధి కోసమే: జైరామ్ రమేశ్

మన సంస్కృతిపై అంత ద్వేషమెందుకు: అమిత్ షా

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనంలోని లోక్‌సభ సభామందిరంలో ప్రతిష్టించనున్న సెంగోల్ (రాజదండం)పై వివాదం ముదురుతోంది. బ్రిటిష్ పాలకుల నుంచి అధికార మార్పిడికి గుర్తుగా సెంగోల్‌ను ఉపయోగించినట్లు ఆధారాలు లేవని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన భజనపరులు కేవలం తమిళనాడులో రాజకీయ లబ్ధి కోసమే సెంగోల్‌ను తెరపైకి తెచ్చారంటూ శుక్రవారం ట్వీట్ చేశారు. "నిజానికి సెంగోల్‌ను మద్రాసు ప్రావిన్స్‌లోని ఓ మత సంస్థ మద్రాసులో తయారు చేయించి 1947 ఆగస్టులో నెహ్రూకు బహుమతిగా ఇచ్చింది. తర్వాత దాన్ని అలహాబాద్ మ్యూజియానికి తరలించారు. దాన్ని నెహ్రూ రాజదండంగా వాడినట్లు ఆధారాల్లేవు. మోదీ ప్రభుత్వ వాదన బోగస్. సెంగోల్‌పై మోదీ భజనపరులు సోషల్ మీడియాలో, ప్రధాన స్రవంతి మీడియాలో తప్పుడు ప్రచారం సాగిస్తున్నారు'' అన్నారు. పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు ఆహ్వానించడం లేదని నిలదీశారు. ప్రజాస్వామ్యంపై మోదీ సర్కారు దాడి చేస్తోందన్నారు.



తప్పుడు ప్రచారం! తిరువావదుత్తురై పీఠం

చెన్నై: సెంగోల్ రాజదండంపై తప్పుడు ప్రచారం సాగుతుండడం చాలా విచారకరమని తమిళనాడులోని తిరువావదుత్తురై అధీనం పీఠాధిపతి అంబలావన దేశిక పరమాచార్య స్వామి శుక్రవారం అన్నారు. అధికార మార్పిడికి గుర్తుగా ఈ రాజదండాన్ని లార్డ్ మౌంట్‌బాటన్ 1947 ఆగస్టులో నెహ్రూకు అందజేశారని చెప్పారు. దీనిపై స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఫొటోలతోపాటు అప్పట్లో పత్రికల్లో ప్రముఖంగా వార్తలు ప్రచురితమయ్యాయని గుర్తుచేశారు. "సెంగోల్‌ను రాజదండంగా వాడలేదన్నది కొందరి ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారమే. సెంగోల్ తమిళనాడుకు గర్వకారణం. తిరుక్కురళ్‌తో పాటు తమిళ ప్రాచీన సాహిత్యంలో సెంగోల్ ప్రస్తావన ఉంది'' అని తెలిపారు.

సెంగోల్‌ను అవమానించడం దారుణం: షా

సెంగోల్‌పై కాంగ్రెస్ నేతల విమర్శలను కేంద్ర మంత్రి అమిత్ షా ఖండించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై కాంగ్రెస్‌కు ద్వేషం ఎందుకని ప్రశ్నించారు. "అధికార మార్పిడికి ప్రతీకగా తమిళనాడు మఠం నిర్వాహకులు పవిత్ర సెంగోల్‌ను నెహ్రూకు అందజేశారు. దాన్ని 'చేతికర్ర'గా పేర్కొంటూ కాంగ్రెస్ పాలకులు మ్యూజియంలో పడేశారు'' అంటూ తప్పుపట్టారు. ఇప్పుడేమో అదే కాంగ్రెస్ నేతలు సెంగోల్‌ను దారుణంగా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు మఠం చరిత్ర బోగస్ అంటూ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించాలన్న విపక్షాల నిర్ణయం దురదృష్టకరమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. రాజకీయాలకూ ఓ పరిమితి ఉండాలన్నారు. నూతన భవన ప్రారంభోత్సవాన్ని ప్రజలంతా పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బహిష్కరణ పిలుపుతో మన స్వాతంత్య్ర సమరయోధులను విపక్ష నేతలు అవమానిస్తున్నారని కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి విమర్శించారు.

ప్రారంభోత్సవంపై పిల్... కొట్టేసిన సుప్రీం

పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవం రాష్ట్రపతి జరిపేలా ఆదేశించాలన్న పిల్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీన్ని ఎందుకు, ఎలా దాఖలు చేశారో అర్థమవుతోందని న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్. నరసింహలు అన్నారు. విచారణకు స్వీకరించకపోతే పిల్ వెనక్కి తీసుకోవడానికి అనుమతినివ్వాలని కోరినా దాన్ని కొట్టేస్తున్నట్టుగా తెలిపారు. ప్రారంభోత్సవాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేయడం రాష్ట్రపతిని అవమానించడమేనని విమర్శిస్తూ ఇప్పటికే 20కి పైగా రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించిన విషయం తెలిసిందే.

జూన్‌లో వర్షాభావం

ఎల్‌నినో ఉన్నా ఈసారి వానలు సాధారణం

న్యూఢిల్లీ: పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడినప్పటికీ వాయవ్య భారత్ మినహా మిగిలిన ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని కేంద్ర వాతావరణ శాఖ వెల్లడించింది. అయితే జూన్ నెలలో చాలా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులుంటాయని తెలిపింది. దక్షిణ కర్ణాటక, ఉత్తర తమిళనాడు, రాజస్తాన్, లద్దాఖ్ మినహా మిగిలిన ప్రాంతాల్లో జూన్ నెలలో వానలు అంతగా కురిసే అవకాశాల్లేవని అంచనా వేసింది. పసిఫిక్ మహా సముద్రం వేడెక్కడం ఇప్పటికే ప్రారంభమైందని మన రుతుపవనాలపై ప్రభావాన్ని చూపిస్తే ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం 90శాతం ఉందని కేంద్ర వాతావరణ శాఖ పర్యావరణ పర్యవేక్షణ అధ్యయన కేంద్రం చీఫ్ డి. శివానంద చెప్పారు. అయితే వానలు కురవడానికి అనుకూలమైన ఇండియన్ ఓషన్ డిపోల్ (ఐవోడీ) హిందూ మహాసముద్రంలో ఏర్పడడం వల్ల చాలా ప్రాంతాల్లో వర్షాలు పడతాయని తెలిపారు. మధ్య భారతదేశంపై ఎల్‌నినో ప్రభావాన్ని ఐవోడీ సమర్థంగా ఎదుర్కోవడం వల్ల ఏడాది మొత్తమ్మీద సాధారణ వర్షపాతం కురుస్తుందని వివరించారు.

గాల్లోనే విమానం డోర్ తెరిచాడు..!



సియోల్: దక్షిణ కొరియా విమానంలో ఒక ఆకతాయి చేసిన పని ప్రయాణికులందరి ప్రాణాలనూ ప్రమాదంలోకి నెట్టింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ముప్పు తప్పింది. 194 మందితో జెజు నుంచి డేగ్‌కు వెళుతున్న ఆసియానా ఎయిర్‌లైన్స్ విమానం ల్యాండింగ్‌కు సిద్ధపడుతుండగా అత్యవసరం ద్వారం దగ్గర కూర్చున్న ప్రయాణికుడు లివర్ లాగి డోర్ తెరిచాడు. దాంతో విమానంలోకి భారీగా గాలులు వీచాయి. ప్రయాణికులు హాహాకారాలు చేశారు. కొందరిలో శ్వాస కోశ సమస్యలు తలెత్తాయి. మరికొందరు గాలుల ధాటికి కిందపడి గాయాలయ్యాయి. పైలెట్ చాకచక్యంగా సురక్షితంగా లాండ్ చేశాడు. ఆ ప్రబుద్ధున్ని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

రాహుల్ పాస్‌పోర్టుకు కోర్టు ఓకే

న్యూఢిల్లీ: కొత్త పాస్‌పోర్టు వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఢిల్లీ కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. మూడేళ్ల పాటు సాధారణ పాస్‌పోర్టు పొందడానికి అనుమతి మంజూరు చేసింది. ఎంపీగా అనర్హత వేటు పడిన తర్వాతరాహుల్ గాంధీ తన డిప్లొమాటిక్ పాస్‌పోర్టును, ఇతర ప్రయాణ అనుమతి పత్రాలను అధికారులకు అందజేశారు. విదేశాల్లో ప్రయాణించడానికి వీలుగా సాధారణ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో నిందితుడిగా ఉండడంతో పాస్‌పోర్టు కోసం నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) తీసుకోవాల్సి ఉంది. ఎన్‌ఓసీ ఇవ్వాలంటూ ఆయన ఢిల్లీ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టింది. మూడేళ్లపాటు సాధారణ పాస్‌పోర్టు కోసం ఎన్‌ఓసీ ఇస్తున్నట్లు కోర్టు వెల్లడించింది.

స్మార్ట్ ఫోన్ కోసం రిజర్వాయర్‌నే తోడించాడు

ఛత్తీస్‌గఢ్‌లో ఓ అధికారి నిర్వాకం, సస్పెన్షన్

రాయపూర్: ఖరీదైన తన స్మార్ట్ ఫోన్ రిజర్వాయర్‌లో పడిపోయిందని ఒక అధికారి ఏకధాటిగా మూడు రోజుల పాటు నీరంతటినీ తోడించాడు! 1500 ఎకరాల సాగు భూమికి ఉపయోగపడే 21 లక్షల లీటర్ల నీటిని తోడి వృథాగా పోసేయడంతో ప్రభుత్వం అతనిని సస్పెండ్ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని కంకేర్ జిల్లా కొయిలిబెడా బ్లాక్‌లో ఫుడ్ ఆఫీసర్ రాజేశ్ విశ్వాస్ ఖేర్‌కట్టా డ్యామ్ సందర్శనకు వచ్చారు. సెల్ఫీ తీసుకుంటూంటే దాదాపు రూ.లక్ష విలువైన స్మార్ట్ ఫోన్ రిజర్వాయర్‌లో పడిపోయింది. 15 అడుగుల లోతున్న ఆ రిజర్వాయర్‌లోకి గజ ఈతగాళ్లు దూకి వెదికినా దొరకలేదు. దాంతో డీజిల్ పంప్స్ తెప్పించి సోమవారం సాయంత్రం నుంచి గురువారం దాకా నీళ్ల తోడించాడు. ఫోన్ దొరికినా 3 రోజులు నీళ్లలో ఉండడంతో మూగబోవడం కొసమెరుపు!

మోదీ తొమ్మిదేళ్ల పాలనపై...
కాంగ్రెస్ 9 ప్రశ్నలు

తప్పుడు హామీలతో జాతిని దగా చేసిన ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్



న్యూఢిల్లీ: కేంద్రంలో మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనపై కాంగ్రెస్ దుమ్మెత్తిపోసింది. మోదీ తొలిసారిగా ప్రధాని పదవి స్వీకరించి శుక్రవారానికి తొమ్మిదేళ్లయ్యాయి. తప్పుడు హామీలతో జాతిని దగా చేసినందుకు ఈ సందర్భంగా ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. 'నౌ సాల్, నౌ సవాల్ (తొమ్మిదేళ్లు, తొమ్మిది ప్రశ్నలు)' పేరుతో మోదీకి 9 ప్రశ్నలు సంధిస్తూ బుక్‌లెట్ విడుదల చేశారు. కోట్లాది మంది నిరుద్యోగ యువత నుంచి తొమ్మిదేళ్లుగా మోదీ పారిపోతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. దేశంలో పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, విద్వేషం, నిరుద్యోగానికి మోదీయే బాధ్యత వహించాలని రాహుల్ అన్నారు. మోదీకి కాంగ్రెస్ సంధించిన 9 ప్రశ్నలు...

1. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఎందుకు పెరుగుతున్నాయి? ప్రజా ఆస్తుల్ని మోదీ స్నేహితులకి ఎందుకు విక్రయిస్తున్నారు?
2. సాగు చట్టాల రద్దు ఒప్పందాలను ఎందుకు గౌరవించడం లేదు? కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం లేదేం?
3. మీ స్నేహితుడు అదానీ లబ్ధి కోసం ఎల్ఐసీ, ఎస్‌బీఐలలో ప్రజలు కష్టించి దాచి పెట్టుకున్న డబ్బుని ఎందుకు ప్రమాదంలో పడేశారు?
4. మీరు క్లీన్‌చిట్ ఇచ్చిన చైనా భారత భూభాగాలను ఆక్రమించుకుంటోందేం?
5. ఎన్నికల ప్రయోజనాల కోసం విద్వేష రాజకీయాలతో సమాజంలో భయానక వాతావరణాన్ని ఎందుకు సృష్టిస్తున్నారు ?
6. సామాజిక న్యాయ పునాదుల్ని ధ్వంసం చేస్తున్నారెందుకు? అణగారిన వర్గాలపై అరాచకాలపై మౌనమెందుకు?
7. ప్రజాస్వామిక విలువలు, ప్రజాస్వామ్య సంస్థల్ని ఎందుకు బలహీనపరుస్తున్నారు? విపక్ష నేతలపై కక్ష సాధింపు రాజకీయాలెందుకు? ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల్ని ధన బలంతో ఎందుకు కూలదోస్తున్నారు?
8. పేదల సంక్షేమ పథకాలకు బడ్జెట్‌ను తగ్గించి ఎందుకు బలహీనపరుస్తున్నారు?
9. కోవిడ్‌తో 40 లక్షల మంది పై చిలుకు మరణించినా వారి కుటుంబసభ్యులకు ఇప్పటికీ నష్టపరిహారం ఎందుకు చెల్లించడం లేదు?

అన్నీ పచ్చి అబద్ధాలు: బీజేపీ

కాంగ్రెస్ సంధించిన ప్రశ్నలన్నీ అబద్ధాల పుట్టలేనని బీజేపీ దుయ్యబట్టింది. మోదీపై విద్వేషం నుంచి అవి పుట్టుకొచ్చాయని బీజేపీ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. ప్రధానిపై కాంగ్రెస్‌కున్న ద్వేషం ఒక రోగమని విమర్శించారు. మోదీ హయాంలో భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. అన్ని రంగాల్లోనూ దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. బీజేపీ శుక్రవారం దేశ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసి 9 ఏళ్లలో దేశ వృద్ధిని వివరించింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శనివారం । 27 । మే । 2023

1000 టాస్మాక్ బార్ల సీజ్

సాక్షి, చెన్నై: అనుమతి లేని 1000 టాస్మాక్ బార్‌లను గుర్తించి శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ నేతృత్వంలో 5,300 టాస్మాక్ మద్యం దుకాణాలు ఉన్న విషయం తెలిసిందే. అలాగే, 3,200 టాస్మాక్ బార్లు కూడా ఉన్నాయి. ఆయా టాస్మాక్‌లకు అనుసంధానంగా బార్ల తరహాలో ఏర్పాట్లు కూడా చేశారు. అయితే, అనుమతి లేకుండా బార్లు అత్యధికం రాష్ట్రంలో కొనసాగుతున్నాయనే విషయం తెలిసి కూడా మార్కెటింగ్ శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తూ వచ్చారు. ఈ సమయంలో తంజావూరులోని ఓ టాస్మాక్ బార్‌లో మద్యం తాగిన ఇద్దరు గతవారం మరణించడంతో అధికారులు మేల్కొన్నారు. దీంతో టాస్మాక్ బార్లలో సోదాలు చేపట్టారు. ఇందులో వెయ్యి టాస్మాక్ బార్‌లు అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్టు తేలింది. ఇందులో అనేకం ప్రభుత్వానికి చెల్లించాల్సిన టెండర్ మొత్తాన్ని కూడా చెల్లించనట్టు తేలింది. దీంతో ఆయా బార్‌లకు సీల్ వేశారు.

న్యూస్‌రీల్

కోర్టుకు పళనిస్వామి ఆస్తుల నివేదిక



పళనిస్వామి

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఆస్తుల వివరాలను సేకరించిన పోలీసులు నివేదిక రూపంలో శుక్రవారం సేలం కోర్టుకు సమర్పించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి 2012 ఎన్నికల సమయంలో దాఖలు చేసిన ప్రమాణ పత్రంలో ఆస్తుల వివరాలను దాచిపెట్టినట్టు కోర్టులో పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. తేనికి చెందిన మిలాని దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో 2016 ఎన్నికలు, 2021 ఎన్నికలకు సంబంధించిన ప్రమాణ పత్రాలలో వివరాలను కోర్టు దృష్టికి తెచ్చారు. అనేక చర, స్థిర ఆస్తులను పళనిస్వామి దాచిపెట్టినట్టుగా ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. దీంతో కేసు విచారణకు సేలం పోలీసులను కోర్టు ఆదేశించింది. దీంతో సేలం అసిస్టెంట్ కమిషనర్ సూర్య, ఇన్‌స్పెక్టర్ పుష్పరాణి నేతృత్వంలోని క్రైంబ్రాంచ్ అధికారులు విచారణ చేపట్టారు. బ్యాంక్‌ల ద్వారా సమాచారం సేకరించారు. పళనిస్వామి ఆస్తులకు సంబంధించిన అన్ని సమాచారాలు రాబట్టారు. అనేక మందితో చర్చించి, వివరాలను సేకరించారు. వీటన్నింటితో కూడి నివేదికను సిద్ధం చేశారు. దీనిని శుక్రవారం కోర్టుకు సమర్పించారు. ఇందులోని వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు పలు సెక్షన్లతో మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా తర్వాత పళనిస్వామిని విచారించే అవకాశాలు ఉన్నాయి.

దంత వైద్యంలో చెన్నై విద్యార్థి రికార్డు



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అశ్విన్ జైకుమార్ రామ్

సాక్షి, చెన్నై: దంత వైద్యరంగంలో అత్యాధునిక పద్ధతులతో శస్త్ర చికిత్సను విజయవంతం చేసి పలు రికార్డులను చెన్నైకు చెందిన అశ్విన్ జైకుమార్ రామ్ అనే విద్యార్థి సొంతం చేసుకున్నాడు. శుక్రవారం ఈ వివరాలను సీమాట్స్ వర్గాలు ప్రకటించాయి. తమ వర్సిటీ పరిధిలోని దంత వైద్యకళాశాలలో చదువుకుంటున్న అశ్విన్ జైకుమార్ రామ్ దంత వైద్య కోర్సులలో ఆధునిక పద్ధతులపై దృష్టి పెట్టినట్టు వివరించారు. శస్త్ర చికిత్స విభాగానికి చెందిన డాక్టర్ రూబిన్ ఎస్ జాన్ మార్గదర్శకంలో డెంటల్ ఇంటర్న్, ఇంట్రారల్ డెర్మల్ పిల్లర్, మోడిలర్ ఇన్‌కో ఆర్డినేషన్ విధానాలలో దంత శస్త్ర చికిత్సను విజయవంతం చేశాడు. ఇది రికార్డును నెలకొల్పేందుకు మార్గంగా మారినట్టు తెలిపారు. అసాధారణమైన, వినూత్న ఆలోచనలతో అంకితభావంతో చేసిన ఈ చికిత్స యూనిక్ బుక్ ఆఫ్ రికార్డు, రాధాబుక్స్ ఆఫ్ రికార్డు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌లలో చోటు సంపాదించుకున్నాడు. రికార్డులతో అవార్డుల ధ్రువీకరణ పత్రాలను సొంతం చేసుకున్న ఈ విద్యార్థిని నిర్వాహకులు, సహచరులు జైకుమార్ రాంను అభినందించారు.

షిరిడీ విమానం రద్దు

- ప్రయాణికుల ఆందోళన

తిరువొత్తియూరు: చెన్నై నుంచి షిరిడీ వెళ్లే విమానాన్ని హఠాత్తుగా రద్దు చేయడంతో విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. చెన్నై మీనంబాక్కం స్వదేశీ విమానాశ్రయం నుంచి షిరిడీకి ప్రైవేటు ప్రయాణికుల విమానం గురువారం మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరవలసి ఉంది. విమానంలో ప్రయాణించేందుకు 154 మంది ప్రయాణికులు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో విమానం ఆలస్యంగా సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరుతుందని మొదట ప్రకటించారు. దీంతో ప్రయాణికులు తనిఖీలు పూర్తిచేసుకుని విమానాశ్రయంలో వేచి ఉన్నారు. తరువాత హఠాత్తుగా విమానం రద్దు చేసినట్లు ప్రకటించారు. ఆగ్రహించిన ప్రయాణికులు ప్రైవేటు విమానాశ్రయం నిర్వాహక అధికారులతో వాగ్వాదానికి దిగారు. వెంటనే విమానాశ్రయ భద్రత అధికారులు పోలీసులు, విమానాశ్రయ అధికారులు ప్రైవేటు విమానం సంస్థ అధికారులను రప్పించి అక్కడ ఆందోళన చేస్తున్న వారితో చర్చలు జరిపారు. రాత్రి 7 గంటలకు చెన్నై నుంచి నాశిక్ వెళ్లే విమానంలో పంపిస్తామని వాళ్లు అక్కడి నుంచి షిరిడీకి రోడ్డు మార్గంగా వాహనాల్లో తీసుకెళ్తామని చెప్పారు. దీంతో ప్రయాణికులు ఆందోళన విరమించారు.

రెడ్ కార్పెట్ ఆహ్వానం

- జపాన్ సంస్థలకు సీఎం స్టాలిన్ పిలుపు
- దక్షిణాసియాలో నంబర్–1 లక్ష్యం
- తమిళనాడులో పెట్టుబడులు పెట్టండి



జపాన్ సంస్థలతో సీఎం స్టాలిన్ సమావేశం



సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందాలు

సాక్షి, చెన్నై: తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే జపాన్ సంస్థలకు రెడ్‌కార్పెట్ ఆహ్వానం పలుకుతామని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. దక్షిణాసియాలోనే పారిశ్రామికంగా నంబర్ -1 లక్ష్యంగా తమిళనాడు దూసుకెళ్తోందన్నారు. ఇందుకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు.

పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా విదేశీ పర్యటనలో సీఎం స్టాలిన్ ఉన్న విషయం తెలిసిందే. బుధ, గురువారాలలో ఆయన సింగపూర్‌లో పర్యటించారు. శుక్రవారం జపాన్‌కు చేరుకున్న సీఎంకు అక్కడి రాయబార కార్యాలయ అధికారులు, తమిళ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. జపాన్‌లోని ఒసాకా నగరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. విదేశీ వర్తక కేంద్రంలో జరిగిన సమావేశంలో 80 జపాన్ సంస్థలకు చెందిన సీఈఓలతో భేటీ అయ్యారు. తమిళనాడులోని వనరులు, తమ పాలసీల అంశాలను వివరించారు. ఈసందర్భంగా చెన్నై శివారులోని తిరుప్పోరూర్‌లో ఉన్న టైసెల్ సంస్థ విస్తరణ పనులకు అవగాహన ఒప్పందం జరిగింది. అలాగే, మరికొన్ని సంస్థలు తమిళనాడులో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతూ అవగాహన ఒప్పందాలు చేసుకున్నాయి.

దక్షిణాసియాలో ప్రవేశ మార్గం..

ఈసందర్భంగా సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ దక్షిణాసియా ఖండంలోనే ప్రధాన ప్రవేశ మార్గంగా తమిళనాడులోని చెన్నై నగరం బాసిల్లుతోందన్నారు. ఇక్కడ అని రకాల వనరులు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. ప్రధానంగా జపాన్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు మరింత దోహదకరమైన పరిస్థితులు ఎక్కువగానే ఉన్నాయని వివరించారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలుకుతామని, ఆ మేరకు అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు, అనుమతులు, సహకారం అందిస్తామని వివరించారు. 2024 జనవరి 10,11 తేదీల్లో చెన్నై వేదికగా జరిగే ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. 2010లో తాను డిప్యూటీ సీఎంగా ఉన్న కాలంలో తమిళనాడులోకి అనేక జపాన్ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన విషయాన్ని ఈసందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఇదే సహకారం తమకు అందించాలని తమతో చేతులు కలపాలని కోరారు. భారత్ – జపాన్ దేశాల మధ్య సత్సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని గుర్తు చేస్తూ, ఇదే అదనుగా తమిళనాడులోకి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు.

ఆలయ ఏనుగుకు పుట్టినరోజు వేడుకలు



పుట్టినరోజు జరుపుకుంటున్న అఖిల

అన్నానగర్: తిరుచ్చిలో గురువారం ఆలయంలోని ఏనుగు అఖిల పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుచ్చి తిరువనైకావల్ జంబుకేశ్వరర్ అఖిలాండేశ్వరి ఆలయం. ఈ ఆలయంలో అఖిల అనే ఏనుగు ఉంది. ఈ ఏనుగు 2002లో అసోంలో పుట్టింది. 2011లో ఒక ప్రైవేట్ ఫౌండేషన్ తరఫున ఏనుగును తిరువనంతపురం ఆలయానికి అప్పగించారు. అఖిల అనే ఏనుగు గత 11 సంవత్సరాలుగా ఈ ఆలయంలో సేవలందిస్తోంది. ఆలయ ఆవరణలో అఖిల స్నానం కోసం ఈత కొలను, స్నానం చేయడానికి 1,200 చదరపు అడుగుల మట్టి కొలను ఏర్పాటు చేశారు. ఈ స్థితిలో గురువారం అఖిల ఏనుగుకు 21వ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూలమాల వేసి గజపూజ నిర్వహించారు. ఆ తర్వాత అఖిలకు ఇష్టమైన పండ్లు, కూరగాయలు, వేరుశనగ స్వీట్లను అందించారు. ఆలయ సహాయ కమిషనర్ రవిచంద్రన్ అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇక మరింత దూకుడు

సాక్షి, చెన్నై : ఇక, తన రాజకీయపయనం వేగం పంజుకోనున్నదని శశికళ తెలిపారు. కష్టపడే వాళ్ల కోసమే క్రియా శీలక రాజకీయాలలో మరింత దూకుడు పెంచనున్నట్టు చెప్పారు. శుక్రవారం నాగపట్నం జిల్లా వేలాంగనిలో శశికళ మీడియాతో మాట్లాడారు. 2024 లోక్‌సభ ఎన్నికలు లక్ష్యంగా తాను వ్యూహాలకు పదును పెట్టినట్టు వివరించారు. కార్యకర్తల్నే కాదు, అందరినీ కలిసే మార్గం, సమయం వస్తున్నదని తెలిపారు. ఎన్నికల సమయంలో అందరం కలిసికట్టుగా ఒకే వేదికపై రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ పయనం నెమ్మదిగా సాగుతున్నట్టు అందరూ చెబుతున్నారని, అయితే, వేగం పుంజుకోనున్నట్టు చెప్పారు. జయలలిత మార్గంలో అందరూ ఒకే వేదికగా వచ్చే రోజులు రాబోతున్నాయన్నారు. 39 సంవత్సరాలుగా రాజకీయవ్యూహాలకు పదును పెట్టిన వ్యక్తి తాను అని, తన వాహనం వెళ్లని గ్రామం అంటూ లేదని, అక్కడి ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసినట్లు వివరించారు. కష్ట జీవుల కోసం క్రియా శీలక రాజకీయాల్లో వేగం పెంచబోతున్నట్టు ప్రకటించారు.

ఐటీ ఎటాక్!

- టార్గెట్ సెంథిల్ బాలాజి
- చెన్నై, కోవై, ఈరోడ్, కరూర్‌లో దాడులు
- తిరగబడ్డ డీఎంకే సేనలు
- ఎస్పీని ఆశ్రయించిన ఐటీ అధికారులు
- ఆతర్వాత భద్రత నడుమ సోదాలు
- మా ఇంట్లో జరగలేదన్న మంత్రి



కరూర్‌లో రచ్చ..కారు ధ్వంసం, (ఇన్‌సెట్) సెంథిల్ బాలాజి



ఈరోడ్‌లో సెంథిల్‌బాలాజి స్నేహితుడి ఇంట్లో సోదాలు

సాక్షి, చెన్నై: రాష్ట్ర విద్యుత్, ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీని టార్గెట్ చేసే రీతిలో శుక్రవారం ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. చెన్నై, కరూర్, కోయంబత్తూరు, ఈరోడ్‌లోని ఆయన సోదరుడు, స్నేహితులు బంధువుల ఇళ్లలో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. కరూర్‌లో డీఎంకే వర్గాలు తిరగబడడంతో ఐటీ అధికారులు బెంబేలెత్తిపోయారు. రక్షణ కోసం ఎస్పీ కార్యాలయానికి పరుగులు తీశారు. ఆతర్వాత వందలాది మంది పోలీసుల నిఘా నీడలో తనిఖీల్లో నిమగ్నమయ్యారు. తన ఇంట్లో ఐటీ సోదాలు జరగలేదని మంత్రి సెంథిల్ బాలాజీ స్పష్టం చేశారు.

అన్నాడీఎంకే హయాంలో మంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగం పేరిట మోసం చేశారంటూ సెంథిల్ బాలాజీపై దాఖలైన కేసులు ప్రస్తుతం మళ్లీ మొదటి నుంచి విచారించే విధంగా గతవారం సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే, ప్రస్తుతం డీఎంకే కెబినెట్‌లో మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీని టార్గెట్ చేసి అన్నాడీఎంకే, బీజేపీ, పుదియతమిళగంలను తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. గవర్నర్ ఆర్ఎన్ రవిని కలిసి ఫిర్యాదు కూడా చేశాయి. లక్షల కోట్ల అవినీతి అంటూ వ్యాఖ్యలు చేశాయి. తన చుట్టూ ఉన్న వారిని సెంథిల్ బాలాజి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాడని, విద్యుత్, టాస్మాక్ బార్ల కాంట్రాక్టులు, ఖాళీ బాటిళ్ల కొనుగోళ్ల బాధ్యతలను అప్పగిస్తున్నారని ఆరోపించాయి. వీటిని సెంథిల్ బాలాజి ఖండించారు. అలాగే, బీజేపీ, పుదియ తమిళగం కట్చి నేతలపై గురువారం పరువునష్టం దావా కూడా వేశారు. ఈ వ్యవహారం ఓ వైపు ఇలా ఉంటే, మరో వైపు శుక్రవారం ఉదయాన్నే పదుల సంఖ్యలో ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. సెంథిల్ బాలాజీని వ్యక్తిగతంగా టార్గెట్ చేయకుండా ఆయన చుట్టూ ఉన్న వారిపై గురి పెట్టారు.

40 చోట్ల సోదాలు..

కోయంబత్తూరు, ఈరోడ్, చెన్నై, కరూర్‌లలో ఏక కాలంలో ఉదయాన్నే పదుల సంఖ్యలో ఐటీ అధికారులు పలు బృందాలుగా సోదాల్లో నిమగ్నమయ్యారు. కోయంబత్తూరులో డీఎంకే నేత, సెంథిల్ బాలాజీ సన్నిహితుడు, కాంట్రాక్టర్ సెంథిల్ కార్తికేయన్ ఇంట్లో తొలుత సోదాలకు దిగారు. ఈ సమాచారంతో అక్కడకు పెద్ద సంఖ్యలో డీఎంకే వర్గాలు చేరుకుని సోదాలను ఖండిస్తూ నినదించాయి. అలాగే, కోవైలోని మరో సన్నిహితుడు ఈశ్వరమూర్తి నివాసం, కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. ఈరోడ్‌లోని మరో సన్నిహితుడు ఆనందన్, సచ్చినానందన్‌తో పాటు పలుచోట్ల విద్యుత్, టాస్మాక్ కాంట్రాక్టర్లను టార్గెట్ చేసి సోదాలు చేపట్టారు.

కరూర్‌లో రచ్చ..ఐటీ అధికారుల బెంబేలు

సెంథిల్ బాలాజి సొంత జిల్లా కరూర్‌లో ఐటీ సోదాలు రచ్చకు దారి తీశాయి. కరూర్‌లోని సెంథిల్ బాలాజీ సోదరుడు అశోకన్, గణపతి నగర్‌లోని సన్నిహితులు శంకర్, తంగరాజ్, రామకృష్ణన్‌తో పాటు మరి కొందరు బంధువులను గురి పెట్టి అధికారులు సోదాలకు దిగారు. తంగరాజ్ ఇంట్లోకి గోడ దూకి మరీ అధికారులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అక్కడ వేచి ఉండక తప్పలేదు. అలాగే, అశోకన్ నివాసంలో సోదాలు ఉద్రిక్తతకు దారి తీశాయి. ఓ మహిళా అధికారినిని డీఎంకే వర్గాలు చుట్టు ముట్టేశాయి. దాడికి ప్రయత్నించే సంఘటన ఇక్కడ జరగడంతో ఐటీ అధికారులు బెంబేలెత్తారు. ఓ వాహనం అద్దాలను సైతం డీఎంకే వర్గాలు ధ్వంసం చేశాయి. దీంతో కరూర్‌లో పది చోట్ల సోదాలకు సిద్ధమైన అధికారులు ఆందోళనతో ఎస్పీ సుందరవదనన్ కార్యాలయాన్ని రక్షణ కోసం ఆశ్రయించారు.

అంతా రహస్యం...

సాధారణంగా ఐటీ సోదాలకు వెళ్లే సమయంలో స్థానికంగా ఉన్న పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడం లేదా, సీఆర్‌పీఎఫ్ బలగాలను అధికారులు వెంట బెట్టుకెళ్లడం జరిగేది. అయితే, ఈ సారి కనీసం పోలీసు అధికారులకు కూడా సమాచారం ఇవ్వకుండా దాడుల వ్యవహారాన్ని రహస్యంగా ఉంచారు. దీంతో తనిఖీలకు వెళ్లిన అనేక చోట్ల ఐటీ అధికారులకు ముచ్చెమటలు తప్పలేదు. ఐటీ అధికారులను డీఎంకే వర్గాలు చుట్టుముట్టడంతో వివాదం రాజుకుంది. చివరకు గట్టి భద్రత నడమ మళ్లీ అధికారులకు సోదాలకు వెళ్లారు. ఈ విషయంగా కరూర్ ఎస్పీ సుందరవదనన్ మీడియాతో మాట్లాడుతూ, ఐటీ దాడుల విషయంగా తమకు అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదన్నారు. తమను ఆశ్రయించినానంతరం భద్రతను కల్పించామన్నారు. చెన్నైలోని అశోకన్ ఇళ్లు, అతడి సన్నిహితుల కార్యాలయాలు అంటూ ఐదు ప్రాంతాలతో పాటు మొత్తంగా 40 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. వీటితో పాటు కేరళ రాష్ట్రం పాలక్కాడు, తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్, బెంగళూరులో ఉన్న మంత్రి సన్నిహితులను కూడా ఐటీ టార్గెట్ చేసి ఉండడం గమనార్హం.

నా ఇంట్లో జరగలేదు.

ఐటీ దాడులపై మంత్రి సెంథిల్ బాలాజి స్పందించారు. తన ఇంట్లో, కార్యాలయాలలో ఎలాంటి సోదాలు జరగలేదన్నారు. తన సోదరుడు, అతడి సన్నిహితుడు ఇళ్లు, కార్యాలయాలలో సోదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వారంతా పలు చోట్ల కాంట్రాక్టర్లుగా వృత్తిని కొనసాగిస్తున్నారని, వారిని టార్గెట్ చేసి ఐటీ అధికారులు సోదాలలో నిమగ్నమై ఉన్నారని వివరించారు. డీఎంకే నేత ఆర్ఎస్ భారతీ స్పందిస్తూ, సీఎం స్టాలిన్ విదేశాలకు వెళ్లిన నేపథ్యంలో పథకం ప్రకారం ఈ ఐటీ దాడులకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల నుంచి తమిళనాడులోకి పెట్టుబడులు రానివ్వకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగానే బీజేపీ ఈ దాడులను చేయిస్తున్నదని ధ్వజమెత్తారు. కాగా, సోదాలకు వచ్చిన ఐటీ అధికారులపై డీఎంకే సేనలు తిరగబడడం, దాడికి ప్రయత్నించడాన్ని అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, రాష్ట్ర కోఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ ఖండించారు.

7నుంచి బడిగంటలు

- తమిళనాట బడులు పునఃప్రారంభం
- సెలవులు పొడిగింపు
- విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేశ్



అన్బిల్ మహేశ్

సాక్షి, చెన్నై : తమిళనాడులో 2023–24 విద్యా సంవత్సరం జూన్7వ తేదీ నుంచి బడులు ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు వేసవి సెలవులను మూడు నుంచి ఐదు రోజుల వరకు పొడిగించారు. ఈ వివరాలను తిరుచ్చిలో తమిళనాడు విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేశ్ ప్రకటించారు. 2022–23 విద్యా సంవత్సరం ఏప్రిల్ 28వ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటికే పది, ప్లస్ ఒన్, ప్లస్‌టూ ఫలితాలను ప్రకటించారు. ఇక, పాఠశాలల రీ ఓపెనింగ్‌కు తగిన కసరత్తులపై విద్యా శాఖ దృష్టి పెట్టింది. ముందుగా నిర్ణయించిన మేరకు 1–5 తరగతుల విద్యార్థులకు జూన్ 5వ తేదీ నుంచి, 6–12 తరగతుల విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచి పాఠశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే, రాష్ట్రంలో భానుడి ప్రతాపం ఇంకా తగ్గ లేదు. మరో పది రోజులు ఎండ వేడి అధికంగానే ఉంటుందని, ఆతర్వాత క్రమంగా తగ్గుముఖం పడుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఎండల దెబ్బకు జనం విలవిల లాడుతున్న నేపథ్యంలో బడులు తెరిచిన పక్షంలో విద్యార్థులకు సమస్యలు ఎదుర్కోక తప్పదన్న విషయాన్ని తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జపాన్‌లో ఉన్న సీఎం స్టాలిన్‌తో విద్యామంత్రి అన్బిల్ మహేశ్ చర్చించారు. సెలవులను పొడిగించేందుకు నిర్ణయించారు. అదేసమయంలో జూన్ 5వ తేదీ నుంచి ఎండలు తగ్గుముఖం పడతాయని వాతావరణ కేంద్రం ప్రకటించడంతో జూన్ 7వ తేదీని రీ ఓపెనింగ్ డేగా నిర్ణయించారు. తిరుచ్చిలో విద్యామంత్రి అన్బిల్ మహేశ్ మీడియాతో మాట్లాడుతూ, సీఎం స్టాలిన్‌తో చర్చించినానంతరం 2023–24 విద్యా సంవత్సరం జూన్ 7 నుంచి మొదలు అవుతుందని ప్రకటించారు. 1 నుంచి 12 తరగతులకు అదే రోజు నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు. తల్లిదండ్రులు, జిల్లాల్లోని విద్యా శాఖ అధికారులతో కూడా సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరిక సంఖ్యను పెంచేందుకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. అందుకే ఈ సారి ముందుగానే అడ్మిషన్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. 1.70 లక్షల మందిని కొత్తగా విద్యార్థులను చేర్చాలన్న లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

పుదుచ్చేరిలో సీబీఎస్ఈ మయం

- ప్రభుత్వ బడుల్లో సెంట్రల్ సిలబస్
- తమిళ విద్యకు స్వస్తి
- ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు
- 1–9 ఆల్‌పాస్

సాక్షి, చెన్నై: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇక సీబీఎస్ఈ సిలబస్ అమల్లోకి రానుంది. తమిళనాడు ప్రభుత్వ విద్యా విధానానికి స్వస్తి పలికేందుకు పుదుచ్చేరి పాలకులు నిర్ణయించారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమల్లోకి రానున్న దృష్ట్యా, ఈ విద్యాసంవత్సరంలో 1–9 విద్యార్థులను ఆల్ పాస్ చేస్తూ శుక్రవారం ప్రకటన చేశారు.

తమిళనాడుకు పొరుగున ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో తమిళ విద్యా విధానమే అమల్లో ఉంటోంది. ఇక్కడ తమిళనాడులో ఏ విధంగా విద్యావ్యవహారాలు అనుసరిస్తూ వచ్చారో దానినే కొనసాగించడం జరిగింది. పది, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు కూడా తమిళనాడు విద్యావిధానం ఆధారంగానే నిర్వహిస్తూ వచ్చారు. అయితే, 2023–24 నుంచి ప్రభుత్వ పాఠశాలలన్నీ సీబీఎస్ఈ మయం చేయడానికి బీజేపీ–ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పుస్తకాల కొనుగోలు, విద్యార్థులకు కొత్త యూనిఫాం కోసం ప్రత్యేక నిధి కేటాయించారు.

1–9 ఆల్ పాస్...

2023–24లో తొలివిడతగా 1–9 తరగతుల వరకు ప్రభుత్వ బడులు సీబీఎస్ఈ మయం కానున్నాయి. ప్రస్తుతం ఈ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఇక, సీబీఎస్ఈ విద్యా విధానం అమల్లోకి రాబోతున్నందున, తమిళ విద్యా విధానానికి స్వస్తి పలికేందుకు నిర్ణయించారు. విద్యార్థులు ఎవరైనా ఫెయిలైన పక్షంలో వారికి మళ్లీ తమిళ విద్యా విధానం ఆయా తరగతులలో బోధించాల్సిన పరిస్థితి ఉంటుందని పరిగణించి ఆల్ పాస్ ప్రకటన చేశారు. ఈ ఉత్తర్వులను పుదుచ్చేరి విద్యాశాఖ అధికారి ప్రియదర్శిని జారీ చేశారు. 1–9 ఆల్ పాస్ ప్రకటనతో రానున్న విద్యా సంవత్సరం నుంచే బడులన్నీ సీబీఎస్ఈ మయం కానున్నాయి. అయితే, ప్రస్తుతం 10, 11, 12 తరగతులు చదువుతున్న వారికి మాత్రం తమిళ విద్యా విధానం అనుసరిస్తారు. దశల వారీగా తర్వాత విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఆతర్వాత 11, చివరకు 12వ తరగతిని చదువులను సీబీఎస్ఈ మయం చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.

టాస్మాక్ దొంగలపై కాల్పులు

- ఒకరికి గాయాలు
- ఇద్దరు పోలీసులకు కూడా

సాక్షి, చెన్నై: టాస్మాక్ దుకాణంలో చోరీకి పాల్పడి పారిపోతున్న దొంగలపై పోలీసులు తుపాకీ కాల్పులు జరిపారు. ఇందులో ఓ దొంగ గాయపడగా, మరో దొంగ తప్పించుకున్నాడు. అయితే, ఈ దొంగలు మద్యం బాటిళ్లను విసురుతూ జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. నీలగిరి జిల్లా పందలూరు సమీపంలోని దేవాల నెలకోట్టై వద్ద టాస్మాక్ దుకాణం ఉంది. శుక్రవారం ఉదయం మూడు గంటల సమయంలో అటువైపు క్రైంబ్రాంచ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వాహనం గస్తీలో నిమగ్నమైంది. ఈ సమమంలో మూసి ఉన్న టాస్మాక్ లోపలి నుంచి అలికిడి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అదే సమయంలో టాస్మాక్ సమీపంలో ఓ కారు ఆగి ఉండడాన్ని గుర్తించారు. టాస్మాక్ షెట్టర్ పగులగొట్టి ఉండడంతో తెరచి చూశారు. లోపల ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మద్యం బాటిళ్లను ప్యాక్ చేస్తుండడం కనిపించింది. పోలీసులను చూడగానే ఆ వ్యక్తులు బాటిళ్లను విసురుతూ దాడికి దిగారు. వీరి దాడి నుంచి తప్పించుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. బాటిళ్లను మరింతగా విసురుతూ తప్పించుకు వెళ్తున్న ఆ దొంగలపై పోలీసులు తుపాకీ కాల్పులు జరిపారు.

ఈ ఘటనలో ఓ దొంగ తొడను తూటా చీల్చింది. మరో దొంగ పారిపోయాడు. సమాచారం అందుకున్న డీఎస్పీలు సెంథిల్‌కుమార్, సెల్వరాజ్, పందలూరు తహసీల్దార్ నటేషన్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయపడ్డ దొంగను, ఇద్దరు పోలీసులను ఆస్పత్రికి తరలించారు. విచారణలో ఆ దొంగ పందలూరు సమీప గ్రామానికి చెందిన బిజీస్ అలియాస్ సాంబార్ మణి(45)గా గుర్తించారు. ఇతడిపై అనేక కేసులు ఉన్నాయి. పరారీలో ఉన్న మరో దొంగ కేరళకు చెందిన వ్యక్తిగా గుర్తించి గాలిస్తున్నారు. అక్కడున్న కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్మాక్ సూపర్ వైజర్ శివకుమార్‌పై అనుమానాలు రావడంతో విచారిస్తున్నారు. గాయపడ్డ పోలీసులను నీలగిరి ఎస్పీ ప్రభాకరన్ పరామర్శించారు.

28న బ్లాక్ డే

- వీసీకే నిర్ణయం

సాక్షి, చెన్నై: పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవం రోజున వినూత్న రీతిలో నిరసనకు నిర్ణయించామని వీసీకే నేత తిరుమావళవన్ తెలిపారు. ఈ రోజును బ్లాక్‌డేగా అనుసరిస్తూ, తమ కార్యకర్తలు, నాయకులు నల్ల చొక్కాలు, నల్ల బ్యాడ్జీలు ధరించడమే కాకుండా, వారి ఇళ్లపై నల్లజెండాలను ఎగురవేస్తారని వివరించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాల్సిన భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సనాతన పాసిజం వాదిగా ఉన్న ఓ వ్యక్తి పుట్టినరోజు సందర్భంగా ఈ వేడుకకు కేంద్రం నిర్ణయించినట్టు తెలిసింది. అందుకే తాము బ్లాక్ డే అనుసరించేందుకు నిర్ణయించామన్నారు.

సెంగోల్ కోసమే...

పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవం, సెంగోల్ గురించి వివరించేందుకు బుధవారం చెన్నై రాజ్‌భవన్‌లో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్, మూడు రాష్ట్రాల గవర్నర్‌లతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి శేఖర్ బాబు కూడా పాల్గొనడం చర్చకు దారి తీసింది. కొత్త భవనం ప్రారంభోత్సవాన్ని డీఎంకే వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో మంత్రి మీడియా సమావేశంలో వేదికపై కూర్చోవడం చర్చకు దారి తీసింది. ఇందుకు మంత్రి శేఖర్‌బాబు శుక్రవారం సమాధానం ఇచ్చారు. కొత్త పార్లమెంట్‌ను రాష్ట్రపతి చేతులమీదుగానే ప్రారంభించాలన్న డీఎంకే డిమాండ్‌లో ఎలాంటి మార్పులేదన్నారు. తమిళనాడుకు చెందిన సంప్రదాయంగా ఉన్న సెంగోల్ గురించి వివరించే కార్యక్రమం కావడంతో తాను హాజరైనట్టు తెలిపారు. తమిళనాడు సంస్కృతి, సంప్రదాయాలలో సెంగోల్(రాజదండం) భాగం అని, అందుకే దీని గురించి వివరించేందుకు మాత్రం వెళ్లినట్టు తెలిపారు.

క్లుప్తంగా

సమాజాభివృద్ధికి దోహదపడాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న లక్ష్మణ్

కొరుక్కుపేట: సమాజాభివృద్ధికి యువత దోహదపడాలని రాణే ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎల్.లక్ష్మణ్ హితవుపలికారు. ఈమేరకు శుక్రవారం ఉదయం తిరుచ్చిలోని రాణే పాలిటెక్నిక్ క్యాంపస్ 10వ వార్షికోత్సవం, స్నాతకోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి డాక్టర్ పుష్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన అనంతరం ఎల్ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉపాధి కల్పనను పెంపొందించడానికి ఈ ప్రాంతంలోని ప్రముఖ పరిశ్రమ సంబంధింత సాంకేతిక విద్యా సంస్థగా అవతరించాలని తమ సంస్థ దృష్టిసారించిందని అన్నారు. నైపుణ్యం కనపరిచే పాలిటెక్నికల్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని వివరించారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ముందుగా రాణే పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ జాషువా అరుల్‌కుమార్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో రాణే గ్రూప్ ప్రెసిడెంట్ ఆర్ వెంకట్ నారాయణన్ పాల్గొన్నారు

రూ.15 కోట్ల ఆలయ స్థలం స్వాధీనం

కొరుక్కుపేట: చెన్నై మైలాపూర్‌లోని నడుకుప్పం పయాండియమ్మన్ ఆలయానికి చెందిన రూ.15 కోట్ల విలువైన ఆస్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ధర్మాదాయశాఖ ఆధీనంలోని ఆలయాలకు చెందిన ఆస్తులను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకునే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మైలాప్పూర్‌లోని నడుకుప్పం, శాంథోమ్ హైవేపై ఉన్న పయాండియమ్మన్ ఆలయానికి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్థలం ఉంది. దీనిని డాక్టర్ జుబాయ్‌కు అద్దెకు ఇచ్చారు. అతను అద్దె చెల్లించకపోవడంతో ఆ స్థలాన్ని ఆక్రమించుకుని ఉన్నారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా సహాయ కమిషనర్ భాస్కరన్ సమక్షంలో పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ.15 కోట్లు ఉంది . ఆలయ కార్యనిర్వాహణాధికారి తమిళ్ సెల్వి, ఇన్‌స్పెక్టర్ మణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం



పాఠశాల నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

మంత్రి శేఖర్‌బాబు

తిరువళ్లూరు: చెన్నై మెట్రోపాలిటిన్‌లోని వేర్వేరు ప్రాంతంలో 2023–24వ సంవత్సరంలో 34 అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్టు అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు, ఇతర అధికారులు విస్తృతంగా పర్యటించారు. చెన్నై మెట్రో పరిధిలోని ఆవడి, పూందమల్లి, అన్ననూర్‌తో పాటు వేర్వేరు ప్రాంతాల్లో 34 అభివృద్ధి పనులను చేయనున్నట్టు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ పనులకు సంబంధించి ఇటీవల నిధులు కూడా విడుదలయ్యాయి. ఇందులో భాగంగానే ఆవడి నియోజకవర్గంలో రూ.4కోట్ల వ్యయంతో పాఠశాల నిర్మాణం, కారపాక్కంలో క్రీడామైదానం, పూందమల్లిలో పార్క్ పనులను చేపట్టనున్నారు. పనులు జరగనున్న ప్రాంతాలను మంత్రి శేఖర్‌బాబు, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎమ్మెల్యేలు నాజర్, కృష్ణస్వామి, కారపాక్కం గణపతి పర్యటించారు. మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ అసెంబ్లీలో మంత్రి స్టాలిన్ అభివృద్ధి పనులను ప్రకటించారని తెలిపారు. ఈ పనులను త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగానే పనులు చేపట్టనున్న ప్రాంతాలను బ్లూప్రింట్‌ను పరిశీలించినట్టు తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో చెన్నై మెట్రో ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి చెన్నైను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఐఏఎస్ అధికారులు రిషబ్, అపూర్వ పాల్గొన్నారు.

చెత్తకుప్పలతో వ్యాపారులకు ఇబ్బందులు



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్‌ఓ రామమూర్తి



సమావేశంలో పాల్గొన్న రైతులు

వేలూరు: కాట్పాడి రైతు బజారులో చెత్త కుప్పలు వేయడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. వేలూరు కలెక్టరేట్‌లో జిల్లాలోని రైతునాయకులతో సమీక్ష జరిగింది. రైతులు మాట్లాడుతూ కన్నియంబాడి యూనియన్ పరిధిలోని కాట్టుపుదూరు గ్రామంలో చెరువులకు గండి పడి చెరువు నీరు వృథాగా వెళుతోందని వీటిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. చెరువు నీరు పూర్తిగా వృథాగా వెల్లడం వల్ల రైతులు పంటలు పండించడంలో కష్టతరంగా మారతుందన్నారు. పెరియకంబాట గ్రామంలో రేషన్ దుకాణం ఎప్పుడు ఎప్పుడు ఉంటుందో గ్రామంలోని ఎవరికీ తెలియదన్నారు. వీటిపై విక్రయదారులను నిలదీస్తే మూడు దుకాణాలను తనకు అప్పగించడంతో న్యాయం చేయలేక పోతున్నట్లు తెలిపారు. కాట్పాడి, లత్తేరి ప్రాంతంలో తరచూ విద్యుత్ సమస్య ఏర్పడడంతో రైతులు పంటలకు నీటిని సరఫరా చేయలేక పంటలు ఎండి పోతున్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు విన్నవించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం వ్యవసాయ, అటవీశాఖ ఆధ్వర్యంలో రైతులకు సంక్షేమ పథకాలను అందజేశారు. అటవీశాఖ అధికారి కళానిధి, సహకార సంఘాల కోఆర్డినేటర్ నందకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేయడానికి వచ్చిన గ్రామస్తులు

తిరువళ్లూరు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడడంతో పాటు కూలీలను తరచూ వేధిస్తున్న పంచాయతీ ఉపాధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళలు శుక్రవారం ఉదయం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలుకా పూంగుళం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా రోజా, ఉపాధ్యక్షుడిగా రమేష్ వ్యవహరిస్తున్నారు. అయితే ఉపాధి హామీ పనులకు రాని వారిని సైతం వచ్చినట్లు పేర్లు నమోదు చేసి తద్వారా వచ్చే మొత్తాన్ని ఉపాధ్యక్షుడు స్వాహా చేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. పనుల కేటాయింపునకు రూ. 600 లంచం అడుగుతున్నారని చెప్పారు. బ్యాంకుల ద్వారా కూలీ వస్తే వాటిలోనూ వాటా అడుగుతున్నారని వాపోయారు. పంచాయతీ ఉపాధ్యక్షుడి ఆగడాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని.. నిలదీస్తే దాడులకు తెగబడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు విచారణ చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

మారథాన్‌కు అనూహ్య స్పందన



మారథాన్ పోటీలో మహిళా పోలీసులు

కొరుక్కుపేట: తమిళనాడు పోలీసు శాఖలో మహిళా పోలీసు విభాగం ప్రారంభించి 50 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా తమిళనాడు వ్యాప్తంగా మహిళా గార్డుల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కోయంబత్తూరు పోలీసుల ఆధ్వర్యంలో మహిళా పోలీసు అధికారులకు మారథాన్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ శైలేంద్రబాబు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. మహిళా పోలీసుల నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయి మహిళా అధికారి వరకు పాల్గొన్నారు. కోయంబత్తూరు పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన మారథాన్ రేస్ కోర్స్ మీదుగా అన్నా విగ్రహం వద్దకు చేరుకుని ఆర్మ్‌డ్ ఫోర్స్ గ్రౌండ్ వద్ద ముగిసింది. మారథాన్‌లో డీజీపీ శైలేంద్రబాబు, కోయంబత్తూరు పోలీసు కమిషనర్ బాలకృష్ణన్, కార్పొరేషన్ కమిషనర్ ప్రతాప్, సిటీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ సందీప్ పాల్గొన్నారు. దీంతో సాయుధ బలగాల మైదానంలో మహిళా పోలీసులు అల్లరిమూకలను అడ్డుకోవడం వంటి రిహార్సల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

టీఎంసీ బలోపేతానికి కృషి



వివాహ వేడుకల్లో పాల్గొన్న జీకే వాసన్

పళ్లిపట్టు: టీఎంసీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు జీకే.వాసన్ పిలుపునిచ్చారు. పళ్లిపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రామన్ కుటుంబ వివాహ వేడుకల్లో ముఖ్యఅతిథిగా గురువారం రాత్రి పాల్గొన్న ఎంపీ జీకే.వాసన్ వధూవరులను ఆశీర్వదించి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా తిరుత్తణి మాజీ ఎమ్మెల్యే దివంగత ఈఎస్‌టీ.త్యాగరాజన్ కుమారులు ఈఎస్‌టీ.మూర్తి, ఈఎస్‌టీ.భక్తవశ్చలం కుటుంబీకులు వాసన్‌కు ఘనస్వాగతం పలికి సత్కరించారు. వాసన్ రాకతో టీఎంసీ శ్రేణులు భారీగా పొదటూరుపేటకు చేరుకున్నారు. కార్యకర్తలతో వాసన్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీని పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైన ఉందని, గ్రామీణ స్థాయి నుంచి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని, కలిసికట్టుగా కృషితో ఫలితం సాధ్యమని దీమా వ్యక్తం చేశారు.

భార్యకు విగ్రహం..భర్త పూజలు

అన్నానగర్: శివకాశిలో ఓ పారిశ్రామికవేత్త భార్య విగ్రహం పెట్టి పూజిస్తున్నాడు. విరుదునగర్ జిల్లా శివకాశి నేషనల్ కాలనీకి చెందిన నారాయణన్ వ్యాపారవేత్త. ఇతని భార్య ఈశ్వరి. వీరికి నలుగురు పిల్లలు. అందరికీ పెళ్లిళ్ల అయ్యాయి. ఈశ్వరి ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందింది. నారాయణన్ భార్య మరణాన్ని తట్టుకోలేకపోయాడు. దీంతో ఇంటి నిండా భార్య ఫొటోలు పెట్టాడు. కంచుతో భార్య విగ్రహాన్ని సిద్ధం చేసి ప్రత్యేక పూజలు చేసేవాడు. ఈ క్రమంలో అతను బెంగళూరులోని ఓ వ్యక్తి సిలికాన్, రబ్బర్‌తో మానవ రూపం ప్రతిరూపాన్ని సిద్ధం చేస్తున్నాడని తెలిసి ఆ వ్యక్తిని సంప్రదించాడు. భార్య ఈశ్వరి చిత్రాన్ని వాస్తవిక విగ్రహంగా సిద్ధం చేయాలని ఆయన కోరారు. ఈ విగ్రహాన్ని రూపొందించేందుకు రూ.9 లక్షలు కూడా ఇచ్చాడు. ఈశ్వరి విగ్రహాన్ని సిద్ధం చేసి శివకాశికి తీసుకొచ్చారు. ఈశ్వరీ సంస్మరణ రోజున ప్రత్యేక పూజలు చేస్తున్నాడు.

కవిన్ చిత్రానికి అనిరుధ్ సంగీతం



కవిన్ హీరోగా నూతన చిత్ర ప్రారంభోత్సవం

తమిళసినిమా: నటుడు కవిన్ సక్సెస్‌ఫుల్ హీరోగా ఎదుగుతున్నారు. టీవీ సీరియల్ ద్వారా పరిచయమైన ఈయన ఆ తర్వాత బిగ్ బాస్ రియాల్టీ గేమ్ షోతో మరింత పాపులర్ అయ్యారు. దీంతో కవీన్‌కు సినిమా అవకాశాలు రావడం మొదలు పెట్టాయి. అలా ఆయన నటించిన లిఫ్ట్ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ అయినా మంచి పేరు తెచ్చి పెట్టింది. ఇటీవల కవిన్ కథానాయకుడిగా నటించిన డాడా చిత్రం మంచి విజయాన్ని సాధించింది. కాగా తాజాగా మరో నూతన చిత్రంలో నటించడానికి సిద్ధమయ్యారు ఇందులో ఆయనకు జంటగా అయోత్తి చిత్రం ఫేమ్ ప్రీతి ఇస్రాణి నాయకగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని ఇంతకుముందు పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రోమియో పిక్చర్స్ సంస్థ అధినేత రాహుల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా నృత్య దర్శకుడు, నటుడు సతీష్ దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. దీనికి యువ క్రేజీ సంగీత దర్శకుడు అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రం శుక్రవారం చెన్నైలో పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. చెన్నై పరిసర ప్రాంతాల్లో షూటింగును నిర్వహించి పూర్తిచేయనున్నట్లు దర్శకుడు తెలిపారు. ఇది ఈతరం యువతను ఆకట్టుకునే విధంగా కమర్షియల్ అంశాలతో కూడిన ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సమంత హాలీవుడ్ ఎంట్రీ షురూ



సమంత

తమిళసినిమా: సమంత నట వయస్సు సుమారు దశాబ్దంన్నర. వయసు 36 ఏళ్లు ఈ మధ్యకాలంలో ఆమె నటిగా రంగ ప్రవేశం చేయడం, స్టార్ హీరోయిన్గా ఎదగడం, బహుభాషా నటిగా గుర్తింపు తెచ్చుకోవడం, ప్రేమ, పెళ్లి, విడిపోవడం వరకు జరిగిపోయింది. అంతేకాకుండా ఇటీవల మయోటీస్ అనే ప్రాణాంతక వ్యాధికి గురికావడం, దానితో పోరాడి కోలుకోవడం, అదేవిధంగా ఇటీవల ఆమె ఎన్నో ఆశలు పెట్టుకున్న చారిత్రక కథా చిత్రం శాకుంతలం ఆశించిన విజయాన్ని సాధించలేకపోవడంతో సమంత పని అయిపోయింది అనే కామెంట్స్ కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అలా ఒక సెలబ్రిటీగా సమంత ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిందో అంతగా విమర్శలను, ఎదురీతను ఈదిందనే చెప్పాలి. అలాంటి సమంత ఆత్మవిశ్వాసంతో మనోధైర్యంతో ముందుకు సాగుతూనే ఉంది. ప్రస్తుతం తెలుగులో విజయ్‌దేవరకొండకు జంటగా ఖుషి అనే చిత్రంలో నటిస్తున్న ఈమె ఆంగ్ల వెబ్ సీరీస్ సిట్టాడల్ హిందీ రీమేక్‌లో నటిస్తోంది. అలా పాన్ ఇండియా నటిగా గుర్తింపు తెచ్చుకున్న నటి ఇప్పుడు పాన్ వరల్డ్ నటిగా పేరు తెచ్చుకోపోతోంది. అవును ఇప్పుడు సమంత హాలీవుడ్లోకి ఎంట్రీ షురూ అయ్యింది. చెన్నై స్టోరీ అనే హాలీవుడ్ చిత్రంలో నటించబోతోంది. ఇందులో ఇంగ్లాండ్ దేశానికి చెందిన హాలీవుడ్ నటుడు వివేక్ కల్రా కథానాయకుడిగా నటించనున్నారు. దీనికి ఫిలిప్ జాన్ అనే ఆయన దర్శకత్వం వహించారు. ఇది ఇంగ్లాండ్‌కు చెందిన యువకుడికి, చెన్నైకు చెందిన అమ్మాయితో జరిగే ప్రేమకథగా సాగే చిత్రంగా ఉంటుందని సమాచారం త్వరలోనే ఈ చిత్రం సెట్ పైకి వెళ్లనున్నట్లు తెలిసింది.

కోలీవుడ్ టాక్స్

కోలీవుడ్లో మిస్ హైదరాబాద్



శ్రీగౌరీ ప్రియ

తమిళసినిమా: ఏ రంగంలోనైనా ప్రతిభే ప్రామాణికం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా సినీ రంగంలో ప్రతిభకు ఎప్పుడు పెద్దపేట వేస్తారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది అంతే. నటి శ్రీగౌరీప్రియ ప్రస్తుతం అలాంటి ప్రయత్నంలోనే ఉంది. మిస్ హైదరాబాద్ అందాల పోటీల్లో కిరీటాన్ని గెలుచుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు నటిగా కోలీవుడ్లో బాగా వేస్తోంది. ఇప్పటికే తెలుగులో రైటర్ పద్మభూషణ్ చిత్రంలో నటించి సినీ ప్రముఖుల ప్రశంసలను, ఓటీటీ వీక్షకుల ఆదరణ పొందిన ఈమె ఇటీవల కోలీవుడ్లోకి రంగప్రవేశం చేసింది. ఆంథాలజీ చిత్రం మోడరన్ లవ్ చెన్నైలో లాల్గుండ బొమ్మైగళ్ అనే అధ్యాయంలో శోభ పాత్రలో నటించింది. దీనికి రాజు మురుగన్ కథ, దర్శకత్వం నిర్వహించారు. ఈ ఆంథాలజీ చిత్రం అమెజాన్ ప్రైమ్ టైంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో నటి గౌరీ ప్రియ తాంబూయిష్ యువతిగా చాలా మృదువైన పాత్రలో నటించి అటు ప్రేక్షకులు, ఇటు విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. నటి గౌరీప్రియ సహజమైన నటన, ఆకర్షణీయమైన రూపం సినీ వర్గాలను ఆకట్టుకుంటోంది. దీంతో ఈమెకు తమిళంలో పలు అవకాశాలు వస్తున్నాయట. వాటికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని శ్రీగౌరీప్రియ వర్గాలు పేర్కొన్నాయి.

వెబ్ సీరీస్‌లోకి దర్శకుడు విజయ్



దర్శకుడు విజయ్



రకుల్‌ప్రీత్ సింగ్

తమిళసినిమా: ప్రస్తుతం వెబ్ సిరీస్‌లు సినిమాలకు ధీటుగా తయారవుతున్నాయి అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ప్రముఖ నిర్మాతలు, దర్శకులు, హీరో హీరోయిన్లు కూడా వెబ్ సిరీస్‌పై ఆసక్తి చూపుతున్నారు. అదేవిధంగా ఓటీటీల కోసమే చిత్రాలను రూపొందిస్తున్న పరిస్థితి నెలకొంది. దర్శకుడు విజయ్ తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం బూ. ఈ థ్రిల్లర్ కథా చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని తమిళం, తెలుగు భాషల్లో శనివారం నుంచి జియో సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. దీని గురించి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో దర్శకుడు విజయ్ పేర్కొంటూ.. కరోనా సమయంలో రూపొందించినట్లు చెప్పారు. ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చిన రామాంజనేయులు, ఎం. రాజశేఖర్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఈ చిత్ర ఓటీటీ హక్కులను పొందిన జియో స్టూడియోకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ చితంలో నటుడు విశ్వక్‌సేన్, నటి రకుల్ ప్రీతిసింగ్, నివేదా పేతురాజ్, మేఘ ఆకాష్, రెబా మౌనిక జాన్, మంజిమా మోహన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారని పేర్కొన్నారు. జీవీ. ప్రకాష్ కుమార్ సంగీతాన్ని, సందీప్ ఛాయా గ్రహణం అందించారని తెలిపారు.

కొత్త చిత్రానికి రెడీ అంటున్న ధ్రువ్ విక్రమ్



దర్శకుడు గణేష్‌బాబు, ధ్రువ్‌విక్రమ్

తమిళసినిమా: కొందరికి సక్సెస్ అనేది కాస్త ఆలస్యంగానే వస్తుంది. యువ నటుడు ధ్రువ్‌విక్రమ్ ఈ కోవలోకే వస్తారు. ప్రముఖ నటుడు విక్రమ్ వారసుడు ఈయన అన్నది తెలిసిందే. ఎన్నో జాగ్రత్తలు తీసుకొని విక్రం తన వారసుని ఆదిత్యవర్మ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం చేశారు. ఇది తెలుగులో విజయాన్ని సాధించిన అర్జున్ రెడ్డి చిత్రానికి రీమేక్. అయితే కారణాలు ఏమైనా ఈ చిత్రం ధ్రువ్‌విక్రమ్‌కు నిరాశనే మిగిల్చింది. ఆ తర్వాత ఈయన తన తండ్రితో కలిసి మహాన్ అనే చిత్రంలో నటించారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ కావడం వలనో, వేరే కారణాలు వలనో ఆశించిన విజయాన్ని అందుకోలేక పోయింది. అయితే ధ్రువ్‌విక్రమ్ నటనకు మాత్రం విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. అయితే ఈసారి కాస్త ఆలస్యం అయినా గట్టిగా హిట్ కొట్టే తీరాలి అన్న దృఢ సంకల్పంతో ఈ యువనటుడు ఉన్నట్లు తెలుస్తోంది. అలా నాలుగేళ్లగా మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి సమయంలో పరియోరుమ్ పెరుమాళ్, కర్ణన్ వంటి హిట్ చిత్రాల దర్శకుడు మారి సెల్వరాజ్ వైవిధ్యభరిత కథతో ధ్రువ్‌విక్రమ్ ను డైరెక్టర్ చేయడానికి ముందుకు వచ్చారు.అయితే ఆయన ఉదయనిధి స్టాలిన్, కీర్తిసురేష్ జంటగా నటించిన మామన్నన్ చిత్ర చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం విడుదల తరువాత ధ్రువ్ విక్రమ్‌తో చిత్రం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నటుడు ధ్రువ్ విక్రమ్ దానికంటే ముందు మరో చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సినీ వర్గాల సమాచారం. డాడా చిత్రం ఫేమ్ గణేష్ బాబు దర్శకత్వంలో నటించడానికి కమిట్ అయినట్లు తాజా సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: పుళల్ సెంట్రల్ జైలులోని విచారణ విభాగంలో ఖైదీల నుంచి గంజాయి, సెల్‌ఫోన్, సిమ్ కార్డులను పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు మేరకు పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చెన్నైలోని పుళల్ సెంట్రల్ జైలులో రిమాండ్ విభాగంలో 3 వేల మందికి పైగా ఖైదీలు ఉన్నారు. సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి విచారణ యూనిట్‌లోని ఖైదీలను తనిఖీ చేశారు. ఖైదీలు మహ్మద్ నబీ, వసంతకుమార్, సారథి, అరవింద్, అశ్విన్ కుమార్ నుంచి 30 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నివేదిక ఆధారంగా పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి సంబంధిత ఖైదీలను పలు కోణాల్లో విచారిస్తున్నారు.

ట్యాంక్‌లో పడి బాలిక మృతి

అన్నానగర్: ఆడుకుంటూ నీటి ట్యాంక్‌లో పడి నాలుగేళ్ల బాలిక మృతిచెందింది. ఈ ఘటన గురువారం సాయంత్రం వేప్పనపల్లి సమీపంలో చోటుచేసుకుంది. కృష్ణగిరి జిల్లా వేప్పనపల్లి సమీపంలోని ఓటుక్కోట్టై గ్రామానికి చెందిన తిరుపతి రైతు. ఇతని భార్య సంధ్య. ఈ దంపతులకు గోమతి (4) అనే కుమార్తె ఉంది. ఈ స్థితిలో గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గోమతి ఇంటిముందు ఆడుకుంటోంది. తిరుపతి ఎస్టేట్‌కు వెళ్లాడు. తర్వాత సంధ్య వంట కోసం ఇంటి ముందున్న గ్రౌండ్ లెవల్ డ్రింకింగ్ ట్యాంక్ నుంచి బిందెలో నీళ్లు తెచ్చుకుంది. వాటర్ ట్యాంక్ మూయకుండా వెళ్లిపోయింది. గోమతి ఆడుకుంటూ వాటర్ ట్యాంక్‌లో పడిపోయింది. ఇంటికి తిరిగి వచ్చిన తిరుపతి కూతురు కనిపించకపోవడంతో ఇరుగుపొరుగున వెతికాడు. రాత్రి 8 గంటల సమయంలో బాలిక వాటర్ ట్యాంక్‌లో తేలింది. తల్లిదండ్రులు ఆమెను కృష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వేప్పనపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దారుణ హత్య

అన్నానగర్: ముక్కుడల్ సమీపంలో గురువారం పందుల ఫారం యజమాని దారుణ హత్యకు గురయ్యాడు. నెల్లై సమీపంలోని ముకూడల్ హరిరామ్ వీధికి చెందిన చెల్లదురై (76). ముకూడల్ సమీపంలోని అరియానాయకపురం ఆనకట్టకు ఉత్తరం వైపున ఉన్న అటవీ ప్రాంతంలో పందులు పెంచుతున్నాడు. అక్కడ గుడిసె వేసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. ఈ స్థితిలో గురువారం చెల్లదురై పందుల ఫారం ఆవరణలోని మంచంపై శవమై పడి ఉన్నాడు. ఇది గమనించిన బాటసారులు ముక్కోడల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చెల్లదురై మెడలో తాడు బిగించి చంపిన ఆనవాళ్లు కనిపించాయి. చెల్లదురై కుమారుడు మురుగానందం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చెల్లదురై బంధువు బాలకృష్ణన్ (32) డబ్బులు లాక్కునేందుకే చెల్లదురైని తాడుతో గొంతునులిమి హత్య చేసినట్లు విచారణలో తేలింది. అనంతరం బాలకృష్ణను పోలీసులు అరెస్టు చేశారు.

హిజాబ్ ధరించిన డాక్టర్‌కు వేధింపులు

సాక్షి, చెన్నై: హిజాబ్ ధరించి విధుల్లో ఉన్న ఓ డాక్టర్‌ను బీజేపీ నాయకుడు ఒకరు వేధించాడు. హిజాబ్ తొలగించి విధులకు హాజరు కావాలని ఆమెపై తన ప్రతాపం చూపించాడు. ఈ వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. దీంతో ఈ వ్యవహారంపై విచారణకు ఆరోగ్యశాఖా మంత్రి ఎం సుబ్రమణియన్ ఆదేశించారు. తమిళనాడులోని నాగపట్నం జిల్లా తిరుపూండి ప్రభుత్వాస్పత్రిలో మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా డాక్టరు పనిచేస్తున్నారు. ఆమె హిజాబ్ ధరించి విధులకు రావడం జరుగుతోంది. ఈ పరిస్థితులలో గురువారం రాత్రి ఆమె విధుల్లో ఉండగా, అక్కడకు వచ్చిన ఆ ప్రాంత బీజేపీ నేత భువనేశ్వర్ హిజాబ్ వ్యవహారాన్ని వివాదం చేసే ప్రయత్నం చేశారు. ఆమెను తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ, హిజాబ్ తొలగించాలని, డాక్టర్‌గా యూనిఫాంతో రావాలని ఒత్తిడి తెచ్చారు. తన ప్రమేయం లేకుండా వీడియో చిత్రీకరిస్తున్న భువనేశ్వర్‌పై ఆ డాక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అయితే, అతడు మరింత రెచ్చిపోయాడు. అతడి చర్యలను అక్కడున్న వాళ్లు తమ సెల్ కెమెరాలలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఇది శుక్రవారం వైరల్‌గా మారింది. ఆ మహిళా డాక్టర్ నాగపట్నం పోలీసులను ఆశ్రయించారు. రాత్రి సమయంలో ఆస్పత్రికి వచ్చి తన ప్రమేయం లేకుండా వీడియో చిత్రీకరించడాన్ని, విధులు చేయకుండా అడ్డుకోవడమే కాకుండా, హిజాబ్ తొలగించాలని పట్టుబట్టి వేధించినట్టు భువనేశ్వర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని వైద్య సంఘాలు సైతం తీవ్రంగానే పరిగణించాయి. డాక్టర్‌ను వేధించిన బీజేపీ నాయకుడ్ని వెంటనే అరెస్టు చేయాలని, మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఆరోగ్యమంత్రి ఎం సుబ్రమణియన్ దృష్టి పెట్టారు. విచారణకు ఆదేశించారు. దీంతో నాగపట్నం జిల్లా వైద్యాధికారులు విచారణ మొదలెట్టారు.

ఇన్‌స్పెక్టర్‌కు అరెస్ట్ వారెంట్

తిరువొత్తియూరు: విచారణకు హాజరుకాని సూలూరు ఇన్‌స్పెక్టర్‌కు నామక్కల్, సేందమంగళం కోర్టు వారెంట్ జారీ చేసింది. కోయంబత్తూరులోని సూలూర్ పోలీస్ స్టేషన్‌లో మాతయ్యన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. 2018లో నామక్కల్ జిల్లా ఎరుమపట్టి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేశారు. ఆ ప్రాంతంలో దాడి కేసులో విచారణ అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ సేందమంగళం కోర్టులో కొనసాగుతోంది. ఈ కేసులో వ్యక్తిగతంగా హాజరుకావాలని ఇన్‌స్పెక్టర్ మాతయ్యన్‌కు 13 సార్లు సమన్లు పంపినా కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఆయనకు గురువారం మేజిస్ట్రేట్ హరిహరన్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు.

కొడైకెనాల్‌లో వేసవి ఉత్సవాలు

– ఆకట్టుకున్న 60వ పుష్ప ప్రదర్శన

సేలం: పేదల ఊటీగా పేరుగాంచిన కొడైకెనాల్‌లో ప్రతి ఏడాది మే నెలలో వేసవి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఈ ఏడాది వేసవి ఉత్సవాలలో భాగంగా 60వ పుష్ప ప్రదర్శన కొడైకెనాల్‌లో బ్రైంట్ పార్క్‌లో ఏర్పాటు చేశారు. శుక్రవారం కోలాహలంగా ప్రారంభమైన వేసవి ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా లక్ష కారనేషన్ పువ్వులతో ఏర్పాటు చేసి జిరాఫీ, కుందేలు, బాతు, చిలుక వంటి రూపాలు పలు వర్ణాలతో అమితంగా ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా కూరగాయలతో ఏర్పాటు చేసిన అడవి జిరాఫీ, బర్రె, జీబ్రా వంటి ఆకృతులు పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి.

వాల్పారైలో వేసవి ఉత్సవాలు

కోవై జిల్లా వాల్పారైలో శుక్రవారం వేసవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు వారిచే ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొల్లాచ్చి సబ్ కలెక్టర్ ప్రియంకా పాల్గొని జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా భరతనాట్యం, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం ఏర్పాటు చేసిన నీలిగిరి సంప్రదాయ గిరిజన నృత్యం అమితంగా ఆకట్టుకుంది.


బ్రైంట్‌పార్క్‌లో పర్యాటకుల సందడి




ఆకట్టుకున్న ప్రత్యేక జిరాఫీ, చిలుక, అడవి బర్రె, తిరువళ్లువర్ ఆకృతులు

టెలిగ్రామ్ యాప్‌లో రూ.46 లక్షల మోసం

యువకుడు అరెస్ట్

అన్నానగర్: తూత్తుక్కుడిలో పార్ట్ టైమ్ ఉద్యోగం అంటూ టెలిగ్రామ్ యాప్ ద్వారా మెసేజ్ పెట్టి రూ.46 లక్షలు మోసం చేసిన యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తూత్తుకుడి మిల్లర్‌పురం చిన్నమణినగర్ కు చెందిన తంగదురై (52) టెలిగ్రామ్ యాప్‌ను ఉపయోగిస్తుండగా మెయిల్ ఐడీ నుంచి పార్ట్ టైమ్ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఈ ప్రకటనను చూసిన తంగదురై తనకు సందేశం పంపిన వ్యక్తితో మాట్లాడి, తాము ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నామని, కరోనా కాలంలో తమ కంపెనీ ఆదాయంపై ప్రభావం పడిందని చెప్పారు. దాన్ని మెరుగుపరచడానికి దాని సంబంధిత స్టార్ రేటింగ్ లను ఇవ్వడం ద్వారా తాము చెప్పిన కంపెనీ ఆదాయం పెంచుకోవచ్చని, స్టార్ రేటింగ్ ఇస్తే కమీషన్ ఇస్తామని తంగదురైకి చెప్పారు. దీంతో మొదట రూ.1,100, రూ.1,500 లాభం ఇస్తూ తంగదురైని నమ్మించి, ఇంకా ఎక్కువ కమీషన్ కావాలంటే డబ్బులు పెట్టుబడి పెట్టి తాము చెప్పే పనిని చేయమని తంగదురైకి చెప్పారు. దీని తర్వాత తంగదురై అతను పేర్కొన్న వెబ్‌సైట్‌లో వివిధ పనుల కోసం వివిధ వాయిదాలలో మొత్తం రూ.46 కోల్పోయాడు. తర్వాత మోసపోయానని తంగదురైకి తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టగా నెల్లై జిల్లాకు చెందిన ప్రేమ్ కుమార్ (31) తంగదురైని మోసం చేసినట్లు తేలింది. అనంతరం అతడిని శుక్రవారం అరెస్టు చేసి అతని నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, 9 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వివిధ కంపెనీల పేర్లతో 61 ఏటీఎం కార్డులు, 12 నకిలీ రబ్బర్ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తూత్తుక్కుడి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

బావిలో దూకి వివాహిత బలవన్మరణం

వేలూరు: మేల్ మయనూరు గ్రామానికి చెందిన సురేష్ వేలూరులో టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య భారతి (32). వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం భారతికి అమ్మోరు పోసింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి భారతికి ఆత్మహత్య చేసుకునే విధంగా కలవరం వచ్చిందని భర్త వద్ద తెలిపింది. వీటిని పట్టించుకోకుండా భర్త శుక్రవారం ఉదయం పనికి వెళ్లిపోయాడు. అతను వెళ్లిన వెంటనే భారతి ఇంటి సమీపంలోని బావిలో దూకింది. గమనించిన అదే ప్రాంతానికి చెందిన చిన్నారులు గ్రామస్తులకు విషయాన్ని తెలిపారు. వెంటనే స్థానికులు విరింజిపురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది భారతి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విరింజిపురం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.


మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనస్తీషియా వికటించి మహిళ మృతి

అన్నానగర్: కళ్లకురిచ్చిలో అనస్తీషియా వికటించి శుక్రవారం వేకువజామున ఓ మహిళ మృతిచెందింది. కుమారుడు ప్రైవేట్ ఆస్పత్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కల్లకురిచ్చి జిల్లా చిన్నసేలం సమీపంలోని పాండియకుప్పం గ్రామానికి చెందిన రాంకుమార్. ఇతను వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న తల్లి పెరియమ్మాళ్ (58)ను కళ్లకురిచ్చిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ శస్త్ర చికిత్స నిమిత్తం 23వ తేదీ రాత్రి అనస్తీషియా ఇచ్చారు. వికటించి ఆమె ఆరోగ్యం క్షీణించింది. దీంతో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు ఆమెను మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. అనంతరం పెరియమ్మాళ్‌ను అంబులెన్స్‌లో సేలం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు ప్రైవేట్ ఆస్పత్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉజ్జీవ మహాసభలు ప్రారంభం

కొరుక్కుపేట: ఏసు ప్రభువు సూచించిన ప్రేమ, దయ, సేవా మార్గంలో నడుచుకోవాలని ఏలూరు పాస్టర్ ఎం. జ్యోతిరాజు అన్నారు. చెన్నై క్రోంపేటలోని తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఉజ్జీవ మహా సభలు గురువారం రాత్రి అట్టహాసంగా ఆరంభమయ్యాయి. సంఘకాపరి రెవరెండ్ జి.మోజెస్ అధ్యక్షత వహించగా, ముఖ్య ప్రసంగీకులుగా జ్యోతిరాజు దైవ సందేశాన్ని వినిపించారు. దేవుడు అందించిన మంచి మార్గంలో నడుకోనేందుకు ఆసక్తిని కనబరచాలని సూచించారు. సంఘం పెద్దలు సుందరం, మనో, వినోద్, ప్రభాకర్, మోసెస్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పాస్టర్ జ్యోతిరాజు

ఐఐటీ మద్రాసుతో ఒప్పందం

కొరుక్కుపేట: రైతుల ఆదాయాన్ని, లాభదాయకతను మెరుగుపరచడానికి చెన్నైలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాసు (ఐఐటీ-మద్రాసు)తో వేకూల్ ఫుడ్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం జరిగిన కార్యక్రమంలో ఐఐటీ మద్రాసు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి, వేకూల్ సంస్థ ఎండీ కార్తీక్ జయరామన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా కామకోటి మాట్లాడుతూ దేశంలో పునరుత్పత్తి వ్యవసాయం కోసం బలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి వినూత్న వ్యవసాయ కేంద్రీకృత పరిష్కారాలను అందించటం ద్వారా అగ్రిస్టాక్‌ను మరింత మెరుగుపరుస్తుందని అన్నారు. ఈ విధంగా క్లైమేట్ స్మార్ట్ అగ్రిప్రాక్టీస్‌ల విద్య ద్వారా రైతు ఆదాయాన్ని, లాభదాయకతను మెరుగుపరచడానికి ఈ ఒప్పందం జరిగిందని వివరించారు.


ఒప్పందం చేసుకుంటున్న ప్రొఫెసర్ కామకోటి, కార్తీక్ జయరామన్

లారీ బోల్తా పడి ఇద్దరు దుర్మరణం

– మరో 10 మందికి గాయాలు

అన్నానగర్: పరమక్కుడి సమీపంలో భక్తులతో వెళుతున్న లారీ బోల్తా పడి ఇద్దరు మృతిచెందారు. మరో 10 మంది గాయపడ్డారు. శివగంగై జిల్లా మానమదురై కులాలార్ వీధికి చెందిన కార్తీకరాజ్ (30). ఇతను తన బంధువులతో కలిసి లారీలో రామనాథపురం జిల్లా కముదిలోని ఆలయానికి గురువారం వెళ్లారు. అక్కడ స్వామి దర్శనం చేసుకుని అదే లారీలో తిరిగి బయలుదేరారు. గురువారం రాత్రి పరమకుడి సమీపంలోని దేవనేరి ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలోకి రాగానే లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న మానమదురైకి చెందిన బాబు భార్య లక్ష్మి (68), మురుగన్ (45) అక్కడికక్కడే మృతిచెందారు. సంగీత (42), సత్య (49), శారద (63), రాందాస్ (20) సహా 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని పరమక్కుడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కార్తికరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పార్తిబనూరు పోలీసులు లారీ డ్రైవర్ కన్నన్ (52)ను అరెస్ట్ చేశారు.

లంచం కేసులో వీఏఓ అరెస్ట్


జాకీర్ హుస్సేన్

తిరువొత్తియూరు: డెత్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.5వేలు లంచం తీసుకున్న గ్రామ నిర్వాహక అధికారిని ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై రెడ్ హిల్స్ సమీపం పాడినయనల్లూరు పంచాయతీ గ్రామ నిర్వాహక అధికారి జాకీర్ హుస్సేన్ (45). ఇతని వద్ద చెన్నై వ్యాసార్పాడికి చెందిన ఉమామహేశ్వరి పాడియనల్లూరులో మృతి చెందిన భర్త మునుస్వామి డెత్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.5వేలు లంచం ఇవ్వాలని జాకీర్ హుస్సేన్ డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఏసీబీకి ఫిర్యాదు చేసింది. ఉమామహేశ్వరికి ఏసీబీ పోలీసులు రసాయనం పూసిన కరెన్సీ నోట్లను ఇచ్చి అతనికి ఇవ్వాలని చెప్పారు. ఈ క్రమంలో నగదు ఇస్తుండగా తిరువళ్లూరు ఏసీబీ డీఎస్పీ సెల్వం రెడ్ హ్యాండెడ్‌గా జాకీర్ హుస్సేన్‌ను పట్టుకుని అరెస్టు చేశారు.

ఏసీబీ వలలో అవినీతి అధికారి

తిరువొత్తియూరు: కోవైలో లైసెన్స్ రెన్యువల్ చేయడానికి రూ. 7వేలు లంచం తీసుకున్న ఆహార భద్రత అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. కోవై వడవెల్లి సమీపంలో ఉన్న నావలూరు ప్రాంతానికి చెందిన దురైస్వామి (78) అదే ప్రాంతంలో 30 ఏళ్లుగా ప్రొవిజన్ దుకాణం నడుపుతున్నాడు. ఇతని దుకాణంలో కోవై కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. ఈ దుకాణాన్ని కోవై కార్పొరేషన్ ఆహార భద్రత తనిఖీ అధికారి వెంకటేష్ బుధవారం తనిఖీ చేశారు. దుకాణం లైసెన్సు గడువు పూర్తి అయినట్లు తెలిసింది. దీంతో రెన్యువల్ చేయడానికి దొరసామి వద్ద వెంకటేష్ రూ. 15 వేలు లంచం కోరాడు. చివరకు రూ.7వేలు ఇవ్వడానికి మాట్లాడుకున్నాడు. ఈ క్రమంలో దురైస్వామికి లంచం అవ్వడానికి ఇష్టం లేక ఏసీబీకి సమాచారం అందించారు. పోలీసులు సలహా మేరకు రసాయనం పూసిన కరెన్సీ నోట్లు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

45 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: చెన్నై అశోక్‌నగర్‌లో 45 సవర్ల నగలు, 10 ఐఫోన్లను దుండగులు చోరీ చేశారు. చెన్నై అశోక్‌నగర్ మొదటి వీధికి చెందిన సాహుల్‌హమీద్. ఇతను పాత బంగారం నగలు, ఐఫోన్లు విక్రయిస్తుంటాడు. ఇతని దుకాణంలో చిన్నప్పటి నుంచి పుదుకోట జిల్లాకు చెందిన లాముమా మరైకాయార్ (28) పనిచేస్తున్నాడు. సాహుల్ హమీదు గురువారం 45 సవర్ల బంగారు నగలు, 10 ఐఫోన్లను బజారులో ఉన్న దుకాణంలో ఇచ్చి రమ్మని పంపాడు. బైక్‌లో బర్మా బజారుకు వెళ్లిన లాముమ తిరిగి రాలేదు. లాముమ నగలు, ఐఫోన్లతో పారిపోయినట్లు తెలిసింది. సాహుల్‌హమీద్ అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేలూరులో రూ.7.65 కోట్లతో అదనపు భవనాలు


నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న మంత్రి ఏవావేలు

వేలూరు: వేలూరు ప్రభుత్వ అతిథి భవనంలో రూ.7.65 కోట్లతో అదనపు భవనాలు నిర్మించనున్నట్లు రాష్ట్ర మంత్రి ఏవా వేలు అన్నారు. శుక్రవారం ఉదయం వేలూరులోని పర్యాటక భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అతిథి భవనంలో స్థలం సరిపోవడం లేదని అదనపు భవనం నిర్మించాలని అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ క్రమంలో భవన నిర్మాణానికి స్థలాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. దీంతో ప్రభుత్వం నిర్మాణ పనుల కోసం రూ. 7.65 కోట్లు కేటాయించిందని చెప్పారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. మరో ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించామని చెప్పారు. పనులు నాణ్యతగా చేయాలన్నారు. మొత్తం 1,260 చదరపు అడుగుల స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మొదటి అంతస్తులో ఆరు వీఐపీ, వీవీఐపీ గదులు నిర్మించడంతో పాటు లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆయనతో పాటు పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ శంకర్‌లింగం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయరామన్, అసిస్టెంట్ ఇంజినీర్ రాజామణి ఉన్నారు.

తిరువళ్లూరులో అగ్రి గ్రీవెన్స్‌డేకు స్పందన


రైతుల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్

తిరువళ్లూరు: జిల్లాలోని 52 ప్రత్యక్ష వరి కొనుగోలు కేంద్రాల నుండి ప్రస్తుత సీజన్‌లో 36, 294.64 మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసినట్టు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తెలిపారు. తిరువళ్లూరు కలెక్టరేట్‌లో అగ్రి గ్రీవెన్స్‌డేను కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ శుక్రవారం ఉదయం నిర్వహించారు. సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతుల నుంచి వచ్చిన వినతి పత్రాలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖలకు చెందిన అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమంతో పాటు వారికి వున్న సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రతి నెలా ఆర్డీఓ, కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న అగ్రి గ్రీవెన్స్‌డే సరైన వేదికన్నారు. రైతుల నుంచి వరిని దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేయడం ద్వారా రైతులకు లాభం చేకూరిందన్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో మద్దతు ధర ఆధారంగా తిరువళ్లూరు, రెడ్‌హిల్స్, ఊత్తుకోట సబ్‌డివిజన్‌లలో వరి ధాన్యాలను కొనుగోలు చేసి భద్రపరిచినట్టు తెలిపారు. కలైంజర్ గ్రామ సమగ్ర వ్యవసాయ అభివృద్ధి పథకం ద్వారా లబ్ధిపొందే విధంగా 12 గ్రామాలకు చెందిన రైతులకు పట్టాను అందించారు. ఈకాడు, పట్టరై, పేరండూర్, కూడల్‌వాడి గ్రామాల్లోని చెరువులలో పూడికతీత చేపట్టి తద్వారా వచ్చే మట్టిని వ్యవసాయ భూములకు వాడుకోవడానికి అనుమతి ఇచ్చిన ఉత్తర్వులను రైతులకు అందించారు. డీఆర్వో అశోకన్, రీజనల్ మేనేజర్ శేఖర్, వ్యవసాయశాఖ అధికారులు సురేష్‌కుమార్, ఎబినేజర్ పాల్గొన్నారు.

టీవీ సీరియల్ డైరెక్టర్ భార్య ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై వలసరవాక్కంలో దంపతుల మధ్య ఏర్పడిన కుటుంబకులహాల కారణంగా ప్రముఖ టీవీ సీరియల్ డైరెక్టర్ భార్య గురువారం మధ్యాహ్నం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చెన్నై వలసరవాక్కము అన్బునగర్ రెండవ వీధిలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో నివాసం ఉంటున్న నాగరత్నం (47). ఇతను టీవీ సీరియల్ డైరెక్టర్. ప్రముఖ ప్రైవేటు చానల్‌లో ప్రసారం అవుతున్న పాండవర్ ఇల్లం అనే సీరియల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. పైగా వాణి రాణి, సెవ్వంది అనే టీవీ సీరియల్ లోను డైరెక్టర్‌గా ఉన్నారు. ఇతని భార్య పద్మావతి (37). వీరి సొంత ఊరు కోవై జిల్లా పొల్లార్చి. ఒకే గ్రామానికి చెందిన వీరిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. వీరికి నవీనేషు (15), సాయి ఆదర్శ (8) ఇద్దరు కుమారులు. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో నాగరత్నం కుటుంబంతో కలిసి సొంతూరు పొల్లాచ్చికి వెళ్లారు. తర్వాత ఇద్దరు కుమారులను అక్కడ వదిలిపెట్టి భార్యతో కలిసి నాగరత్నం చెన్నైకి వచ్చారు. ఇంట్లో ఉన్న నగలను తాకట్టు పెట్టి ఏదైనా వ్యాపారం చేపడతామని నాగరత్నంతో భార్య పద్మావతి చెప్పింది. ఈ విషయంగా దంపతుల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి టీవీ సీరియల్ షూటింగ్‌కు వెళ్లి నాగరత్నం గురువారం తెల్లవారుజామున ఇంటికి వచ్చారు. ఆ సమయంలో భార్య భర్త మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కుమారులు గురువారం ఉదయం పొల్లాచ్చి నుంచి చెన్నైకి తిరిగి వచ్చారు. వారిని తీసుకొచ్చేందుకు నాగరత్నం కోయంబేడు బస్‌స్టేషన్‌కు వెళ్లాడు. కుమారులను తీసుకొని ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో గదిలో పద్మావతి ఉరి వేసుకొని వేలాడుతుండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. వెంటనే ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ డాక్టర్లు పరీక్షించి ఆమె అప్పటికే మృతిచెందిన్నట్లు తెలిపారు. విషయం తెలిసి వలసరవాక్కం పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ వేదికపై ప్రియుడు అరెస్ట్

అన్నానగర్: బన్‌రూటి సమీపంలో ప్రేమించి మోసపోయిన యువతి గురువారం ధర్నాకు దిగగా, మరో పెళ్లి చేసుకోబోతున్న ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా బన్‌రూటి సమీపంలోని ఎల్లెంపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం (31) మెకానిక్. ఇతను అదే పట్టణానికి చెందిన పట్టభద్రురాలు అయిన యువతి (29) పదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ స్థితిలో యువతి గర్భం దాల్చింది. తనను పెళ్లి చేసుకోవాలని సుబ్రమణ్యన్‌పై ఒత్తిడి తెచ్చింది. దీనికి సుబ్రమణ్యం అంగీకరించలేదు. ఈ స్థితిలో కొన్ని రోజుల క్రితం సుబ్రమణ్యంకు, అతని బంధువుతో నిశ్చితార్థం జరిగినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న యువతి బన్‌రూటి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కడలూరు పాతిరికుప్పంలోని ఓ ఆలయంలో పెళ్లికి సన్నాహాలు జరిగాయి. ఈ విషయం తెలిసి బాధిత యువతి సుబ్రమణ్యం ఇంటికి వెళ్లి బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ధర్నా చేసింది. సమాచారమందుకున్న మహిళా పోలీసులు సుబ్రమణ్యాన్ని కల్యాణమండపంలో అరెస్టు చేసి విచారిస్తున్నారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

తిరువళ్లూరు: వరకట్నం తేవాలని మహిళను వేధించిన వ్యవహారంలో కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న భర్త కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా మనవాలనగర్‌లోని కపిలన్‌నగర్‌కు చెందిన పవిత్ర(23)ను అదే ప్రాంతానికి చెందిన లోకనాథన్ కుమారుడు జీవానందం(25) 2021లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం పవిత్ర ఐదు నెలల గర్భిణి. అయితే పవిత్రను వరకట్నం తేవాలని తరచూ భర్త వేధింపులకు గురి చేసేవాడు. ఇదే విషయంపై ఈ నెల 20న భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. వరకట్నం తేకుంటే ఇంటికి రావద్దని గెంటేసినట్లు తెలిసింది. దీంతో పవిత్ర పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం పవిత్రకు ఫోన్ చేసిన భర్త కట్నంతో రాకుంటే హత్య చేస్తానని బెదిరించడంతో మనవాలనగర్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్‌కాల్ రికార్డింగ్ ఆధారంగా విచారణ చేపట్టారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

తిరువొత్తియూరు: కోవై జిల్లా వెల్లూరులో ప్రైవేటు కళాశాల అధ్యాపకురాలి వద్ద నగలను అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్‌జీఆర్ నగర్‌కు చెందిన వాసు భార్య జయ గౌరి (44) ప్రైవేటు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి నడిచి వెళుతున్నారు. ఆమెను వెంబడించిన యువకుడు హఠాత్తుగా ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల నగను లాక్కొని పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అతన్ని పట్టుకున్నారు. బేత్తనూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విచారణలో అతను తేని జిల్లా బోడినాయకనూర్‌కు చెందిన కారు డ్రైవర్ అరుణ్ కుమారు (25) అని తెలిసింది. అతన్ని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

క్లుప్తంగా...

వైఎస్ భాస్కర్‌రెడ్డికి స్వల్ప అస్వస్థత

- ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా చంచల్‌గూడ సెంట్రల్ జైల్లో ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురవడంతో జైలు అధికారులు ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. భాస్కర్‌రెడ్డికి బీపీ లెవల్స్ తగ్గడంతో జైలు అధికారులు ఆయనను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి జైలుకు తరలించారు. భాస్కర్‌రెడ్డికి హృదయ సంబంధ సమస్యలు ఉన్నట్టు గుర్తించిన డాక్టర్లు ఆయనకు యాంజియోగ్రామ్ చేయించాలని సూచించినట్లు తెలిసింది. వైద్యుల సూచన మేరకు భాస్కర్‌రెడ్డిని శనివారం ఉదయం నిమ్స్‌కు తీసుకెళ్లి యాంజియోగ్రామ్ చేయించనున్నట్లు సమాచారం.

ఎర్ర గంగిరెడ్డికి హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

- తదుపరి విచారణ జూలై 14కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఎర్ర గంగిరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లోని ''రూ.లక్ష పర్సనల్ బాండ్, ఇద్దరు పూచీకత్తుపై జూలై 1న ఎర్ర గంగిరెడ్డిని విడుదల చేయాలని కోర్టు ఆఫ్ ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఫర్ సీబీఐ కేసెస్, హైదరాబాద్‌ను ఆదేశిస్తున్నాం'' అనే అంశంపై తదుపరి విచారణ వరకూ స్టే విధిస్తున్నట్లు వివరించింది. తదుపరి విచారణను జూలై 14కు వాయిదా వేసింది.

జగన్ పాత్ర ఉందని ప్రచారం చేయండి

- వివేకా కేసులో సీబీఐ చెప్పిన అంశాలను మీడియాలో విస్తృతంగా చెప్పాలి
- పొలిట్‌బ్యూరో సమావేశంలో నేతలకు చంద్రబాబు సూచనలు

రాజమహేంద్రవరం నుంచి సాక్షి ప్రతినిధి : వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌కు పాత్ర ఉందనే విషయాన్ని బాగా ప్రచారం చేయాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. పొలిట్‌బ్యూరో సమావేశంలో ఆయన దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. హైకోర్టులో సీబీఐ చెప్పిన అంశాలను మీడియాలో విస్తృతంగా చెప్పాలని, దీనివల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్‌ను దెబ్బతీయ్యొచ్చని సూచించారు. వివేకా మరణం జగన్‌కు ముందే తెలుసని అజేయ కల్లం వంటి వారు కూడా చెప్పారనే విషయాలను పదేపదే చెప్పాలని సూచించినట్లు తెలిసింది. ఇక పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవానికి వెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలు ఎన్నుకున్న వ్యక్తే కీలకమని, ప్రధాని చేతుల మీదుగానే పార్లమెంటు ప్రారంభించడమే సముచితమని చంద్రబాబు సహా పలువురు నేతలు ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీ అసెంబ్లీని తామే ప్రారంభించిన విషయాన్ని నేతలు గుర్తుచేసుకున్నారు. ఆర్–5 జోన్‌లో ప్రభుత్వం పట్టాలిచ్చిన విషయంపై ఎవరూ పెద్దగా మాట్లాడవద్దని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది.

పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవానికి వెళ్తాం..

అనంతరం.. పొలిట్ బ్యూరో నిర్ణయాలను టీడీపీ నేతలు కాల్వ శ్రీనివాసులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి మీడియాకు వివరించారు. అవి..

- పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవానికి టీడీపీ హాజరవుతుంది.
- మహానాడులో చర్చించాల్సిన పలు తీర్మానాలకు సమావేశంలో ఆమోదించాం.
- తొలిరోజు ప్రతినిధుల సభ, రెండవ రోజు బహిరంగ సభ జరుగుతుంది.
- అలాగే, మొదటిరోజు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుంది. ఎన్నిక కమిటీ కన్వీనర్‌గా అశోక్‌గజపతిరాజు వ్యవహరిస్తారు. ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించి, సా.4 గంటలకు ఓటింగ్.. ఆ తర్వాత ఫలితాన్ని ప్రకటిస్తారు.
- ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాం. దీని గురించి కేంద్రంపై ఒత్తిడి తెస్తాం.

నేడు ఎన్టీఆర్ శత వత్సరాల జయంతి

- నందమూరి లక్ష్మీ పార్వతి

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ శత వత్సరాల జయంతి ఉత్సవాన్ని శనివారం విజయవాడలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ చైర్మన్ నందమూరి లక్ష్మీ పార్వతి తెలిపారు. ఉదయం 10 గంటలకు బెంజి సర్కిల్ సమీపంలోని వేదిక కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ అభిమానులంతా ఆహ్వానితులేనని తెలిపారు. సభలో సినీ నటుడు, ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళికి ఎన్టీఆర్ లలిత కళా అవార్డు ఇచ్చి సత్కరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకులు రామ్‌గోపాల్‌వర్మతో సహా పలువురు ప్రముఖులు వస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు ఆయన పేరుపెట్టి అత్యంత గౌరవం కలిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మెరుగుపడిన ఆరోగ్యం.. 'విశ్వభారతి' నుంచి శ్రీలక్ష్మి డిశ్చార్జి

గుండెలో రెండు రక్తనాళాలు బ్లాక్.. ● తదుపరి చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

- తల్లి వెంటే హైదరబాద్‌కు వెళ్లిన ఎంపీ అవినాశ్
- ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జి వరకు ఎల్లో మీడియా దుష్ప్రచారం
- డిశ్చార్జ్ కాగానే సీబీఐ అరెస్టు చేస్తుందని తప్పుడు కథనాలు



కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రి వద్ద పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు : ఎంపీ అవినాశ్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్యం మెరుగుపడటంతో ఆమెను విశ్వభారతి ఆస్పత్రి నుంచి శుక్రవారం ఉదయం డిశ్చార్జ్ చేశారు. తదుపరి చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. తల్లి వెంట అవినాశ్ కూడా హైదరాబాద్‌కు వెళ్లారు. ఆయనతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. ఆస్పత్రి నుంచి అవినాశ్ బయటకు రాగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు కలిసి ఆయనకు ధైర్యం చెప్పారు. మరోవైపు.. డిశ్చార్జ్ అయ్యే రోజు కూడా ఎల్లో మీడియా శుక్రవారం ఉదయం నుంచి అవినాశ్ లక్ష్యంగా తప్పుడు కథనాలే ప్రసారం చేసింది. శ్రీలక్ష్మి డిశ్చార్జ్ కాగానే సీబీఐ అధికారులు అవినాశ్‌ను అరెస్టుచేస్తారని బ్రేకింగ్‌లు, డిబేట్‌లు నిర్వహించింది. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మిపై, ఆమె బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌పై కనీస మానవత్వం లేకుండా చికిత్సపై, అవినాశ్ అరెస్టుపై ఇష్టారాజ్యంగా తప్పుడు కథనాలు ప్రసారం చేస్తూనే ఉంది. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన అవినాశ్ అక్కడ కార్యకర్తలు, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'అమ్మ ఆరోగ్యం బాగుంది. గుండెలో రక్తనాళాలు బ్లాక్ కావడంతో తదుపరి చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాం. అమ్మను పరామర్శించేందుకు వచ్చిన అందరికీ ధన్యవాదాలు. మీడియాకు ఏదైనా ఇబ్బందులు జరిగి ఉంటే మనసులో పెట్టుకోవద్దు'.. అని ఆయన చెప్పారు.

చేరిక నుంచి డిశ్చార్జ్ వరకూ తప్పుడు కథనాలే!

అనారోగ్యంతో పులివెందుల ఆస్పత్రిలో చేరిన శ్రీలక్ష్మిని చూసేందుకు ఈ నెల 19న హైదరాబాద్ నుంచి అవినాశ్ పులివెందులకు బయల్దేరారు. పుల్లూరు టోల్‌గేట్ వద్ద సీబీఐ అధికారులు ఉన్నారని, అవినాశ్‌ను అరెస్టుచేయబోతున్నారని 'పచ్చ' చానళ్లు తప్పుడు కథనాలు ప్రసారం చేశాయి. నిజానికి ఆ రోజు సీబీఐ అధికారులే రాలేదు. 20న కూడా సీబీఐ అధికారులు అరెస్టు చేయబోతున్నారని ప్రచారం చేశారు. 22న సీబీఐ అధికారులు ఎస్పీని కలిశారని.. ఇక్కడి పోలీసుల సహకారం లేకపోవడంతో మధ్యాహ్నానికి కేంద్ర బలగాలు రానున్నాయని, కాసేపట్లో కర్నూలుకు చేరుకుంటాయని, అవినాశ్ అరెస్టు తప్పదని రోజంతా ఏబీఎన్, టీవీ5లో గంటల తరబడి డిబేట్లు నడిపించారు. కానీ, కేంద్ర బలగాలు కర్నూలుకు రాలేదు. అవినాశ్ ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులూ 'ఈరోజు అరెస్టు తప్పదు' అనే కోణంలోనే ప్రసారం చేశారు. చివరకు శ్రీలక్ష్మి శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతారని విశ్వభారతి వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. దీంతో సీబీఐ అధికారులు కర్నూలులో రహస్య ప్రాంతాల్లో ఉన్నారని, డిశ్చార్జ్ కాగానే అరెస్టుచేస్తారని కథనాలు ప్రసారం చేశారు. ఇలా వారం రోజులుగా ఎల్లో మీడియా చెప్పిన ఏ ఒక్కటి జరగలేదు. ఒక్క వార్తలోనూ వాస్తవంలేదు. దీంతో ఎల్లో మీడియా అవినాశ్ లక్ష్యంగా ఎలాంటి తప్పుడు వార్తలు రాసిందో ప్రజలకు స్పష్టమైంది.

శ్రీలక్ష్మి ఆరోగ్యంపైనా తప్పుడు వార్తలే..

పులివెందులలో శ్రీలక్ష్మి ఇంట్లో బీపీ వచ్చి పడిపోవడంతో ఉన్నత వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. మార్గమధ్యంలో ఆందోళనకరంగా ఉండటంతో కర్నూలులో విశ్వభారతి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్చారు. కార్డియాక్ ఎంజైమ్‌లో మార్పులు వచ్చాయని, ఈసీజీ తీశామని, రెండు రక్తనాళాలు కూడా బ్లాక్ అయ్యాయని డాక్టర్ హితేశ్‌రెడ్డి మీడియాకు చెప్పారు. కానీ, శ్రీలక్ష్మి ఆరోగ్యం బాగానే ఉందని, సీబీఐ నుంచి తప్పించుకునేందుకు అవినాశ్ తల్లిని పావుగా చేసుకున్నారనే కోణంలో కనీస మానవత్వం లేకుండా తప్పుడు వార్తలు ప్రసారం చేశారు. టీడీపీ వ్యక్తులు, మద్దతుదారులతో డిబేట్లు నడిపించారు. చివరకు.. ఆవిడకు బీపీ ఎక్కువై అయానోట్రోపిక్ సపోర్ట్‌తో ఉన్నారని వైద్యులు చెప్పినా తప్పుడు వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టలేదు. బుధవారం రాత్రి నుంచి శ్రీలక్ష్మి ఆరోగ్యం మెరుగవుతూ రావడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. రెండు రక్తనాళాలు బ్లాక్ కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో పచ్చ చానళ్ల ప్రసారాల్లో ఏమాత్రం నిజం లేదని అందరికీ తేటతెల్లమైంది.

బదిలీలకు 3వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సంబంధిత ఉద్యోగుల బదిలీలకు సంబంధించి జూన్ 3వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనుంది. సోమవారం నుంచి ఉద్యోగులు ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ బదిలీ దరఖాస్తుల నమోదుకు వీలు కల్పిస్తారు. ఈ మేరకు శాఖ డైరెక్టర్ లక్ష్మీశ శుక్రవారం శాఖ అధికారులతో సమావేశమై బదిలీల ప్రక్రియ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. సచివాలయాల ఉద్యోగులు ప్రస్తుతం రోజు వారీ హాజరును నమోదు చేసే హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లోనే బదిలీల దరఖాస్తుల నమోదుకు ప్రత్యేక లింకును అందుబాటులో ఉంచనున్నారు. ఆన్‌లైన్‌లో బదిలీల దరఖాస్తు నమోదు సమయంలో వారి దరఖాస్తుకు అవసరమైన ధృవీకరణ పత్రాలపై సొంత ధృవీకరణతో కూడిన సంతకాలు చేసి, వాటిని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఉద్యోగుల బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మొదలయ్యే సమయానికి ముందే జిల్లాల వారీగా, ఉద్యోగ కేటగిరీల వారీగా ఖాళీల వివరాలను వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

బదిలీల ప్రక్రియ షెడ్యూల్ (జిల్లా పరిధిలో) ఇలా..

- జిల్లాల్లో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఖాళీల వివరాల నమోదు తేదీ : మే 28
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఆఖరు తేదీ : జూన్ 3
- ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తుల పరిశీలనకు చివరి తేదీ : జూన్ 6
- వెబ్ ర్యాంకు లిస్టుతో పాటు బదిలీలో ఉద్యోగికి కేటాయించిన మండలం లేదా పట్టణం వివరాలు తెలిపే తేది : జూన్ 6
- తిరస్కరించిన దరఖాస్తులు, తిరస్కరణ కారణంతో కూడిన జాబితా వెల్లడి : జూన్ 6
- బదిలీ అయిన ఉద్యోగులకు కేటాయించిన మండలం లేదా పట్టణంలో వ్యక్తిగత కౌన్సెలింగ్ తేదీలు : జూన్ 8, 9, 10
- బదిలీలో కొత్తగా కేటాయించిన సచివాలయ వివరాలతో బదిలీ సర్టిఫికెట్ల జారీ తేది : జూన్ 8, 9, 10
- బదిలీలకు సంబంధించి కలెక్టర్లకు అభ్యంతరాలు తెలిపేందుకు చివరి తేదీ : జూన్ 10

వేరే జిల్లాకు బదిలీ కోరుకునే వారి కోసం..

- జిల్లాల్లో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఖాళీల వివరాలు నమోదు తేది : మే 28
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు ఆఖరు తేది : జూన్ 3
- వేరే జిల్లాకు బదిలీకి వీలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసే తేది : జూన్ 8 (ఆ ఉత్తర్వులోనే బదిలీ చేసే మండలం లేదా పట్టణం వివరాలు నమోదు)
- బదిలీ అయ్యాక ఉద్యోగులకు వ్యక్తిగత కౌన్సెలింగ్ తేదీ : జూన్ 8, 9, 10
- కొత్తగా కేటాయించిన సచివాలయం వివరాలతో బదిలీ సర్టిఫికెట్లు జారీ తేదీ : జూన్ 8, 9, 10
- బదిలీలకు సంబంధించి కలెక్టర్లకు అభ్యంతరాలు తెలిపేందుకు చివర తేది : జూన్ 10

వైఎస్ అవినాశ్‌ను సీబీఐ వేధిస్తోంది

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

కర్నూలు (సెంట్రల్): వైఎస్ వివేకాని ఆస్తి కోసమే హత్య చేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చెప్పారు. ఆస్తి ఎవరికి వచ్చిందో వారే హత్య చేసి ఉండవచ్చన్నారు. శుక్రవారం ఆయన కర్నూలులోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్యతో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, తల్లి అనారోగ్యం పాలైతే కర్నూలుకు వచ్చి ఆసుపత్రిలో చూపిస్తే విచారణ పేరుతో సీబీఐ వేధించడం తగదన్నారు. ఆయన ముందుగానే తల్లి ఆరోగ్యం విషయాన్ని సీబీఐ అధికారులకు వివరించినా విచారణ పేరుతో సీబీఐ అధికారులు కర్నూలుకు రావడం అన్యాయమన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తన కోపాన్ని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన చంద్రబాబు, మోదీలపై చూపించాలని పాల్ హితవు పలికారు. పవన్‌కు నిజంగా సిగ్గు, శరం ఉంటే పొత్తుల కోసం బీజేపీ, టీడీపీ పార్టీలను విడిచిపెట్టి రావాలన్నారు. ప్రజా శాంతి పార్టీతో పొత్తు పెట్టుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. రాయలసీమను చంద్రబాబు నాశనం చేశారని కేఏపాల్ ఆరోపించారు. రాయలసీమను సింగపూర్ చేస్తానని, ఇక్కడ వనరులను దోచుకుని వెళ్లారని మండిపడ్డారు.

ఎల్లో మీడియా స్క్రిప్ట్ ప్రకారమే సీబీఐ దర్యాప్తు

- అఫిడవిట్‌లో సీఎం పేరును ప్రస్తావించడం వెనుక పెద్ద కుట్ర
- పక్కా ప్లాన్ ప్రకారమే విష్రప్రచారం
- దీని వెనుక ఎవరున్నారో ముందు తేల్చాలి
- దిగజారిన రాజకీయ పార్టీలా దర్యాప్తు సంస్థ తీరు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డిని, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌ను టార్గెట్ చేసుకుంటూ ఒక పక్కా ప్రణాళిక ప్రకారం ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎల్లో మీడియా స్క్రిప్టు ప్రకారమే సీబీఐ దర్యాప్తు చేస్తోందని మండిపడ్డారు. ఒక స్క్రిప్టు రాసుకుని.. దాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం ప్రజలందరూ చూస్తున్నారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం సంచలనం కోసమే చవకబారు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సీబీఐ ఏం చేయాలనుకుంటుందో ఎల్లో మీడియాకు ముందే తెలుస్తోంది. ఎల్లో మీడియా స్క్రిప్టు తయారు చేస్తుంటే.. దాన్ని సీబీఐ మెన్షన్ చేస్తోంది. దర్యాప్తు సంస్థ ఏదైనా మెన్షన్ చేస్తే దానికి ఆధారాలు చూపిస్తుంది. కానీ, ఇక్కడ అదేమీ జరగలేదు. ముందే అనుకుని అవినాశ్‌రెడ్డి అరెస్టుకు ఏం కావాలో ఎల్లో మీడియా రాస్తోంది. సీబీఐ ఆ అంశాలను ప్రస్తావించగానే మేం ముందుగానే చెప్పాం కదా అంటున్నారు. ఇదంతా ఒక పక్కా ప్రణాళిక ప్రకారం సాగుతోంది. సీబీఐ కౌంటర్ వేయకముందే దానిలో పొందుపరిచే అంశాలను ముందుగా ఎల్లో మీడియా ప్రచారం చేస్తోంది. సీబీఐలో అత్యంత, అన్యాయమైన తీరు కనిపిస్తోంది. హఠాత్తుగా సీఎం జగన్ పేరును ప్రస్తావించడమే దీనికి నిదర్శనం' అంటూ సజ్జల నిప్పులు చెరిగారు.

సునీతకు, వీళ్ల మధ్య ఏముందో బయటపెట్టాలి..

'సీబీఐ కౌంటర్ అఫిడవిట్ విషయం తెలియగానే టీడీపీ పొలిట్ బ్యూరోలో చర్చించడం, ఆరోపణలు చేయడం పక్కా ప్లాన్ ప్రకారం చేస్తున్నట్టే అర్థమవుతోంది. టీడీపీ మహానాడు జరుగుతున్న సమయంలోనే సీబీఐ సీఎం పేరు ప్రస్తావించడం అనుమానాలకు తావిస్తోంది. వివేకా హత్య కేసులో పెద్ద కుట్ర జరుగుతోంది.. అసలు దాని వెనుక ఎవరున్నారో ముందు తేల్చాలి. ఈ కుట్రలో చంద్రబాబు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు రామోజీరావు, టీవీ5 నాయుడు పాత్రను తేల్చాలి. సునీత, వీళ్లకు మధ్య ఏముందనేది బయటపెట్టాలి' అని సజ్జల డిమాండ్ చేశారు.

షమీమ్ స్టేట్‌మెంట్‌ను పట్టించుకోరా?

'వివేకా కుటుంబంలో ఆస్తి వివాదాలు ఉన్నాయని ఆయన రెండో భార్య షమీమ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సీబీఐ ఎందుకు పట్టించుకోవడం లేదు? పరమేశ్వరరెడ్డి అనే వ్యక్తి ఆస్పత్రిలో ఉండి.. మధ్యలో టీడీపీ నేత బీటెక్ రవిని కలిసి వస్తాడు. వీటన్నింటినీ సీబీఐ ఎందుకు విడిచిపెడుతోంది. దిగజారిపోయిన రాజకీయ పార్టీ మాదిరిగా వ్యవహరిస్తోంది' అని సజ్జల దుయ్యబట్టారు.

పూటకో పార్టీతో చంద్రబాబు జట్టు

- గతంలో బీజేపీతోనూ పొత్తులు పెట్టుకున్నారు
- ఆ తర్వాత వామపక్షాలతోనూ కలిశారు
- బాబు ఎప్పుడు ఏ పార్టీతో కలుస్తారో చెప్పలేం
- బీజేపీతో పొత్తు పెట్టుకునే పార్టీలతో కలవం
- రూ.2 వేల నోటు రద్దు వెనుక బీజేపీ రాజకీయ ప్రయోజనాలు
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి



సాక్షి, అమరావతి: చంద్రబాబు ఉదయం ఓ పార్టీతో.. సాయంత్రం మరో పార్టీతో ఉంటారని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఎద్దేవా చేశారు. ఆయన ఎప్పుడు ఏ పార్టీతో కలుస్తారో తెలియదన్నారు. అప్పట్లో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు తమతో ఉదయం సమావేశం నిర్వహించి.. సాయంత్రానికి వాజ్‌పేయ్‌ని కలిసి పొత్తు గురించి మాట్లాడుకున్నారని గుర్తు చేశారు. గతంలో బీజేపీతోనూ, ఆ తర్వాత ఎన్నికల్లో మళ్లీ వామపక్షాలతోనూ చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారన్నారు. అందువల్ల చంద్రబాబు ఇప్పుడు ఎవరితో ఉంటారో చెప్పడం కష్టమని తెలిపారు. అందుకే బీజేపీతో ఆయన పొత్తు పెట్టుకుంటారో, లేదో కచ్చితమైన బ్లూప్రింట్ ఎవరి దగ్గర ఉండదన్నారు. జాతీయ స్థాయిలో ఒక విధానంతో పనిచేసే సీపీఎం ఎన్నికల సమయంలో రాష్ట్రాల్లో ఉన్న స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పొత్తులు పెట్టుకుందని గుర్తు చేశారు. విజయవాడలో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం ఏచూరి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబీ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. బీజేపీ దేశానికి హానికరమని.. బీజేపీతో జట్టు కట్టే పార్టీలతో పొత్తు పెట్టుకోకూడదన్నది తమ పార్టీ విధానమని ఏచూరి తెలిపారు. కాగా కొత్త పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతితో ప్రారంభింపజేయాలని సూచించారు. రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్‌కు రాష్ట్రపతి అధిపతి అని స్పష్టంగా ఉందని చెప్పారు. ప్రధాని అధికారపక్షానికి మాత్రమే ప్రతినిధి అనే విషయం మరిచిపోతున్నారన్నారు. ప్రధాని ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ప్రధాని ప్రారంభిస్తుండటం వల్లే 19 పార్టీలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాయన్నారు. హిందూత్వ పేరుతో దేశ చరిత్రను, సిలబస్‌ను చెరిపేసి తమకు అనుకూలమైన కొత్త చరిత్రను సృష్టించుకునేందుకే మతతత్వ బీజేపీ రాజదండం నాటకాన్ని తెరమీదకు తెచ్చిందని ఆరోపించారు.

నోట్ల రద్దు తుగ్లక్ చర్య

గతంలో నోట్ల రద్దు, ఇప్పుడు రూ.2 వేల నోటు రద్దు వెనుక బీజేపీ ప్రయోజనాలు ఉన్నాయని సీతారాం ఏచూరి ఆరోపించారు. కొన్ని రాష్ట్రాల్లో రానున్న ఎన్నికల నేపథ్యంలో అక్కడి పార్టీలను దెబ్బతీసేందుకే పథకం ప్రకారం రూ.2 వేల నోటు రద్దు చేశారని విమర్శించారు. నోట్ల రద్దు తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. దీనివల్ల సాధించేదేమీ లేదన్నారు.

ఈసారి స్పెషల్.. ముందస్తు మేనిఫెస్టో

ప్రజల్ని మాయ చేయడమే లక్ష్యంగా ఎన్నికలలోపు మరో రెండు మేనిఫెస్టోలు ● రాజమండ్రిలో నేటి నుంచి రెండ్రోజులు మహానాడు

- ప్రజలను నమ్మించేందుకు ట్రైలర్‌గా చంద్రబాబు ముందస్తు మేనిఫెస్టో విడుదల
- ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయనకు భారతరత్న ఇవ్వాలని మరోసారి తీర్మానం
- మొత్తం 15 తీర్మానాలకు నిర్ణయం
- మహానాడు కోసం పాదయాత్రకు లోకేశ్ మూడోసారి విరామం

రాజమహేంద్రవరం నుంచి సాక్షి ప్రతినిధి : ప్రజలను మభ్యపెట్టేందుకు లెక్కలేనన్ని హామీలతో మేనిఫెస్టో ప్రకటించి ఆ తర్వాత వాటిని అమలుచేయలేక దాన్ని ఎవరికీ కనపడకుండా చేసిన చంద్రబాబు మళ్లీ అలాంటి మరో మేనిఫెస్టోతో ప్రజల ముందుకొస్తున్నారు. ఈసారి ఎన్నికలకు చాలా ముందుగానే ఆయన ముందస్తు మేనిఫెస్టోను ప్రకటించనున్నారు. ఇందుకు తెలుగుదేశం పార్టీ మహానాడును ఆయన వేదికగా చేసుకోబోతున్నారు. రాజమండ్రిలో శనివారం నుంచి రెండ్రోజులపాటు జరగనున్న మహానాడులో ఆయన తొలి మేనిఫెస్టోను విడుదల చేస్తారని టీడీపీ నేతలు ఇప్పటికే ప్రకటించారు. అంటే ఎన్నికలకు వెళ్లేలోపు మరో 2, 3 మేనిఫెస్టోలను ప్రకటించడం ఖాయమైంది. సినిమా విడుదలకు చాలారోజుల ముందే ప్రేక్షకులను ఆకర్షించేందుకు టీజర్, ట్రయలర్లు విడుదల చేసినట్లే ప్రజలను మభ్యపెట్టేందుకు ఈ మహానాడులో తొలి మేనిఫెస్టోను చంద్రబాబు విడుదల చేయనున్నారు. అలాగే, ఎన్టీఆర్‌కు భారతరత్న రాకుండా తాను అడ్డుపడిన విషయం ఎవరికీ తెలియదనుకుంటూ.. ఆ విషయం మరుగున పరిచేలా ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ మహానాడులోనూ మరోసారి తీర్మానం చేయనున్నారు. ప్రజలను మాయచేసే వ్యూహంలో భాగంగా ముందస్తు మేనిఫెస్టో ప్రకటన.. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల పేరుతో టీడీపీ నేతలు, శ్రేణుల్లో ఉన్న ఆందోళనను పోగొట్టడమే లక్ష్యంగా రాజమండ్రి మహానాడును అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

'ముందస్తు మేనిఫెస్టో'లోని అంశాలు..

ఈ మేనిఫెస్టో ద్వారా యువత, మహిళలను ఆకర్షించాలని చంద్రబాబు చూస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయడం.. పేదలపై భారంలేని వ్యవస్థలు తీసుకురావడం.. యుద్ధప్రాతిపదికన పోలవరం, ఇతర సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడం.. రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి నీరు అందించడం.. మహిళలను అన్ని రకాలుగా ఆదుకోవడం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం వంటి పలు అంశాలు ఈ మేనిఫెస్టోలో ఉంటాయని చెబుతున్నారు. రాజధానిపైనా చంద్రబాబు ఈ మహానాడులో ఒక ప్రకటన చేస్తారంటున్నారు. ఈ అంశంపై నెలకొన్న సందిగ్ధాన్ని తొలగించి దేశంలోని మహా నగరాల జాబితాలోకి అమరావతిని తీసుకొస్తామని, నిలిచిపోయిన రాజధాని పనులన్నింటినీ శరవేగంగా పూర్తిచేస్తామని చంద్రబాబు ప్రకటిస్తారని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలోని రహదారులన్నింటినీ నిర్మిస్తామని.. హౌసింగ్ ఫర్ ఆల్ పేరుతో అందరికీ ఇళ్లు ఇస్తామని ప్రకటించే అవకాశం ఉందని కూడా చెబుతున్నారు. అలాగే, వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిపక్షాలు, తమ పార్టీ నేతలపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని, వాటిపై న్యాయవిచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ప్రకటిస్తారని తెలుస్తోంది.



పొలిట్ బ్యూరో సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు

మొత్తం 25 తీర్మానాలు..

ఇక ఈ మహానాడులో మొత్తం 25 తీర్మానాలు చేయాలని నిర్ణయించారు. అందులో ఏపీకి సంబంధించి 14 తీర్మానాలు, తెలంగాణకు ఆరు, నాలుగు కామన్ తీర్మానాలు.. చివరిగా తమ పార్టీ విధానాన్ని తెలిపే రాజకీయ తీర్మానం చేయనున్నారు. రెండు, మూడు మినహా మిగిలిన తీర్మానాలన్నీ చంద్రబాబు గొప్పలు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దుమ్మెత్తి పోసే తీర్మానాలే. విధ్వంస పాలనకు చరమగీతం పాడాలి, సైకో పాలనకు ముగింపు, చంద్రన్న పాలనకు స్వాగతం అంటూ పలు రకాల తీర్మానాలు తయారుచేశారు. ప్రతి తీర్మానంలో చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తే,, వైఎస్సార్‌సీపీ హయాంలో వెనుకబడిపోయిందని, ఇందుకు జగనే కారణమంటూ రకరకాల ఆరోపణలు, విమర్శలు, అభూత కల్పనలతో తీర్మానాల కమిటీ ఈ తీర్మానాలు రూపొందించింది. వీటిల్లోనే చంద్రబాబు తనయుడు లోకేశ్‌కి సంబంధించి ఒక ప్రత్యేక తీర్మానాన్ని తయారుచేయడం విశేషం. యువగళం పాదయాత్రతో టీడీపీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్న ఆయన్ను అభినందిస్తూ ఒక తీర్మానాన్ని చేయనున్నారు. కామన్ తీర్మానాల్లో ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయనున్నారు.

మహానాడుకి ఎల్లో హైప్!

ఈ మహానాడు ద్వారా టీడీపీ నేతలు, శ్రేణుల్ని ఎన్నికలకు సమాయత్తం చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. పార్టీ కేడర్, నాయకులను కాపాడుకోవడం కోసం రెండేళ్ల ముందు నుంచే ముందస్తు ఎన్నికలు వస్తాయని జపం చేస్తున్న ఆయన ఈ మహానాడులోనూ అదే విషయాన్ని చెప్పి పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలోనే ఉండేలా చూసేందుకు కసరత్తు చేస్తున్నారు. అందుకే మహానాడుకు బాగా హైప్ తీసుకొచ్చేందుకు ఎల్లో మీడియా, తన సోషల్ మీడియా ద్వారా వ్యూహ రచన చేశారు. ఇందుకు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను కూడా ఆయన ఉపయోగించుకుంటున్నారు. ఎన్టీఆర్ పేరు చెబితే నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం వస్తుంది కాబట్టి ఆయన్ను గుర్తు చేసుకునేలా పలు కార్యక్రమాలను రూపొందించారు. అలాగే, పనిలో పనిగా తన కుమారుడు లోకేశ్‌ను కూడా ఈ మహానాడులో ఆకాశానికి ఎత్తి ఆయనపై ఉన్న పప్పు ముద్రను కొంతైనా చెరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసమే లోకేశ్ తన పాదయాత్రకు ముచ్చటగా మూడోసారి విరామం ప్రకటించి మహానాడులో పాల్గొంటున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం) : మహా నాడు దృష్ట్యా ఈనెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో వివిధ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్‌ను జిల్లా ఎస్పీ సీహెచ్. సుధీర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు.

- ఏలూరు జిల్లా గుండుగొలను, భీమడోలు, తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు కొవ్వూరు, గామన్ బ్రిడ్జి మీదుగా.. కోనసీమ జిల్లా నుంచి జొన్నాడ మీదుగా వచ్చే వాహనాలు కాకినాడ, కత్తిపూడి, విశాఖపట్నం హైవే మీదుగా వెళ్లాలి.
- కత్తిపూడి, కాకినాడ నుంచి వచ్చే వాహనాలు పిఠాపురం, కాకినాడ, రామచంద్రపురం, మండపేట, జొన్నాడ, రావులపాలెం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా వెళ్లాలి.
- పెరవలి నుంచి వచ్చే వాహనాలు సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, కొవ్వూరు, గామన్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలి.
- విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు జీరో పాయింట్ (దివాన్‌చెరువు గామన్ ఇండియా బ్రిడ్జి) నుంచి వెళ్లాలి.
- నగరం నుంచి వెళ్లే వాహనాలు ఐఎల్‌టీడీ, ప్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా బొమ్మూరు నుంచి వెళ్లాలి.
- వేమగిరి నుంచి వెళ్లే వాహనాలు ధవళేశ్వరం, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఎన్‌హెచ్–5 మీదుగా వెళ్లాలి.
- క్వారీ, లాలాచెరువు నుంచి వెళ్లే వాహనాలు డీటీసీ సెంటర్, మోరంపూడి, బొమ్మూరు, రాజవోలు రోడ్డు, కేశవరం, ద్వారపూడి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శనివారం ॥ 27-5-2023

పరిశోధన



ప్రతీకాత్మక చిత్రం

స్పెషల్ పిల్లలకు టీనేజ్ గైడ్

'ఇంటెలెక్చువల్ డిజేబిలిటి'.. అంటే బుద్ధిమాంద్యంతో ఉంటే పిల్లల పెంపకం, విద్యాబోధన సవాల్ అయితే టీనేజ్‌లో వారి లైంగిక ప్రవర్తనలను సరిచేయడం ఇంకా పెద్ద సవాలు. ఈ విషయంలో తల్లిదండ్రులు, టీచర్లకు విలువైన చేయూతగా మాన్యువల్ తయారు చేశారు తాడేపల్లిగూడేనికి చెందిన స్పెషల్ టీచర్ సాయి స్వరూప. బుద్ధిమాంద్య పిల్లలపై లైంగిక దుర్మార్గాలు జరక్కుండా కూడా ఈ మాన్యువల్ దిక్సూచిలా ఉంటుందంటున్నారు ఆమె.



స్వరూప రాసిన మాన్యువల్

'ముందు ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ అంటే ఏమిటో తెలుసుకుని అలాంటి పిల్లలను గుర్తించగలిగితే ఆ తర్వాత వారికోసం ఏం జాగ్రత్తలు తీసుకోవాలో గ్రహించ వచ్చు' అంటారు ఎన్.వి.సాయి స్వరూప.

ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం సమీపంలోని పెంటపాడు 'గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ పాఠశాల'లో స్పెషల్ టీచర్‌గా పని చేస్తున్న సాయి స్వరూప బుద్ధి మాంద్యం ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఏళ్లపాటు పరి శోధించి 'సెక్సువాలిటీ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ట్రయినింగ్ ఫర్ చిల్డ్రన్ అండ్ ఇంటెలెక్చువల్ డిజేబిలిటీస్' పేరుతో మాన్యువల్ తెచ్చారు. దీనిని క్లుప్తంగా 'సీట్' అనొచ్చు. ఇలాంటి మాన్యువల్ తయారు చేసిన తొలి తెలుగు మహిళ స్వరూపే కావచ్చు.

'మా స్కూల్లో 600 మంది విద్యార్థులు ఉంటారు. ప్రతి విద్యా సంవత్సరంలో స్కూల్ మొత్తానికి కలిపి నలభై మందన్నా ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ ఉన్న విద్యా ర్థులు ఉంటారు. అంటే ఇలా ప్రతి ఊళ్లో ఎంత మంది ఉంటారో ఊహించుకోవచ్చు. వీరికోసం విస్తృత కార్యక్ర మాలు జరగాల్సిన అవసరం ఉంది' అంటారామె.

ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ

ఏ పిల్లల్లో అయితే 'నేర్చుకోవడం' సమస్యగా ఉంటుందో వారు, ఏ పిల్లల్లో అయితే 'సొంతంగా తమ పనులు చేసుకోవడం కష్టం'గా ఉంటుందో వారు ఇంటె లెక్చువల్ డిజేబిలిటీ ఉన్న పిల్లల కిందికి వస్తారు. భాష చదవలేక, రాయలేకపోవడం, లెక్కలు చేయలేకపోవడం, జ్ఞాపకశక్తి లేమి, కమ్యూనికేషన్ స్కిల్స్ లేమి, స్నేహాలు చేయలేకపోవడం, దైనందిన పనులు– శారీరక శుభ్రత స్వయంగా చేసుకోలేకపోవడం, డబ్బు నిర్వహణ రాకపో వడం... వీటిలో ఏ లక్షణం పిల్లల్లో కనిపించినా వారు ఇంటెలెక్చువల్ డిజేబుల్‌గా భావించాలి. ఆటిజమ్, సెరి బ్రల్ పాల్సీ, ఏడిహెచ్‌డి (అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టి విటీ డిజార్డర్) తదితర సమస్యలు ఉన్న పిల్లల్ని ఈ తరహా స్పెషల్ పిల్లలుగా చెప్పవచ్చు.



స్వరూప

అక్క కుమారుణ్ణి చూసి...

'మా సొంత అక్క కుమారుడు మైల్డ్ డౌన్ సిండ్రోమ్‌తో జన్మించాడు. ఆ అబ్బాయిని దగ్గరగా చూసినప్పుడు అతడి ప్రవర్తన సరిచేయడానికి మా దగ్గర ఎలాంటి మార్గదర్శకాలూ లేవనిపించింది. అలాంటి పిల్లల మానసిక, భౌతిక, లైంగిక ప్రవర్తనలకు చేయూతనిచ్చే రంగంలో పని చేయాలని స్పెషల్ టీచర్‌గా మారాను. అందుకోసం స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఎంఈడీ చేశాను. ఇప్పుడు పీహెచ్‌డీ చేస్తున్నాను. టీనేజ్ సమయంలో స్పెషల్ పిల్లల సంరక్షణకు టీచర్ల, తల్లిదండ్రులకు ఉండాల్సిన శిక్షణ కోసమే 'సీట్' మాన్యువల్‌ని తెచ్చాను. ఈ విలువైన కృషి అందరికీ తెలియాలి' అన్నారు స్వరూప.

ముందే గుర్తించాలి

'జన్మతః బుద్ధిమాంద్యంతో పుట్టే పిల్లలను గుర్తించ డంలో తల్లిదండ్రులు ఆలస్యం చేస్తారు. ఐదేళ్ల తర్వాత వారు గుర్తించేసరికి వైద్యపరంగా అందాల్సిన సహాయం జాప్యం అవుతుంది. ఇలాంటి పిల్లలకు ఆరవ ఏట నుంచే ట్రయినింగ్ అవ సరం.

పిల్లలు, తల్లిదండ్రులు, టీచర్లు కలిసి కనీస ప్రవర్తన నేర్పించగల గాలి. స్పెషల్ పిల్లలకు ఏదీ ఒక పట్టాన అర్థం కాదు. పదే పదే చెప్పాలి. వీరు చాలా నెమ్మదిగా పని చేస్తారు. లేదా పిడుగు పడినంత వేగంగా ఆగం పుట్టిస్తారు. వీరు టీనే జ్‌కు వచ్చే సమయానికి బుద్ధి ఎలా ఉన్నా శారీరక మార్పులు కామన్‌గా ఉంటాయి. లైంగిక ప్రవర్తనలు మొదల వుతాయి. ఇందుకు అబ్బాయిలు, అమ్మా యిలు అన్న తేడా లేదు. ఇది ముందే ఊహించి సరిచేయడానికి ఆరేడు సంవత్స రాల వయసు నుంచే పునాది వేసుకుంటూ రావాలి. నా మాన్యువల్ ఈ విషయంలో పెద్ద సహాయకారి అవుతుంది' అంటారు సాయి స్వరూప.

అదుపు లేని ప్రవర్తన

'టీనేజ్‌లో వచ్చిన స్పెషల్ పిల్లలు లైంగిక తీవ్రతలతో సతమతమవుతారు. ఎదురుగా ఎవ రున్నారో చూడక బట్టలు తీసేయడం, స్పర్శ కోసం చూడటం, చాటుకు వెళ్లకుండా స్వయంతృ ప్తికి ప్రయత్నించడం చేస్తారు. ఎవరిని తాకాలో తాకకూడదో వీరికి తెలియదు. తమను ఎవరు ఏ విధంగా తాకుతున్నారో గుర్తించలేరు. తాము చేస్తున్న లైంగిక చర్య, తమపై సాగుతున్న లైంగిక చర్య వీరు గుర్తించలేరు. చాలామంది ఆడపిల్లల మీదే అకృత్యాలు జరుగుతాయనుకుంటారు. కాని మగపి ల్లలు కూడా సమాన బాధితులే. ఇలాంటి పిల్లలు తమను తాము కాపాడుకోవడం ఎలానో తర్ఫీదు ఇవ్వాలి. అందుకు ఏం చేయాలో నా పుస్తకంలో టూల్స్, మెటీరియల్స్, ఫ్లోచార్ట్స్ ద్వారా వివరించాను. ప్రస్తుతం ఇంగ్లిష్‌లో ఉన్న ఈ మాన్యువల్‌ను త్వరలో తెలుగులో తెస్తాను. అలాగే హిందీలో తెచ్చే ఆలోచన చేస్తున్నాను' అన్నారు స్వరూప.

చాలా విలువైన ఈ మాన్యువల్ ప్రతి హైస్కూ ల్‌లో, స్పెషల్ స్కూల్‌లో, ఇంటెలెక్చువల్ డిజేబుల్ పిల్లలున్న ఇంట్లో తప్పక ఉండాలి.

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అది ఆదివాసీ గ్రామం.
ఆ ఊరికి సర్పంచ్ ఓ మహిళ.
అక్కడ రాజకీయాల్లేవు.
ఉన్నదంతా జనంలో ఐకమత్యమే.
ఊరిలో అవినీతికి తావు లేదు.
అభివృద్ధికి చిరునామాగా మారింది.
ఊరంతా సస్యశ్యామలంగా ఉంది.
జీవవైవిధ్యతకు ప్రతీకగా నిలిచింది.
సర్పంచ్ ప్రతిభకు మారుపేరయింది.



• అభివృద్ధికి చిరునామా

ప్రతిభకు మారు పేరు ఆ ఊరు

తెలంగాణ, కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, మార్లవాయి గ్రామం. ఆ గ్రామ సర్పంచ్ ప్రతిభ మంగళవారం నాడు (మే, 23వ తేదీ) ఇంటర్నేషనల్ బయో డైవ ర్సిటీ డే సందర్భంగా 'తెలంగాణ స్టేట్ బయోడైవర్సిటీ' అవార్డు అందుకు న్నారు కనక ప్రతిభ. తన ప్రతిభతో గ్రామాన్ని నందనవనంగా మార్చిన ఆమె సాక్షితో పంచుకున్న విశేషాలివి.

''మహిళా రిజర్వేషన్‌లో భాగంగా మా పంచాయితీని మహిళ లకు కేటాయించారు. చదువుకున్న వాళ్లయితే బాగుంటుందని మా ఊరి వాళ్లందరూ 2019లో నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలా గని నేను ఎక్కువేమీ చదువుకో లేదు. డిగ్రీ మొదటి సంవత్స రంలో ఉండగా పెళ్లయింది. ఊరిని బాగు చేయాలనే సంకల్పం ఉంటే ఈ చదువైనా చాలు. మా ఊరి జనాభా 708, మొత్తం కుటుంబాలు 130. ప్రాథమిక పాఠశాల, ఆశ్రమ పాఠశాల కూడా ఉంది. ఇక అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ భవనం ఉన్నాయి. నేను వచ్చిన తర్వాత 26 మంది మహిళలకు చేతన ఫౌండే షన్ ద్వారా టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి, ఎస్‌బీఐ– ఆర్‌ఎ స్‌ఈటీ సహకారంతో కుట్టు మిషన్‌లు ఇప్పించాను. వాళ్లకు చేతిలో పని ఉండడానికి ఆశ్రమ పాఠశాల విద్యా ర్థుల యూనిఫామ్ కుట్టే ఏర్పాటు చేశాం. డ్వాక్రా గ్రూపులు పదకొండున్నాయి. డ్వాక్రా డబ్బుతో కొంత మంది కిరాణా దుకాణాలు పెట్టుకున్నారు.

వీధి వీధీ తెలుసు!

మా ఊరిలో ప్రతి వీధీ, ప్రతి కుటుంబమూ తెలుసు. బడి వయసు పిల్లలందరినీ బడికి పంపిం చాలని ఇంటింటికీ వెళ్లి చెబుతుంటాను. అలాగే పదేళ్లలోపు ఆడపిల్లలందరికీ 'సుకన్య సమృద్ధి యోజన' పథకం కింద బ్యాంకు ఖాతాలు తెరి పించాను. పంచాయితీలకు కేంద్ర ప్రభుత్వ సహకారం బాగుంది. వీధులన్నీ సిమెంట్ రోడ్లు వచ్చాయి. అన్ని ఇళ్లకూ టాయిలెట్‌లు న్నాయి. కిరోసిన్ దీపం వెలిగించాల్సిన అవ సరం లేదు, అన్ని ఇళ్లకూ కరెంట్ ఉంది. వందకు పైగా ఇళ్లలో దీపం పథకం గ్యాస్ సిలిండర్‌లున్నాయి. చదువుకున్న వాళ్ల కోసం చిన్నపాటి వీధి గ్రంథాలయం కూడా పెట్టాం. అలాగే హరితహారంలో భాగంగా మొక్కలు నాటాం. గ్రామంలో ఏ మూలకె ళ్లినా పచ్చదనం పరిఢవిల్లుతోంది. మంచినీటి సౌకర్యం, పరిశుభ్రతలో భాగంగా ఎప్పటికప్పుడు డ్రైనేజీ శుభ్రం చేయించడం, ప్లాస్టిక్ వాడకంలో విచక్షణ, తడిచెత్త– పొడి చెత్త పట్ల అవగాహన వంటివన్నీ జీవవైవిధ్య పురస్కారం ఎంపికకు ప్రమాణాలయ్యాయి.

- ఉత్తమ గ్రామ పంచాయితీ 2021 అక్టోబర్
- ఉత్తమ మహిళా సర్పంచ్ 2021 మార్చి 8
- జాతీయ స్థాయిలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజనలో ఉత్తమ గ్రామ పంచాయితీ
- పేదరికరహిత, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో మొదటి స్థానం
- బెస్ట్ బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ అవార్డు 2023



హైదరాబాద్‌లోని బి.ఎం. బిర్లా సైన్స్ సెంటర్, భాస్కర ఆడిటోరియమ్‌లో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్ నుంచి అవార్డు అందుకున్న ప్రతిభ

అందరూ ఇంటిపన్ను కడతారు

మా ఊరిలో అంతా క్రమశిక్షణతో నడుచుకుం టారు. అందరూ ఇంటి పన్ను కడతారు. అంతకు ముందెప్పుడో ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయి. ఎక్కువ మందికి మంచి ఇళ్లున్నాయి. కొంతమంది పెంకుటి ళ్లలో ఉంటే, ఇప్పటికీ కొంతమంది మట్టికప్పు ఇళ్ల లోనే ఉన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మాత్రం రాలేదు. మా ఊరి వాళ్ల గొప్పమనసు ఏమిటంటే... ఊరి బాగు కోసం ఏ పని చేపట్టినా అంతా కలసి వస్తారు. అందరూ ఇంకుడు గుంతలు తవ్వుకు న్నారు. జీవవైవిధ్యత నిర్వహణ, పర్యావరణ పరిర క్షణ వంటి కార్యక్రమాల్లో మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడంలో సంతోషంగా ముందుకు వస్తారు. వీధులకు రెండువైపులా రకరకాల మొక్కలు నాటాం. గిరి వికాస్ పథకం ద్వారా వ్యవ సాయానికి 30 బావులు తవ్వించాం. అంతకు ముందు ఇరవై బావులుండేవి. ఊరిలో ఎక్కువ మంది వ్యవసాయం చేస్తారు. ఒక్కొక్కరికి పదెకరాలకు తక్కువ లేకుండా భూమి ఉంది. అసలే భూమి లేని వాళ్లు కూడా ఉన్నారు. వాళ్లకు ఉపాధి హామీ పనుల కార్డు ఉంది. పొలాలకు గట్లు, చెరువు పూడిక తీయడం, పొలాల్లోకి వెళ్లడానికి మట్టిరోడ్లు వేయడం వంటి పనులు ఉపాధి హామీలో చేయిస్తాం. ఆకలి, పేదరికం మా ఊరి పొలి మేరలకు కూడా రావు. వ్యవసాయంతోపాటు ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లు పెంచు కుంటారు. ప్రతి ఒక్కరూ పని చేస్తారు. సంతోషంగా జీవిస్తారు.

మా ఊరికి సర్పంచ్‌గా నేను తొలి మహిళను. మహిళ అయిన కారణంగా నన్ను తక్కువ చేసి చూడడం మా దగ్గర ఉండదు. అంతా అభిమానంగా ఉంటారు. ఊరం దరూ ఒక మాట మీద ఉంటారు కాబట్టి నేను ఇన్ని పనులు చేయగలుగుతున్నాను'' అని గ్రామ తొలి మహిళగా తన అనుభవాలను వివరించారు ప్రతిభ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్స్

చల్లగా.. తాజాగా...

ఈ కాలం ఎండ వేడికి కమిలిపోయే చర్మానికి తిరిగి నిగారింపు రావాలంటే..

- ఎండనుంచి ఇంటికి వచ్చాక ఐస్ క్యూబ్‌తో ఎండ ప్రభావానికి లోనైన చర్మంపై మృదువుగా రబ్ చేయాలి. దీంతో చల్లగా ఉండటంతో పాటు, ట్యాన్ సమస్య బాధించదు.



- చెమట వాసన రాకుండా ఉండేందుకు డియోడరెంట్లు, పెర్‌ఫ్యూమ్‌లు ఈ కాలంలో ఎక్కువగా వాడుతుంటారు. ఇవి చర్మానికి నేరుగా స్ప్రే చేయడం వల్ల దురద పెట్టే అవకాశం ఉంది. దద్దుర్లూ రావచ్చు. అందుకని ధరించిన బట్టలపై మాత్రమే స్ప్రే చేసుకోవాలి.
- ఎన్ని నీళ్లు తాగినా ఎండతాకిడికి లోనైన చర్మం త్వరగా పొడిబారుతుంది. దీని వల్ల చర్మం ముడతలు పడే అవకాశమూ ఉంది. ఈ సమస్య తలెత్తకుండా ఉండా లంటే ఇ–విటమిన్ శాతం ఎక్కువ ఉన్న బాడీ లోషన్ లేదా మాయిశ్చరైజర్ వాడితే చర్మం పొడిబారదు.
- టీ స్పూన్ తేనె, 10–15 చుక్కల నారింజ రసం, టేబుల్ స్పూన్ ఓట్స్, టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి, చల్లబడ్డాక ముఖానికి అప్లై చేయాలి. 15 నిమిషాల తర్వాత చల్లని నీటితో శుభ్రపరచుకో వాలి. ఎండ ప్రభావం నుంచి ముఖచర్మం త్వరగా విశ్రాంతి పొందుతుంది.

మల్టీ టాలెంట్



మీరా @ బామ్మ ది గ్రేట్

అవార్డ్ విన్నింగ్ టీవీ సిరీస్ 'ది కుమార్స్ ఎట్ నెంబర్:42'లో మీరా స్యాల్ పోషించిన సుశీల అనే బామ్మ పాత్ర సూపర్ డూపర్ హిట్ అయింది. చాలామంది ప్రేక్షకులకు మీరా అంటే సుశీలమ్మే. ప్రతిష్ఠాత్మకమైన బాఫ్టా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) ఫెలోషిప్‌కు ఎంపికైన మీరా తన కార్యాచరణకు విస్తృతరూపం ఇస్తోంది. ఔత్సాహిక కళాకారులకు అండగా నిలుస్తోంది...

కమేడియన్, రైటర్, ప్లే రైటర్, సింగర్, జర్నలి స్ట్‌గా బహుముఖ ప్రజ్ఞ చాటుకుంటున్న మీరా స్యాల్ బ్రిటన్‌లోని ఆసియన్ ప్రముఖులలో ఒక రిగా పేరు తెచ్చుకుంది.

మీరా తల్లిదండ్రులు సురీందర్ కౌర్, సురీం దర్ స్యాల్ ఢిల్లీ నుంచి బ్రిటన్‌కు వలస వచ్చారు. వోల్వర్‌హాంప్టన్ నగరంలో పుట్టిన మీరాకు బాల్యం నుంచే కళలపై అమిత ఆసక్తి ఉండేది.

యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్‌లోని 'స్టీఫెన్ జోసెఫ్ స్టూడియో'లో చేరిన తరు వాత తనలోని సృజనాత్మక కళ ఊపిరిపోసుకుంది.

యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్‌లో ఎం.ఏ. డ్రామా, సైకోథెరపీ చదువు కుంది. మరో రచయితతో కలిసి రాసిన 'వన్ ఆఫ్ అజ్' నాటకానికి ఎంతో పేరు వచ్చింది. ఇంట్లోనుంచి పారిపోయి సినిమా స్టార్ అయిన యువతి పాత్రను ఈ నాటకంలో పోషించి భేష్ అనిపించుకుంది మీరా. 'నేషనల్ స్టూడెంట్ డ్రామా' అవార్డ్ అందుకుంది.

'వన్ ఆఫ్ అజ్'కు వచ్చిన అనూహ్యమైన స్పందన గమనించిన లండన్‌లోని 'రాయల్ కోర్ట్ థియేటర్' ఒక నాటకం కోసం మీరాతో మూడు సంవత్సరాల ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఇక రచయిత్రిగా 'అనితా అండ్ మీ' పుస్తకా నికి ఎంతో గుర్తింపు వచ్చింది. రచయితల తొలి పుస్తకానికి ఇచ్చే ప్రఖ్యాత 'బెట్టీ ట్రాస్క్' అవార్డ్ గెలుచుకుంది. 'అనితా అండ్ మీ' నవల సినిమాగా వచ్చింది. ఈ సినిమాకు స్క్రిప్ట్ తానే సమకూర్చింది,

ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చిన 'బాంబే డ్రీమ్స్'కు స్క్రిప్ట్ రైటర్‌గా తన ప్రత్యేకత చాటుకుంది. 1993లో ప్రముఖ బ్రిటిష్ ఫిల్మ్ డైరె క్టర్ గురీందర్ చద్దా తీసిన 'బజీ ఆన్ ది బీచ్' సిని మాకు స్క్రీన్‌ప్లే సమకూర్చింది.

'అనితా అండ్ మీ' తరువాత రాసిన 'లైఫ్ ఈజ్ నాట్ ఆల్ హా హా హీ హీ' 'ది హౌజ్ ఆఫ్ హిడెన్ మదర్స్' పుస్తకా లకు మంచి పేరు వచ్చింది.



మీరా నటప్రతిభ

ఇంటర్ నేషనల్ ఎమ్మీ అవార్డ్ విన్నింగ్ టీవీ సిరీస్ 'కుమార్స్ ఎట్ నెంబర్:42'లో మీరా పోషిం చిన 'సుశీల' అనే బామ్మ పాత్రకు ఎంతో గుర్తింపు వచ్చింది. చాలామంది ప్రేక్షకుల దృష్టిలో మీరా అంటే సుశీలే.

ఈ పాత్ర ఎంత పాపులర్ అయిందంటే 2021లో 'బీబీసి రేడియో4'లో 'గాసిప్ అండ్ గాడెసెస్' సిరీస్ కోసం సుశీలమ్మ తన అభిమాను లను మరోసారి అలరించింది.

మీరాలోని మరో టాలెంట్ గానం. పంజాబ్ గ్రామీణ ప్రాంతాలలోని జానపదాల నుంచి పాశ్చా త్యసంగీతం వరకు ఆమె గొంతు విప్పి పాడుతుంటే చుట్టుపక్కల వాళ్లు మంత్రముగ్ధులై వినాల్సిందే.

'నా బాధ్యతను మరింత పెంచింది. ప్రతిభావంతులైన ఎంతోమంది కళాకారు లతో పనిచేసే అదృష్టం లభించింది' అంటూ 'బాఫ్టా' ఫెలోషిప్‌పై స్పందించింది 61 సంవత్సరాల మీరా.

ఫెలోషిప్‌లో భాగంగా మీరా ఎన్నో టాలెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించ నుంది. 'ఆర్ట్స్ ఛారిటీ'తో కలిసి ప్రత్యక్షంగా పనిచేయనుంది.

'సినిమాలు, రంగస్థలం సాహిత్య కళలపై అద్భుతమైన ప్రభావాన్ని చూపింది మీరా. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈతరానికి స్ఫూర్తిని ఇచ్చే సృజనాత్మక శక్తి' అని ప్రశంసిస్తున్నారు 'బాఫ్టా' ప్రతినిధి జేస్ మిల్జీచిప్.

సఖి

అరటి హ్యాండ్‌బ్యాగులు!

వ్యాపారానికి పర్యావరణ స్పృహను జత చేసి ప్రయాణం మొదలుపెట్టింది 'రష్కి' కంపెనీ. బనానా బేస్డ్ లెదర్, ప్లాంట్–బేస్డ్ లెదర్ ప్రాడక్ట్స్‌తో మార్కెట్‌లో తన ప్రత్యేకతను చాటుకొని విజయం సాధించింది. 'మార్పు కోసం ప్రయత్నించడం మంచిదే!' అనే ఆశావహ దృక్పథంతో బయలుదేరిన 'రష్కి' తన ఉత్పత్తుల ద్వారా యువతరం ఆలోచనలలో మార్పు తీసుకువస్తోంది.





పర్యావరణ స్పృహ ఫ్యాషన్ డిజైన్‌లోకి కూడా వచ్చిన తరువాత కొత్త ఆవిష్కర ణలు జరుగుతున్నాయి. మన 'రూట్స్' లోకి వెళ్లి సంప్రదాయాలను పలకరిస్తు న్నాయి. 'ఆహా' అనిపిస్తున్నాయి.

శివాని పోపట్‌కు కళాశాల రోజుల నుంచి పర్యావరణ విషయాలపై అవ గాహన ఉంది. ఆ అవగాహనే పునా దిగా తనలాంటి ఆలోచనలే ఉన్న రాహుల్ జైన్, రుస్తంలతో కలిసి బెంగళూరు కేంద్రంగా 'రష్కి' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

దీనికి ముందు పర్యావరణ సంబం ధిత విషయాలు, కంఫర్టబుల్ డిజైన్ లను దృష్టిలో పెట్టుకొని ఎంతో రిసెర్చ్ చేసింది.

'ఫ్యాషన్ అనేది కేవలం సౌందర్యానికి మాత్రమే పరిమితమైనది కాదు. దానికి పర్యావరణ స్పృహ కూడా తోడు కావా లి' అని రష్కి నమ్మింది.

వినియోగదారులు ఇష్టపడే లైఫ్‌స్టైల్ బ్రాండ్స్‌లో తమది ఒకటి కావాలనే లక్ష్యంతో బయలుదేరిన 'రష్కి' తక్కువ కాలంలోనే విజయం సాధించింది.

మరిన్ని స్టార్టప్‌లకు ధైర్యాన్ని ఇచ్చింది. 'యువతరం ఫ్యాషన్‌కు మాత్రమే ప్రాధాన్యత ఇస్తుందనేది నిజం కాదు. వారి ఎంపిక (లైఫ్‌స్టైల్ ఛాయిస్) అనేది పర్యావరణంపై ఎలాంటి ప్రభా వాన్ని చూపుతుందో స్పష్టంగా వివరించగ లిగితే వారు మార్పుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఇతరులు కూడా మారేలా ప్రేరణ ఇస్తారు' అంటోంది శివాని.

తమ బ్యాగులు, యాక్సెసరీలకు ముందు 'క్రుయాల్టీ–ఫ్రీ' అనే వాక్యాన్ని చేర్చి ఎంతోమందికి దగ్గరైంది రష్కి. 'రిమూవ్ ది ట్యాగ్' క్యాంపెయిన్‌లో



శివాని

పాలుపంచుకున్న శివాని ఒక వీడి యోలో తన అభిప్రా యాన్ని ఇలా పంచు కుంది...

'మేల్ ఎంటర్‌ప్రెన్యూర్, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్, మామ్ ఎంటర్‌ప్రెన్యూర్... ఇలా ట్యాగ్‌లు ఇవ్వడంతో పాటు వారికి తమదైన నిర్వచ నాలు ఇస్తుంటారు. ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూ ర్‌లకు పరిమితులు ఉంటాయని చెప్పకనే చెబుతుంటారు. అయితే జెండర్ అనేది సామర్థ్యాన్ని నిర్ణయించే ప్రమాణం కాదు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా స్త్రీ అయినా పురుషుడు అయినా ఎదుర్కొనే స్ట్రగుల్ ఒకటే. చిన్న విజయమా, పెద్ద విజయమా అనేది కాదు... ఏ విజయమైనా ముఖ్యమే'

విశేషం ఏమిటంటే కొందరు ఇంట ర్నెట్ సెలబ్రిటీలు 'రష్కి'కి సహకారం అందించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం. 'ముందుకు వెళ్లాలనే సంకల్పం గట్టిగా ఉంటే మనల్ని ఏ శక్తీ వెనక్కి లాగ దు' అంటోంది శివాని. 'రష్కి' కంపెనీ ప్రస్తుతం పర్యావరణ హిత పాదరక్షల మార్కెట్‌పై దృష్టి పెట్టింది.

సీబీఐ చిలుక 'కొత్త పలుకు'

వివేకా హత్య కేసులో తొలగిన సీబీఐ ముసుగు

సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ ముసుగు పూర్తిగా తొలగిపోయింది. లోపల ఉన్నదంతా పచ్చ కుట్రేనని వెల్లడైంది. టీడీపీ పాడుతున్న పాత పాటనే సీబీఐ న్యాయస్థానంలో తన అఫిడవిట్‌లో శుక్రవారం వినిపించింది. సీబీఐలో కొందరు అధికారులు పదవీ విరమణ, స్థాన చలనానికి ముందు టీడీపీ ముఖ్య నేతల ప్రలోభాలకు గురై వారు చెప్పినట్టుగా అఫిడవిట్ పేరుతో కుట్రకు తెరతీసింది. వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందారని ఆయన పీఏ కృష్ణారెడ్డి అందరికంటే ముందు గుర్తించారన్నది నాలుగేళ్లుగా ముక్త కంఠంతో చెబుతున్న మాట. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నియమించిన సిట్ కూడా అదే విషయం చెప్పింది. కానీ టీడీపీ ఆరు నెలలుగా కుట్రపూరితంగా ఓ వాదనను తెరపైకి తెచ్చింది. వివేకా మృతి చెందిన విషయం ఆయన పీఏ కంటే ముందే ఎంపీ అవినాశ్ రెడ్డి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పారని దుష్ప్రచారం చేస్తోంది. సరిగ్గా అదే అసంబద్ధ ఆరోపణను సీబీఐ శుక్రవారం తన అఫిడవిట్‌లో పేర్కొనడం విస్మయ పరుస్తోంది. పైగా ఏమాత్రం సాంకేతికంగా చెల్లుబాటుగాని ఐపీడీఆర్ (ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ డీటైల్ రికార్డ్) నివేదిక అంటూ ప్రజల కళ్లకు గంతలు కట్టేందుకు యత్నించింది. ఐపీడీఆర్ నివేదిక అంటూ సీబీఐ చెప్పడమే ఆ అఫిడవిట్ పూర్తిగా కట్టు కథ అని... అభూతకల్పనలు, నిరాధార అభియోగాలేనని నిపుణులే స్పష్టం చేస్తున్నారు. 2019 మార్చి 14 రాత్రే కాదు... అంతకు 20 రోజుల ముందు 20 రోజుల తర్వాత కూడా ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ ఐపీడీఆర్ డేటా అదేరీతిలో చూపిస్తోంది. అర్ధరాత్రి వేళల్లో కూడా ఆయన ఫోన్‌కు సంబంధించి ఐపీడీఆర్ డేటా పనిచేస్తునే ఉన్నట్టుగా వెల్లడిస్తోంది. రోజూ ఎక్కువ సేపు ఫోన్ మాట్లాడేవారి ఐపీడీఆర్ డేటా అలానే చూపిస్తూ ఉంటుంది. ఎందుకంటే ఆ ఫోన్‌కు సంబంధించి బైట్స్ అప్‌లోడ్, డౌన్‌లోడ్‌లకు ఆ సమయం తీసుకుంటూ ఉంటుంది. మరి సీబీఐ ఆ ముందు 20 రోజులు, తర్వాత 20 రోజులు ఐపీడీఆర్ డేటాను ఎందుకు ప్రస్తావించ లేదు? ఎందుకంటే అది చాలా సాధారణమైన విషయం కాబట్టి ఉద్దేశపూర్వకంగా విస్మరించింది.

సునీత, నర్రెడ్డి, బీటెక్ రవిల ఐపీడీఆర్ డేటా కూడా అంతే..

ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ ఐపీడీఆర్ డేటానే కాదు.. వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, టీడీపీ నేత బీటెక్ రవి, ఆయన స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డి ఫోన్ల ఐపీడీఆర్ డేటా కూడా అలానే చూపించింది. 2019 మార్చి 14న రాత్రి కూడా వారి ఫోన్లు పని చేస్తున్నట్టుగానే ఐపీడీఆర్ వెల్లడిస్తోంది. అంటే వివేకా హత్యకు వారు కుట్ర పన్నినట్టు భావించ వచ్చు కదా. అందులోనూ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. బీటెక్ రవితో రాజకీయ విభేదాలు, ఎర్ర గంగిరెడ్డితో భూవివాదాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. వారంతా సన్నిహితులు కూడా. మరి సీబీఐ అధికారులు సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, బీటెక్ రవి, ఎర్ర గంగిరెడ్డిల ఫోన్ల ఐపీడీఆర్ డేటా గురించి ఎందుకు ప్రస్తావించ లేదు? ఆ డేటా ఆధారంగా వారే వివేకా హత్య చేయించి ఉంటారని ఎందుకు భావించడం లేదు? అంటే సీబీఐ అధికారులు ఏవో అదృశ్య శక్తుల ప్రభావానికి లోనై కేసు విచారణ కంటే ముందే ఓ నిర్ణయానికి వచ్చి ఆ దిశగానే ఎంపీ అవినాశ్‌కి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్నది స్పష్టమైంది.

ఫోన్ చేశారా.. మెసేజ్ చేశారా అన్నది కూడా నిర్ధారించలేం..

ఫోన్‌లో వాడిన మొబైల్ డేటాను బట్టి ఒక ఫోన్ నుంచి మరొకరికి ఫోన్ చేశారా? మెసేజ్ చేశారా అన్నది కూడా నిర్ధారించడం సాధ్యం కాదు. మొబైల్ డేటా ఆధారంగా ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు, ఫేస్‌బుక్ డేటాను విభజించి, విశ్లేషించే పరిజ్ఞానం 2020 వరకు లేనే లేదు. ఇప్పటికీ సాధికారికంగా లేదు. మరి సీబీఐ ఫోన్ మొబైల్ డేటాను బట్టి ఎంపీ అవినాశ్ రెడ్డి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ చేసినట్టు ఎలా నిర్ధారణకు వచ్చింది?

సీబీఐ ఫోన్ నంబర్లు ఎందుకు చెప్పలేకపోయింది?

2019 మార్చి 15 తెల్లవారు జామున ఎంపీ అవినాశ్ రెడ్డి ఏ మొబైల్ నంబర్ నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన ఏ మొబైల్ నంబర్‌కు ఫోన్ చేశారో సీబీఐ ఎందుకు వెల్లడించ లేకపోయింది? ఫోన్ చేసి ఉంటే ఆ రెండు నంబర్లు చెప్పాలి కదా? ఆ నంబర్లు చెబితే వాటి కాల్ రికార్డ్ డేటా ఎప్పటికీ అందుబాటులో ఉంటుంది. అందులో పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. దీన్ని బట్టి ఆ రోజు తెల్లవారుజామున ఎంపీ అవినాశ్.. వైఎస్ జగన్‌కు ఫోన్ చేయలేదన్న వాస్తవం వెల్లడవుతుంది. అందుకే సీబీఐ ఆ ఫోన్ నంబర్లను తన అఫిడవిట్‌లో ప్రస్తావించలేకపోయింది.

ఆధారాలు ధ్వంసం చేయాలంటే అర్ధరాత్రే చేసేవారు కదా..

వైఎస్ వివేకా హత్యా స్థలంలో సాక్ష్యాధారాలను ఉదయ్‌కుమార్ రెడ్డి ద్వారా ఎంపీ అవినాశ్ రెడ్డి 2019 మార్చి 15న ఉదయం 7.30 గంటల సమయంలో ధ్వంసం చేయించారంటూ సీబీఐ మరో నిరాధార అభియోగాలు మోపింది. వివేకా హత్య తర్వాత తెల్లవారు జామున 4గంటలకు ఉదయ్‌కుమార్ రెడ్డి.. ఎంపీ అవినాశ్‌రెడ్డిని కలిశారని సీబీఐ పేర్కొంది. ఐపీడీఆర్ డేటా ద్వారా ఆ విషయాన్ని నిర్ధారించామని చెప్పింది. పరస్పర విరుద్ధంగా ఉన్న ఈ రెండు అంశాలను పరిశీలిస్తే సీబీఐ అభియోగాలు పూర్తి అవాస్తవం అన్నది తేటతెల్లమవుతోంది. సీబీఐ చెప్పేదే నిజమైతే అప్పుడే ఆధారాలు ధ్వంసం చేయమని అవినాశ్ చెప్పేవారు కదా.. అసలు ఉదయ్‌కుమార్ రెడ్డి ఆరోజు తెల్లవారుజామున అవినాశ్‌ని కలవనే లేదు.

తీవ్రంగా పరిగణిస్తున్న వైఎస్సార్‌సీపీ

టీడీపీ కుట్రలో భాగస్వాములై కొందరు సీబీఐ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై వైఎస్సార్‌సీపీ తీవ్రంగా స్పందించింది. ఏమాత్రం హేతుబద్ధం గాని ఐపీడీఆర్ నివేదిక పేరిట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం చిమ్మేందుకు బరితెగించిన అధికారులపై.. సాంకేతికంగా ఐపీడీఆర్ హేతుబద్ధత, టెలికాం మార్గదర్శకాలు వెల్లడిస్తున్న అంశాల ఆధారంగా న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతోంది.



ఐపీడీఆర్ ఎలా పనిచేస్తుందో తెలియదా?

వివేకానందరెడ్డి హత్యకు ముందు, ఆ తర్వాత అవినాశ్ రెడ్డి ఫోన్ కాల్స్ ఉన్నాయంటూ సీబీఐ చేసిన అభియోగాలు పూర్తి అహేతుకం. ఫోన్ కాల్స్ ఉన్నాయంటూ ఐపీడీఆర్ డేటా పేరిట సీబీఐ ఏకంగా న్యాయస్థానాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించడం విస్మయ పరుస్తోంది. అసలు ఐపీడీఆర్ ఎలా పని చేస్తుందనే కనీస సాంకేతిక అవగాహన కూడా సీబీఐకి లేదా అనే సందేహం కలుగుతోంది. ఐపీడీఆర్ ఫోన్ బైట్స్‌ను నిరంతరం అప్‌లోడ్, డౌన్‌లోడ్ చేస్తూనే ఉంటుంది. ఫోన్ ఆన్‌లో ఉన్నంతసేపు మనం ఫోన్ మాట్లాడుతున్నా లేకపోయినా సరే అది బైట్స్‌ను అప్‌లోడ్, డౌన్‌లోడ్ చేసుకుంటూ ఉంటుంది. అంటే మనం మొబైల్ యాప్‌లు వాడకపోయినాసరే అవి నిరంతరం పని చేస్తునే ఉంటాయి. సర్వర్ ఆ డాటాను తీసుకుంటూనే ఉంటుంది. సాధారణంగా రాత్రి వేళల్లో సర్వర్ డాటాను తీసుకుంటూ ఉంటుంది. ఎందుకంటే ఆ సమయంలో ఫోన్లు వాడరు కాబట్టి, ఆ ఫోన్లకు సంబంధించిన బ్యాకప్ తీసుకుంటూ ఉంటుంది. రోజూ ఎక్కువ సేపు ఫోన్లు మాట్లాడేవారు, వాట్సాప్, ఫేస్‌బుక్ ఎక్కువుగా వాడేవారి ఫోన్ డాటాను అర్ధరాత్రి వేళల్లో మరింత ఎక్కువ సేపు ఐపీడీఆర్ అప్‌లోడ్, డౌన్లోడ్ చేస్తూ ఉంటుంది. అది నిరంతరం జరిగే ప్రక్రియ. కాబట్టి డాటా బర్న్ అవుతునే ఉంటుంది. ఆ సమయంలో ఐపీడీఆర్ నివేదిక తీసుకుంటే ఫోన్‌లో మొబైల్ డాటా బర్న్ అవుతున్నట్టుగానే కనిపిస్తుంది. అంత మాత్రాన ఫోన్ మాట్లాడినట్టు కాదు. కాబట్టి ఐపీడీఆర్ డాటాను బట్టి ఒక ఫోన్‌ను ఓ నిర్ణీత సమయంలో ఉపయోగించినట్టుగాని, ఆ సమయంలో వారు ఫోన్ మాట్లాడారని చెప్పడంగానీ సాధ్యం కాదు. ఇది టెలీకమ్యూనికేషన్ల ప్రొటోకాల్ వెల్లడిస్తున్న వాస్తవం. అటువంటిది ఎంపీ అవినాశ్ రెడ్డి 2019 మార్చి 14 రాత్రి వివేకా హత్యకు ముందు.. ఆ తర్వాత కూడా ఫోన్లో మాట్లాడారని ఐపీడీఆర్ డేటా ఆధారంగా సీబీఐ చెప్పడం విడ్డూరం. 2019 మార్చి 15 తెల్లవారుజామునే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడారని ఐపీడీఆర్ నివేదిక ద్వారా తెలుసుకున్నామని చెప్పడం అహేతుకం. ఇది అసంబద్ధమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఐపీడీఆర్ డేటాను బట్టి ఒకరు ఆ సమయంలో ఫోన్ మాట్లాడారని చెప్పడం సాధ్యం కాదని, కేవలం సీబీఐ దురుద్దేశ పూరితంగానే ఈ విషయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ప్రస్తావించిందన్నది స్పష్టమవుతోంది.

కమిట్మెంట్‌కు కట్టుబడి కట్టు కథ!

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభావితం చేసేందుకు టీడీపీ మొదటి నుంచీ పన్నాగం పన్నుతూనే ఉంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు, ఆయనకు వంతపాడే బీజేపీలోని టీడీపీ నేతలు, ఆ పార్టీకి కొమ్ముకాసే పచ్చ మీడియా అందులో ప్రధాన పాత్రధారులుగా మారారన్నది సుస్పష్టం. రిటైర్ అవ్వబోతున్న కొందరు సీబీఐ అధికారులను ప్రలోభాలకు గురి చేశారన్నది సర్వత్రా బహిరంగ రహస్యంగా మారింది. ఆ ప్రకారం ఎంపీ అవినాశ్ రెడ్డిని ఎలాగైనా అరెస్టు చేయించాలన్నది ఒప్పందం. అందుకోసం టీడీపీ భారీగా నిధులు వెదజల్లినట్టు సమాచారం. అందుకే సీబీఐ ఇటీవల హఠాత్తుగా దూకుడు పెంచింది. ఎంపీ అవినాశ్ రెడ్డి దర్యాప్తునకు ఎంతగా సహకరిస్తున్నాసరే ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికి ఆయన ఏడుసార్లు సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యారు. అయినా సరే ఆయన విచారణకు సహకరించడం లేదంటూ సీబీఐ అధికారులు అసంబద్ధ అభియోగాలు చేస్తూ న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. గత మూడు రోజుల్లో ఎలాగైనా సరే ఎంపీ అవినాశ్‌ను అరెస్టు చేయాలని కొందరు సీబీఐ ఉన్నతాధికారులు ప్రయత్నించారు. అందుకు తగ్గట్టుగానే టీడీపీ అనుకూల పచ్చ మీడియా చానళ్లు రోజుల తరబడి టీవీలలో చర్చలు నిర్వహిస్తూ వస్తున్నాయి. కానీ ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయలేమని ఓ ఉన్నతాధికారి గుర్తించారు. కానీ టీడీపీతో కుదుర్చుకున్న కమిట్మెంట్‌కు న్యాయం చేసేందుకు ఆయన కొత్తకుట్రకు తెరతీశారు. 'మీరు ఉండగా ఎంపీ అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయలేకపోతే... కమిట్మెంట్‌కు లోబడి మరొకటి చేయండి' అని టీడీపీ పెద్దల నుంచి ఆయనకు సందేశం అందినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే వివేకా మృతి గురించి ఎంపీ అవినాశ్ రెడ్డికి.. ఆయన ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తెలిసి ఉంటుందని సీబీఐ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఒప్పందంలో భాగంగా రాజధానిలో పేదలకు ప్రభుత్వ ఇళ్ల స్థలాల పంపిణీ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, టీడీపీ మహానాడులో ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు ఓ అంశాన్ని అందించేందుకే సీబీఐ అధికారి ఇంతటి దుర్మార్గానికి పాల్పడినట్టు స్పష్టమవుతోంది. దీనిని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా పరిగణిస్తూ న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తోంది.

అవినాశ్ ఫోన్ చేసింది 2019 మార్చి 15 ఉదయం 6.30కే..

వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందారనే విషయాన్ని చెప్పేందుకు ఎంపీ అవినాశ్ రెడ్డి 2019 మార్చి 15న ఉదయం 6.30 గంటలకే తొలిసారిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయకుడి నంబరుకు ఫోన్ చేసి చెప్పారు. ఆ కాల్ రికార్డులు ఉన్నాయి కూడా. ఆ రోజు ఉదయం 6.10 గంటలకి పీఏ కృష్ణారెడ్డి తొలిసారిగా వివేకానందరెడ్డి మరణించారన్న విషయాన్ని గుర్తించారు. ఆ వెంటనే ఆయన భార్య సౌభాగ్యమ్మ, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డిలకు ఫోన్ చేసి సమాచారం తెలిపారు. అనంతరం నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి ఉదయం 6.20 గంటల సమయంలో ఎంపీ అవినాశ్ రెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి మృతి చెందారనే విషయాన్ని చెప్పారు. వెంటనే వివేకా నివాసానికి వెళ్లిన అవినాశ్ రెడ్డి ఆయన మృతదేహాన్ని చూసి వెంటనే బయటకు వచ్చారు. ఆ తర్వాత 6.30 గంటల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయకుడి ఫోన్‌కు కాల్ చేసి వివేకా మృతి చెందిన విషయాన్ని తెలిపారు. అంటే వివేకా మృతి చెందారనే విషయం ఆయన కుటుంబ సభ్యులకు తెలిసిన తర్వాతే ఎంపీ అవినాశ్ రెడ్డికి.. ఆ తర్వాతే ఎంపీ ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసింది. ఈ విషయాన్ని పీఏ కృష్ణారెడ్డి, అవినాశ్ రెడ్డి కాల్ రికార్డులు వెల్లడిస్తున్నాయి. వాస్తవం ఇలా ఉంటే.. వివేకా మృతి చెందిన విషయం పీఏ కృష్ణారెడ్డి కంటే ముందే వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు తెలుసంటూ సీబీఐ అభూతకల్పనలు సృష్టించి దుష్ప్రచారానికి పాల్పడటం వెనుక టీడీపీ ప్రలోభాలు, కుట్ర ఉన్నాయన్నది స్పష్టమవుతోంది.

అది హత్య అని డాక్టరైన సునీతకు తొలుత తెలీదా?

స్వయంగా డాక్టర్ అయిన సునీత వివేకానందరెడ్డి మృతదేహం ఫొటోలతో న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించడం విస్మయ పరుస్తోంది. ఆమె తరఫు న్యాయవాదులు వివేకానందరెడ్డి మృతదేహం ఫొటోలను న్యాయస్థానానికి చూపిస్తూ వాటిని చూస్తే ఎవరికైనా అది హత్య అని తెలుస్తుంది కదా.. అని చెప్పుకొచ్చారు. కానీ వాస్తవం ఏమిటంటే.. వివేకానందరెడ్డి మృతదేహాన్ని ఆయన టైపిస్ట్ ఇనయతుల్లా ఫొటోలు తీశారు. ఆ ఫొటోలను పీఏ కృష్ణారెడ్డి.. సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డిలకు పంపారు. ఆ ఫొటోలు చూసిన తర్వాత కూడా వారు అది హత్య అని చెప్పనే లేదు. పైగా తాము వచ్చే వరకు వివేకా రాసిన లేఖ, ఆయన సెల్‌ఫోన్ దాచి పెట్టమని చెప్పారు. మరి డాక్టర్ అయిన సునీత తన తండ్రి మృతదేహం ఫొటోలను చూసి అది హత్యేనని వెంటనే ఎందుకు చెప్పలేదు? సునీత తరఫు న్యాయవాదులు న్యాయస్థానానికి శుక్రవారం చూపిన ఫొటోలు మృతదేహం పోస్టుమార్టం టేబుల్‌పై ఉన్నప్పటి ఫొటోలు. ఆ ఫొటోలను టీడీపీ బాగా రిజల్యూషన్ పెంచి ఒక బుక్‌లెట్‌లో ప్రచురించింది. ఈ ఫొటోలు చూపుతూ.. ఎవరికైనా అది హత్య అని తెలీదా అని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. అవినాశ్ రెడ్డి వెళ్లేసరికి వివేకా మృతదేహం బాత్రూమ్‌లో కమోడ్ వద్ద గోడకు చేరబడి ఉంది. ఆ కోణంలో గాయాలు ఏవీ కనిపించనే లేదు. ఆయన వెంటనే బయటకు వచ్చేశారు. వివేకా మృతి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పేందుకు ఫోన్లు చేశారు.

సినిమా



● మహేశ్‌బాబు

టైటిల్‌కి డేట్ ఫిక్స్

హీరో మహేశ్ బాబు ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. మహేశ్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా సినిమా టైటిల్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ నెల 31న అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఎంపిక చేసిన కొన్ని థియేటర్స్‌లో మహేశ్‌బాబు ఫ్యాన్స్ చేతుల మీదగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేసేలా చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ ఫిల్మ్ ఇది. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. జూన్ మొదటివారంలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఆరంభం కానున్నట్లు తెలిసింది. కాగా ఇప్పటివరకు ఈ సినిమాకు సంబంధించి విభిన్న రకాల టైటిల్స్ తెరపైకి వచ్చినప్పటికీ 'గుంటూరు కారం', 'ఊరికి మొనగాడు' టైటిల్స్‌లో ఏదొకటి ఖరారు అయ్యే చాన్స్ ఉందని సమాచారం. మరి.. వేరే ఏదైనా టైటిల్ తెర పైకి వస్తుందా? అనేది చూడాలి. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది.



● అల్లు అర్జున్

మళ్లీ సెట్...

హీరో అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల.. వైకుంఠపురములో..' సినిమాలకు మంచి ప్రేక్షకాదరణ లభించింది. వీరి కాంబినేషన్‌లో మరో సినిమా వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల త్రివిక్రమ్ చెప్పిన ఓ స్టోరీ లైన్ అల్లు అర్జున్‌కు బాగా నచ్చిందట. దీంతో త్రివిక్రమ్‌తో సినిమా చేసేందుకు అల్లు అర్జున్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ నిర్మించనుందట. ప్రస్తుతం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇటు మహేశ్‌బాబు సినిమాతో త్రివిక్రమ్ బిజీ. సో... వీరి కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక అల్లు అర్జున్, త్రివిక్రమ్ సినిమా సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంటుందేమో?

దర్శక-నిర్మాత కె. వాసు మృతి



ప్రముఖ, దర్శక–నిర్మాత కె. వాసు (72) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో (కిడ్నీ సంబంధిత వ్యాధి) బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో రెండు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. 1951, జనవరి 15న కె. వాసు జన్మించారు. ఆయన అసలు పేరు కొల్లి శ్రీనివాసరావు. ప్రముఖ దర్శకుడు కె. ప్రత్యగాత్మ తనయుడే కె. వాసు. తండ్రి, సోదరుడు హేమాంబరధరరావు దర్శకులు కావడంతో దర్శకత్వంపై మక్కువ పెంచుకున్నారు వాసు. తండ్రి ప్రత్యగాత్మ వద్ద 'ఆదర్శ కుటుంబం, మనసు మాంగల్యం, పల్లెటూరి బావ' వంటి సినిమాలకు అసోసియేట్‌గా చేశారు. తన 22 ఏళ్ల వయసులోనే 'ఆడపిల్లల తండ్రి' అనే సినిమాకు దర్శకత్వం వహించి, నిర్మించారు వాసు. ఆ చిత్రం తర్వాత చిరంజీవి హీరోగా 'ప్రాణం ఖరీదు' సినిమాని తెరకెక్కించారాయన. చిరంజీవి తొలి సినిమా 'పునాది రాళ్లు' అయినా 'ప్రాణం ఖరీదు' (1978) ముందు రిలీజైంది. చిరంజీవితో 'ఆరని మంటలు, కోతల రాయుడు, అల్లుళ్లొస్తున్నారు' వంటి సినిమాలూ తెరకెక్కించారు కె. వాసు. అలాగే 'తోడు దొంగలు, పల్లెటూరి పెళ్లాం, ఇంట్లో శ్రీమతి వీధిలో కుమారి, శ్రీ షిర్డీ సాయి బాబా మహత్యం', 'అయ్యప్పస్వామి మహత్యం' వంటి పలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' సూపర్ హిట్ భక్తిరస చిత్రంగా నిలిచింది. 'గజిబిజి' (2008) కె.వాసు చివరి చిత్రం. కాగా 1982లో రత్నకుమారిని వివాహం చేసుకున్నారు వాసు. వీరికి అన్నపూర్ణ, దీప్తి సంతానం. ఆయన మృతిపట్ల చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. శనివారం మహాప్రస్థానంలో కె. వాసు అంత్యక్రియలు జరుగుతాయి.



● అనిల్, అశ్విన్, సాయిధరమ్, నందిత, గంగపట్నం శ్రీధర్

ట్రైలర్ అదిరిపోయింది

- సాయిధరమ్ తేజ్

''క్రికెట్ వల్ల అశ్విన్‌తో నాకు పరిచయం ఏర్పడింది. అశ్విన్ హీరోగా నటించిన 'హిడింబ' ట్రైలర్ లాంచ్‌కు రావడం సంతోషంగా ఉంది. ట్రైలర్ అదిరిపోయింది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు సాయిధరమ్ తేజ్. అశ్విన్‌బాబు హీరోగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిడింబ'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో గంగపట్నం శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సాయిధరమ్ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. అశ్విన్‌బాబు మాట్లాడుతూ– ''హిడింబ' నా కెరీర్‌లో హయ్యెస్ట్ బడ్జెట్ మూవీ. ఈ సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు. ''ఈ సినిమాలో చాలా కీలకమైన పాత్ర చేశాను'' అన్నారు నందితా శ్వేత. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నుంచి హిస్టారికల్ ఫిక్షన్‌కు వెళ్లే చిత్రమిది. అశ్విన్ యాక్టింగ్ స్కిల్స్ ఈ సినిమాతో తెలుస్తాయి'' అన్నారు అనిల్. ''అశ్విన్ సపోర్ట్ వల్ల ఈ ప్రాజెక్ట్ సాధ్యమైంది. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: వికాస్ బాడిస, కెమెరా: బి. రాజశేఖర్.

ప్రియమైన థ్రిల్



● అశోక్, లీషా

అశోక్ కుమార్, లీషా ఎక్లెయిర్స్ హీరో హీరోయిన్‌గా ఏజే. సుజిత్ దర్శకత్వం వహించిన సైకో థ్రిల్లర్ 'ప్రియమైన ప్రియ'. గోల్డెన్ గ్లోరి బ్యానర్‌పై సీతారామ్ యాదవ్ నిర్మాణ నిర్వహణ సారథ్యంలో సుజిత్, బాబు నిర్మించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఆడియో, ట్రైలర్ రిలీజ్ కార్యక్రమాన్ని చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించింది. ఈ వేదికపై హీరో అశోక్ మాట్లాడుతూ– ''మంచి సైకో థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో నేనే హీరో, నేనే సైకో. యాక్టర్‌గా నన్ను నేను ప్రూవ్ చేసుకునే చిత్రమిది'' అన్నారు. ''మ్యూజిక్ డైరెక్టర్‌గా నా కెరీర్‌లో వందో చిత్రం ఇది'' అన్నారు శ్రీకాంత్ దేవా. నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: షా, సహ–నిర్మాత: కె. లక్ష్మీకాంత్.

టాలీలో మాలీ హవా

'ప్రతిభకి భాషతో సంబంధం లేదు' అనే మాట చిత్ర పరిశ్రమలో తరచుగా వినిపిస్తుంటుంది. టాలెంటెడ్ ఆర్టిస్టులు ఏ భాషలో ఉన్నా తెలుగు పరిశ్రమ సాదర స్వాగతం పలుకుతుంది. ప్రస్తుతం తెలుగులో సెట్స్‌పై ఉన్న పలు చిత్రాల్లో జయరామ్, పృథ్వీరాజ్ సుకుమారన్, ఫాహద్ ఫాజిల్, దేవ్ మోహన్, జోజు జార్జ్, సుదేష్ నాయర్.. వంటి పలువురు మలయాళ నటులు కీలక పాత్రలతో హవా సాగిస్తున్నారు. ఈ మాలీవుడ్ నటులు చేస్తున్న తెలుగు చిత్రాలపై ఓ లుక్కేద్దాం.

బిజీ బిజీగా...

'భాగమతి.. అల వైకుంఠపురములో, రాధేశ్యామ్, ధమాకా... ఇలా వరుసగా తెలుగు సినిమాలు చేశారు మలయాళ సీనియర్ నటుడు జయరామ్. నెగటివ్, పాజిటివ్ క్యారెక్టర్స్‌తో తెలుగులో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్ ఛేంజర్'తో పాటు మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రంలో జయరామ్ కీలక పాత్ర చేస్తున్నారు.

అదిరే ఎంట్రీ

మలయాళం స్టార్ హీరోల్లో ఒకరైన ఫాహద్ ఫాజిల్ 'పార్టీ లేదా పుష్పా..' అంటూ తెలుగులోకి అడుగుపెట్టారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప: ది రైజ్' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ భన్వర్ సింగ్ షెకావత్ పాత్రతో అదిరే ఎంట్రీ ఇచ్చారు ఫాహద్. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంలోనూ భన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో నటిస్తున్నారు ఫాహద్ ఫాజిల్. 'పుష్ప' మొదటి భాగంలో ఆయన పాత్ర నిడివి తక్కువగానే ఉన్నా రెండో భాగంలో మాత్రం పూర్తి స్థాయిలో ఉంటుందని టాక్.

పదమూడేళ్ల తర్వాత...

మాలీవుడ్‌లో ఓ వైపు స్టార్ హీరోగా దూసుకెళుతూ మరోవైపు డైరెక్టర్‌గా (లూసిఫర్, బ్రో డాడీ) ప్రతిభ చూపిస్తున్నారు పృథ్వీరాజ్ సుకుమారన్. కాగా మన్మోహన్ చల్లా దర్శకత్వం వహించిన 'పోలీస్ పోలీస్' (2010) చిత్రం ద్వారా తెలుగులో ఎంట్రీ ఇచ్చారు పృథ్వీరాజ్. ఆ చిత్రంలో ఓ హీరోగా నటించిన ఆయన పదమూడేళ్ల గ్యాప్ తర్వాత మరో తెలుగు చిత్రంలో ('సలార్') నటిస్తున్నారు. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో జగపతిబాబు ఓ విలన్‌గా నటిస్తుండగా ఆయన తనయుని పాత్రలో పృథ్వీరాజ్ నటిస్తున్నారట. పృథ్వీ పాత్ర నెగటివ్ టచ్‌తో ఉంటుందని టాక్. సెప్టెంబర్ 28న 'సలార్' విడుదల కానుంది.

'శాకుంతలం'తో వచ్చి...

గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన 'శాకుంతలం'తో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు దేవ్ మోహన్. మలయాళంలో నటించింది కొన్ని సినిమాలే అయినా తొలి తెలుగు చిత్రంలోనే సమంత వంటి స్టార్ హీరోయిన్‌కి జోడీగా నటించే అవకాశం అందుకున్నారు దేవ్ మోహన్. ఈ సినిమాలో దుష్యంత మహారాజుగా నటించి, మెప్పించారు దేవ్. ఇలా 'శాకుంతలం'తో తెలుగుకి వచ్చి, రెండో తెలుగు సినిమా 'రెయిన్‌బో'లోనూ మరో స్టార్ హీరోయిన్ రష్మికా మందన్నాకి జోడీగా నటించే చాన్స్ అందుకున్నారు దేవ్. శాంత రూబన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

జోజు.. సుదేష్ కూడా...

మలయాళంలో నటుడిగా, నిర్మాతగా, గాయకుడిగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న జోజు జార్జ్ 'ఆది కేశవ' సినిమాతో తెలుగులోకి అడుగుపెడుతున్నారు. వైష్ణవ్ తేజ్ హీరోగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో విలన్‌గా నటిస్తున్నారు జోజు. అలాగే నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న సినిమా ద్వారా సుదేష్ నాయర్ తెలుగుకి ఎంట్రీ ఇస్తున్నారని టాక్. ఈ చిత్రంలో ఆయన స్టైలిష్ విలన్ పాత్రలో కనిపిస్తారట. వీళ్లే కాదు.. మరికొందరు మలయాళ నటులు కూడా తెలుగు సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




● జయరామ్



● 'పుష్ప'లో ఫాహద్



● జోజు



● సుదేష్



● 'సలార్'లో పృథ్వీరాజ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
629	178
62,502	18,499

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	12,974	▲ 276
డోజోన్స్	33,076	▲ 311
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,627	▲ 56
డాక్స్	15,984	▲ 190
షాంఘై	3,213	▲ 11
నికాయ్	30,916	▲ 115

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.ల్లో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,142 ▽ 219
బంగారం (99.5 స్వచ్ఛత)	59,901 ▽ 218
వెండి (కిలో)	70,500 ▲ 215

నిస్సాన్ మాగ్నైట్ గీజా ఎడిషన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ నిస్సాన్ మోటార్ ఇండియా తాజాగా ఎస్‌యూవీ మాగ్నైట్ గీజా స్పెషల్ ఎడిషన్‌ను ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.7.39 లక్షల నుంచి ప్రారంభం. 9 అంగుళాల హై-రిజొల్యూషన్ టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ కనెక్టివిటీతో ఆన్‌డ్రాయిడ్ కార్‌ప్లే, ప్రీమియం జేబీఎల్ స్పీకర్స్, యాప్ ఆధారంగా నియంత్రించగలిగే ఆంబియెంట్ లైటింగ్, ట్రాజెక్టరీ గైడ్‌లైన్స్‌తో రేర్ కెమెరా, షార్క్ ఫిన్ యాంటెన్నా పొందుపరిచారు. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, హిల్ స్టార్ట్ అసిస్ట్ వంటి భద్రతా ఫీచర్లున్నాయి. నిర్వహణ వ్యయం కిలోమీటరుకు 35 పైసలు అవుతుందని కంపెనీ తెలిపింది. గ్లోబల్ ఎన్‌సీఏపీ నుంచి 4-స్టార్ సేఫ్టీ రేటింగ్ ఉంది.



బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎఫ్‌డీ రేట్ల పెంపు


న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏడాది కాల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీలు) రేట్లను పెంచింది. రూ.2 కోట్ల వరకు డిపాజిట్లు చేసే రిటైల్ ఇన్వెస్టర్లకు ఏడాది కాల డిపాజిట్‌పై 7 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. అదే 60 ఏళ్లు నిండిన వృద్ధులకు ఏడాది కాల ఎఫ్‌డీపై 7.50 శాతం, 80 ఏళ్లు నిండిన వారికి 7.65 శాతం ఇస్తున్నట్టు బ్యాంక్ ప్రకటించింది. తాజా రేట్ల సవరణ తర్వాత ఏడు రోజుల నుంచి పదేళ్ల కాలం వరకు డిపాజిట్లపై రేట్లు 3–7 శాతం మధ్య ఉన్నాయి.

మెక్‌లారెన్ కారు @ రూ. 5.1 కోట్లు

న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న యూకే సంస్థ మెక్‌లారెన్ ఆటోమోటివ్ భారత మార్కెట్లో అర్చురా హైబ్రిడ్ స్పోర్ట్స్ మోడల్‌ను పరిచయం చేసింది. ఎక్స్‌షోరూంలో ఈ కారు ధర రూ.5.1 కోట్లుగా ఉంది. 680 పీఎస్ పవర్, 720 ఎన్‌ఎం టార్క్, 8 స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో 2,993 సీసీ ట్విన్ టర్బోచార్జ్‌డ్ వీ6 పెట్రోల్ ఇంజిన్, లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్ పొందుపరిచారు. గంటకు గరిష్ట వేగం 330 కిలోమీటర్లు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 3 సెకన్లలో, 200 కిలోమీటర్ల వేగాన్ని 8.3 సెకన్లలో అందుకుంటుంది. వినియోగదారుడు కోరితే కస్టమైజ్ చేస్తారు. ఇంగ్లండ్‌లో ఉత్పత్తి అయిన ఈ కారు భారత్‌కు దిగుమతి అవుతుంది. 'తొలి ఏడాది భారతీయ మార్కెట్లో కంపెనీ ప్రభా వం అత్యద్భుతంగా ఉంది. మా కస్టమర్లకు అసాధారణమైన సేవ, డ్రైవింగ్ అనుభవాన్ని అందించడం కోసం ఎదురుచూస్తున్నాం' అని మెక్‌లారెన్ ఆటోమోటివ్ అపాక్, చైనా ఎండీ హ్యారిస్ తెలిపారు.



మార్కెట్ల హైజంప్



- సెన్సెక్స్ 629 పాయింట్లు అప్
- 62,502 వద్ద ముగింపు
- నిఫ్టీ 178 పాయింట్లు ప్లస్
- అన్ని రంగాలూ లాభాల్లోనే

టాటా మోటార్స్‌కు సై

మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ తాజాగా దేశీ ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ రేటింగ్ ఔట్‌లుక్ స్థిరత్వం నుంచి సానుకూలానికి అప్‌గ్రేడ్ చేసింది. ఈ నేపథ్యంలో బీఎస్‌ఈలో ఈ కంపెనీ షేర్ 1% పెరిగి 519 వద్ద ముగిసింది.

ముంబై: కొత్త డెరివేటివ్ సిరీస్ తొలి రోజు దేశీ స్టాక్ మార్కెట్లు దూకుడు చూపాయి. సెన్సెక్స్ 629 పాయింట్లు జంప్‌చేసి 62,502 వద్ద ముగిసింది. నిఫ్టీ 178 పాయింట్లు ఎగసి 18,499 వద్ద నిలిచింది. వెరసి వరుసగా రెండో రోజు మార్కెట్లు లాభపడ్డాయి. జూన్ ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల ప్రారంభం నేపథ్యంలో మార్కెట్లు సానుకూలంగా మొదలయ్యాయి. ఆపై ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో సమయం గడిచేకొద్దీ జోరందుకున్నాయి. చివరికి ఇంట్రాడే గరిష్టాల వద్ద నిలిచాయి. ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు సైతం సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. చివర్లో సెన్సెక్స్ 657 పాయింట్ల వృద్ధితో 62,530కు చేరింది. నిఫ్టీ సైతం 18,508ను దాటింది. మరోవైపు క్యూ4 జీడీపీ వృద్ధి అంచనాలతోపాటు సాధారణ రుతుపవన అంచనాలు రూపాయికి హుషారునిచ్చాయి. డాలరుతో మారకంలో 12 పైసలు పుంజుకుని 82.60ను తాకింది.

రిలయన్స్ దన్ను

ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ బలపడ్డాయి. 2.25–0.5 % మధ్య పుంజుకున్నాయి. బ్లూచిప్స్‌లో ఇండెక్స్ హెవీవెయిట్ రిలయన్స్(ఆర్ఐఎల్) 3 శాతం ఎగసింది. దీంతో మార్కెట్లకు బలమొచ్చింది. యూఎస్ కన్జూమర్ కంపెనీ జనరల్ మిల్స్‌తో జట్టు కట్టడం ద్వారా ఎఫ్ఎంసీజీలో విస్తరించనున్న వార్తలు ఆర్ఐఎల్‌కు జోష్‌నిచ్చాయి. ఇతర నిఫ్టీ దిగ్గజాలలో సన్ ఫార్మా, హిందాల్కో, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, డీవీస్, విప్రో, యూపీఎల్, టెక్ ఎం, టాటా స్టీల్, ఎస్‌బీఐ లైఫ్, టాటా కన్జూమర్, మారుతీ, అల్ట్రాటెక్, టైటన్, టీసీఎస్, ఐసీఐసీఐ 2.3–1% మధ్య ఎగశాయి. బ్లూచిప్స్‌లో ఓఎన్‌జీసీ, గ్రాసిమ్, బజాజ్ ఆటో, ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ మాత్రమే(1.2–0.4 శాతం మధ్య) నీరసించాయి.

లాభాల్లోకి సన్ ఫార్మా

- క్యూ4లో రూ. 1,984 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దేశీ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నష్టాలను వీడి రూ. 1,984 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,277 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 16 శాతం ఎగసి రూ. 10,931 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 9,447 కోట్ల టర్నోవర్ సాధించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం భారీ వృద్ధితో రూ. 8,474 కోట్లను తాకింది. 2021–22లో కేవలం రూ. 3,273 కోట్లు ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం రూ. 38,645 కోట్ల నుంచి రూ. 43,886 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో సన్ ఫార్మా షేరు బీఎస్‌ఈలో దాదాపు 3 % జంప్‌చేసి రూ. 971 వద్ద ముగిసింది.

మహీంద్రా లాభం రూ. 2,637 కోట్లు

- క్యూ4లో 18 శాతం అప్
- ఆదాయం రూ. 32,366 కోట్లు



ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) నాలుగో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 2,637 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం(2021–22) క్యూ4లో నమోదైన రూ. 2,237 కోట్లతో పోలిస్తే ఇది 18 శాతం అధికం. ఆదాయం రూ. 25,934 కోట్ల నుంచి రూ. 32,366 కోట్లకు చేరింది. ఇక, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 6,577 కోట్ల నుంచి 56 శాతం ఎగిసి రికార్డు స్థాయిలో రూ. 10,282 కోట్లకు చేరిందని సంస్థ తెలిపింది. ఆదాయం రూ. 90,171 కోట్ల నుంచి 34 శాతం పెరిగి రూ. 1,21,269 కోట్లకు చేరింది. రూ. 5 ముఖ విలువ గల షేరు ఒక్కింటికి రూ. 16.25 (325 శాతం) డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు సిఫార్సు చేసింది.

ఫలితాల నేపథ్యంలో మహీంద్రా షేరు బీఎస్‌ఈలో స్వల్ప లాభంతో రూ. 1,282 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.ల్లో)	
27-5-2023	
విశాఖ	490–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
26-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	453–00
వరంగల్	455–00
రిటైల్ ధర	5.15

స్నాక్స్ వ్యాపారంలోకి రిలయన్స్ రిటైల్

జనరల్ మిల్స్‌తో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ రంగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించే క్రమంలో అమెరికాకు చెందిన బ్రాండెడ్ కన్జూమర్ ఫుడ్స్ తయారీ సంస్థ జనరల్ మిల్స్‌తో రిలయన్స్ రిటైల్ చేతులు కలిపింది. తద్వారా అత్యంత వేగంగా ఎదుగుతున్న స్నాక్స్ ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టింది. దేశీ మార్కెట్లో అలాన్స్ బ్యూగుల్స్ బ్రాండ్ కార్న్ చిప్స్ స్నాక్స్‌ను ప్రవేశపెట్టినట్లు రిలయన్స్ రిటైల్‌లో భాగమైన రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్, (ఆర్‌సీపీఎల్) శుక్రవారం తెలిపింది. ముందుగా కేరళతో ప్రారంభించి ఇతర రాష్ట్రాల్లో క్రమంగా వీటిని అందుబాటులోకి తేనున్నట్లు వివరించింది. వీటి ధర రూ. 10 నుంచి ప్రారంభమవుతుంది. 110 బిలియన్ డాలర్ల ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్) మార్కెట్లో గణనీయ మార్కెట్ వాటాను దక్కించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆర్‌సీపీఎల్ ఇటీవల క్యాంపా, సోస్యో, రస్కిక్, టాఫీమ్యాన్ తదితర బ్రాండ్స్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

కాప్28 సలహాదార్ల కమిటీలో ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్ 28వ సెషన్‌కు (కాప్ 28) మార్గదర్శకత్వం వహించే అంతర్జాతీయ అడ్వైజరీ కమిటీలో సభ్యునిగా ఎంపికయ్యారు. ఆయనతో పాటు భారత్ నుంచి వాతావరణ మార్పుల ఉద్యమ నేత సునీత నారాయణ్ ఎంపికయ్యారు. ఈ ప్యానెల్‌లో 31 మంది అంతర్జాతీయ నిపుణులు ఉంటారు. వాతావరణ మార్పులపై 2023 ఐక్యరాజ్యసమితి సదస్సు దుబాయ్‌లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు జరుగనుంది.

సెయిల్ లాభాలకు కోత

క్యూ4లో రూ.1,159 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఉక్కు తయారీ సంస్థ సెయిల్ మార్చి త్రైమాసికానికి బలహీన ఫలితాలను ప్రకటించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు సగం పడిపోయి రూ.1,159 కోట్లకు పరిమితమైంది. ఆదాయం సైతం 5 శాతం వరకు తగ్గి రూ.1,29,416 కోట్లుగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,479 కోట్లు, ఆదాయం రూ.31,175 కోట్ల చొప్పున ఉన్నాయి. ఒక్కో షేరుకు 50 పైసల చొప్పున తుది డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ నిర్ణయించింది. అధిక బొగ్గు ధరలకు తోడు, స్టీల్ ధరల్లో ఆటుపోట్లు కంపెనీ మార్జిన్లపై ప్రభావం చూపించాయని సెయిల్ ప్రకటించింది. 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 1,04,448 కోట్లుగా, నికర లాభం రూ.2,177 కోట్లుగా నమోదైంది. 2021–22లో ఆదాయం రూ.1,03,477 కోట్లు, నికర లాభం రూ.12,243 కోట్ల చొప్పున ఉండడం గమనార్హం.

ఫలితాల నేపథ్యంలో సంస్థ షేరు బీఎస్‌ఈలో స్వల్ప నష్టంతో రూ. 82 వద్ద ముగిసింది.



చివరి నిమిషంలో భారత్ ఓటమి

అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భాగంగా ఒలింపిక్ చాంపియన్ బెల్జియంతో లండన్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. చివరి నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను నెల్సన్ ఒనానా గోల్‌గా మలిచి బెల్జియం జట్టును గెలిపించాడు. అంతకు ముందు థిబె స్టాక్‌బ్రోక్స్ (18వ ని.లో) గోల్‌తో బెల్జియం 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే 25వ నిమిషంలో మన్‌దీప్ సింగ్ గోల్‌తో భారత్ 1–1తో స్కోరును సమం చేసింది. ఇక మ్యాచ్ 'డ్రా'గా ముగియడం ఖాయమనుకున్న దశలో భారత జట్టు గోల్ సమర్పించుకొని మూల్యం చెల్లించుకుంది. నేడు జరిగే రెండో మ్యాచ్‌లో బ్రిటన్‌తో భారత్ తలపడుతుంది.

భారత్ X పాకిస్తాన్

ఆసియాకప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నీలో భారత్ నేడు పాకిస్తాన్‌తో ఆడనుంది. ఒమన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పూల్ 'ఎ'లో భారత్, పాక్ తాము ఆడిన తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

గిల్ గర్జన...

మే 7న లీగ్ దశలో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో శుబ్‌మన్ గిల్ 94 పరుగులతో అజేయంగా నిలిచాడు. సెంచరీ కోల్పోవడంపై స్పందిస్తూ... ఇంకా కొన్ని మ్యాచ్‌లు ఉన్నాయి కదా, శతకం సాధిస్తాను అంటూ చెప్పాడు. అతని ఆత్మవిశ్వాసం ఎలాంటిదంటే ఒక సెంచరీ కాదు, తర్వాతి ఐదు మ్యాచ్‌ల్లో ఏకంగా మూడు సెంచరీలు సాధించేశాడు! శుక్రవారం మ్యాచ్‌లో అతని సత్తా ఏమిటో మళ్లీ కనిపించింది. అసలైన 'సెమీస్' సమరంలో అతను అద్భుత ఆటతో ఐదుసార్లు చాంపియన్ ముంబైను పుట్టి ముంచాడు. గిల్ శతకంతో భారీ స్కోరు సాధించిన గుజరాత్ ఆపై పదునైన బౌలింగ్‌తో రోహిత్ సేనను కట్టి పడేసింది. హోరాహోరీ అనుకున్న సమరం ఏకపక్షంగా మారిపోగా, డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో ఏడాది ఫైనల్‌కు సిద్ధమైంది. రేపు చెన్నై సూపర్ కింగ్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.



శుబ్‌మన్ గిల్

60 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్స్‌లతో 129

- శుబ్‌మన్ సూపర్ సెంచరీ
- బంతితో మెరిసిన మోహిత్ (5/10)
- ఫైనల్లో గుజరాత్ టైటాన్స్
- క్వాలిఫయర్–2లో ముంబైపై గెలుపు
- రేపు చెన్నై సూపర్ కింగ్స్‌తో తుది పోరు

అహ్మదాబాద్: హార్దిక్ పాండ్యా నాయకత్వంలో గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ టోర్నీలో వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్–2లో గుజరాత్ 62 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 233 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 129; 7 ఫోర్లు, 10 సిక్స్‌లు) శతకంతో కదం తొక్కాడు. గిల్, సాయి సుదర్శన్ (31 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 64 బంతుల్లోనే 138 పరుగులు జోడించారు. అనంతరం ముంబై 18.2 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. సూర్యకుమార్ (38 బంతుల్లో 61; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, తిలక్ వర్మ (14 బంతుల్లో 43; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. గుజరాత్ బౌలర్ మోహిత్ శర్మ 14 బంతుల్లో కేవలం 10 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

అంతా గిల్‌మయం...

ఓపెనర్ సాహా (18) తొందరగానే అవుటయ్యాక గిల్ జోరు మొదలైంది. జోర్డాన్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన తర్వాత అదే ఓవర్లో గిల్ ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను (వ్యక్తిగత స్కోరు 30 వద్ద) డేవిడ్ వదిలేయడం కూడా కలిసొచ్చింది. 32 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. మరోవైపు సుదర్శన్ కూడా తన వంతుగా సహకారం అందించాడు. హాఫ్ సెంచరీ తర్వాత గిల్ మరింత చెలరేగిపోయాడు. 50 నుంచి 100కు చేరేందుకు అతనికి 17 బంతులు మాత్రమే సరిపోయాయి. ఇందులో 6 భారీ సిక్సర్లు ఉండటం విశేషం. ఆకాశ్ మధ్వాల్ వేసిన ఓవర్లోనే 3 సిక్సర్లు బాదిన అతను చావ్లా ఓవర్లో మరో రెండు సిక్స్‌లు కొట్టాడు. 49 బంతుల్లో సెంచరీ సాధించిన అనంతరం గ్రీన్ ఓవర్లో గిల్ వరుసగా 6, 4, 6తో తన ధాటిని కొనసాగించాడు. మరో షాట్‌కు ప్రయత్నించి డేవిడ్‌కే క్యాచ్ ఇవ్వడంతో ఎట్టకేలకు ఆ అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. చివర్లో వేగంగా ఆడటంలో విఫలమైన సుదర్శన్ 'రిటైర్డ్ అవుట్'తో తప్పుకోగా, హార్దిక్ (13 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు షాట్లతో గుజరాత్ భారీ స్కోరుతో ముగించింది.



సూర్యకుమార్

తిలక్ మెరుపులు...



మోహిత్ శర్మ

గుజరాత్ ఇన్నింగ్స్ సమయంలో మైదానంలో కలిసి నడుస్తుండగా జోర్డాన్ మోచేయి అనుకోకుండా ఇషాన్ కంటికి తగిలింది. దాంతో 'కన్‌కషన్'కు గురైన అతను ఆడలేని స్థితిలో ఉండగా, ఓపెనర్‌గా వచ్చిన నేహల్ వధేరా (4) తొలి ఓవర్లోనే వెనుదిరిగాడు. షమీ తర్వాతి ఓవర్లోనే రోహిత్ శర్మ (8) కూడా అవుట్ కావడంతో ముంబై కష్టాలు పెరిగాయి. ఈ దశలో తిలక్ జోరుతో ముంబై కోలుకుంది. తన తొలి 4 బంతుల్లోనే 2 సిక్స్‌లు కొట్టిన తిలక్... షమీని ఓ ఆటాడుకున్నాడు. అతని ఓవర్లో వరుసగా 4, 4, 4, 4, 2, 6 కొట్టడంతో 24 పరుగులు వచ్చాయి. అయితే రషీద్ చక్కటి బంతితో తిలక్‌ను బౌల్డ్ చేయగా, గ్రీన్ (20 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. అయినా సూర్య క్రీజ్‌లో ఉండటంతో జట్టు ఆశలు మిగిలే ఉన్నాయి. కొన్ని చూడచక్కటి షాట్లు ఆడిన అతను 33 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ మోహిత్ ఓవర్లో మరో మెరుపు షాట్‌కు ప్రయత్నించి సూర్య బౌల్డ్ కావడంతో గెలుపు దారులు మూసుకుపోయాయి.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (స్టంప్డ్) ఇషాన్ (బి) చావ్లా 18; గిల్ (సి) డేవిడ్ (బి) ఆకాశ్ 129; సుదర్శన్ (రిటైర్డ్ అవుట్) 43; పాండ్యా (నాటౌట్) 28; రషీద్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 233. వికెట్ల పతనం:** 1–54, 2–192, 3–214. **బౌలింగ్:** బెహ్రన్‌డార్ఫ్ 4–0–28–0, గ్రీన్ 3–0–35–0, ఆకాశ్ మధ్వాల్ 4–0–52–1, జోర్డాన్ 4–0–56–0, చావ్లా 3–0–45–1, కార్తికేయ 2–0–15–0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) లిటిల్ (బి) షమీ 8; వధేరా (సి) సాహా (బి) షమీ 4; గ్రీన్ (బి) లిటిల్ 30; సూర్యకుమార్ (బి) మోహిత్ 61; తిలక్ వర్మ (బి) రషీద్ 43; విష్ణు (సి) పాండ్యా (బి) మోహిత్ 5; డేవిడ్ (ఎల్బీ) (బి) రషీద్ 2; జోర్డాన్ (సి) సుదర్శన్ (బి) మోహిత్ 2; చావ్లా (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; కార్తికేయ (సి) మిల్లర్ (బి) మోహిత్ 6; బెహ్రన్‌డార్ఫ్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (18.2 ఓవర్లలో ఆలౌట్) 171. వికెట్ల పతనం:** 1–5, 2–21, 3–72, 4–124, 5–155, 6–156, 7–158, 8–161, 9–162, 10–171. **బౌలింగ్:** షమీ 3–0–41–2, పాండ్యా 2–0–24–0, రషీద్ 4–0–33–2, నూర్ 4–0–35–0, లిటిల్ 3–0–26–1, మోహిత్ 2.2–0–10–5.

సెమీస్‌లో సింధు, ప్రణయ్

క్వార్టర్ ఫైనల్లో ఓడిన శ్రీకాంత్



కౌలాలంపూర్: తమ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ లో భారత స్టార్స్ పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం హోరాహోరీగా సాగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో సింధు 74 నిమిషాల్లో 21–16, 13–21, 22–20తో యి మన్ జాంగ్ (చైనా)పై గెలుపొందగా... ప్రణయ్ 91 నిమిషాల్లో 25–23, 18–21, 21–13తో కెంటా నిషిమోటో (జపాన్)ను ఓడించాడు. అయితే భారత మరో స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. 57 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 23వ ర్యాంకర్ శ్రీకాంత్ 21–16, 16–21, 11–21తో ప్రపంచ 57వ ర్యాంకర్ క్రిస్టియన్ అడినాటా (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయాడు. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో గ్రెగోరియా టున్‌జుంగ్ (ఇండోనేసియా)తో సింధు; అడినాటాతో ప్రణయ్ తలపడతారు.

డబ్ల్యూటీసీ విజేత జట్టుకు 16 లక్షల డాలర్లు



దుబాయ్: వచ్చే నెలలో లండన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ విజేత జట్టుకు 16 లక్షల డాలర్ల (రూ. 13 కోట్ల 21 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కనుంది. జట్టుకు ప్రైజ్‌మనీతోపాటు వెండి గదను కూడా అందజేస్తారు. 2021–2023 డబ్ల్యూటీసీకి సంబంధించి ప్రైజ్‌మనీ వివరాలను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. ఆస్ట్రేలియా , భారత్ జట్ల మధ్య జూన్ 7 నుంచి 11 వరకు డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 8 లక్షల డాలర్లు (రూ. 6 కోట్ల 60 లక్షలు) లభిస్తాయి. మూడో స్థానంలో నిలిచిన దక్షిణాఫ్రికా జట్టు 4,50,000 డాలర్లు (రూ. 3 కోట్ల 71 లక్షలు), నాలుగో స్థానం పొందిన ఇంగ్లండ్ జట్టు 3,50,000 డాలర్లు (రూ. 2 కోట్ల 89 లక్షలు) సొంతం చేసుకున్నాయి. ఐదో స్థానం దక్కించుకున్న శ్రీలంక జట్టు ఖాతాలో 2 లక్షల డాలర్లు (రూ. కోటీ 65 లక్షలు) చేరాయి. వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిదో స్థానాల్లో నిలిచిన న్యూజిలాండ్; పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్లకు 1 లక్ష డాలర్ల (రూ. 82 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

రన్నరప్ షన్విత్తా రెడ్డి



పటాన్‌చెరు టౌన్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ బాలికల టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి నూకల షన్విత్తా రెడ్డి రన్నరప్‌గా నిలిచింది. ఉగాండా రాజధాని కంపాలాలో శుక్రవారం ముగిసిన ఈ టోర్నీ బాలికల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన షన్విత్తా రెడ్డి 4–6, 3–6తో టాప్ సీడ్ లేలా అక్మెటోవా (రష్యా) చేతిలో ఓటమి చవిచూసింది. అంతకుముందు షన్విత్తా రెడ్డి తొలి రౌండ్‌లో 6–1, 6–1తో ఫెయిత్ ఉరాసా (కెన్యా)పై, క్వార్టర్ ఫైనల్లో 6–2, 6–2తో సియా మహాజన్ (భారత్)పై, సెమీఫైనల్లో 6–1, 6–3తో నాలుగో సీడ్ షనా మార్టిన్ మావో (టాంజానియా)పై విజయం సాధించింది.

హారిక మరో 'డ్రా'



నికోసియా: మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీలో బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో శుక్రవారం జరిగిన పదో రౌండ్ గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ హారిక 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. హారికకిది వరుసగా ఐదో 'డ్రా'. పదో రౌండ్ తర్వాత హారిక ఆరు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

క్లుప్తంగా...

త్వరలో మార్కెట్లోకి నానో డీఏపీ

కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమీర్ అల్వీ



మాట్లాడుతున్న అమీర్ అల్వీ

కాకినాడ రూరల్: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ద్వారా త్వరలో నానో డీఏపీని రైతులకు అందిస్తామని ఆ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమీర్ అల్వీ తెలిపారు. కాకినాడ జిల్లా వాకలపూడిలోని ప్లాంట్ పరిధిలో సీఎస్ఆర్ నిధులు సుమారు రూ.35లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, ఆర్వో ప్లాంట్‌ను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అమీర్ అల్వీ, మరో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. రైతులు మోతాదుకు మించి ఎరువులను వినియోగిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం నానో డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ముంబయిలోని తమ సంస్థ ఆర్ అండ్ డీ కేంద్రంలో నానో డీఏపీ అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ద్రవ రూపంలో ఉన్న నానో డీఏపీని త్వరలోనే మార్కెట్‌లో ప్రవేశపెడతామన్నారు. కోరమాండల్ సంస్థ కాకినాడ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, ప్రతినిధులు కె.రంగకుమార్, ఎస్.దినేష్‌కుమార్, పద్మనాభం పాల్గొన్నారు.

విహార యాత్రలో విషాదం

- అంతర్వేది బీచ్‌లో ఇద్దరి గల్లంతు
- యువతి మృతదేహం లభ్యం
- బాలుడి ఆచూకీ కోసం గాలింపు





మృతురాలు జ్యోతి, రాజీవ్‌కుమార్ (ఫైల్)

మలికిపురం/సఖినేటిపల్లి: విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. అంతర్వేది బీచ్‌లో ఇద్దరు గల్లంతయ్యారు. వీరిలో యువతి మృతదేహం లభ్యం కాగా, బాలుడి ఆచూకీ తెలియ రాలేదు. ఇందుకు సంబంధించిన వివరాలివీ.. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన సోలా ఏసురాజు నూతన గృహం నిర్మించుకున్నాడు. గృహప్రవేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన 15 మంది బంధువులు శుక్రవారం అంతర్వేది సాగర సంగమం వద్దకు విహార యాత్రకు వెళ్లారు. ఎగసి పడుతున్న సాగర కెరటాలను చూసిన ఉత్సాహంలో.. ఏసురాజు కుమారుడు రాజీవ్‌కుమార్ (5) పరుగు పరుగున అక్కడకు వెళ్లాడు. వేగంగా నీటిలో దిగడంతో ఒక్కసారిగా మునిగిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన ఏసురాజు సోదరి, పశ్చిమ గోదావరి జిల్లా విస్సాకోడేరుకు చెందిన బెల్లంకొండ జ్యోతి (20) ఒక్క ఉదుటన పరుగెత్తుకుని వెళ్లి, ఆ బాలుడిని రక్షించబోయింది. ఈ క్రమంలో అలల ధృతికి ఆమె కూడా సముద్రంలోకి కొట్టుకుపోయింది. కాసేపటికి జ్యోతి మృతదేహం లభ్యమైంది. బాలుని ఆచూకీ కోసం పోలీసులు, బంధువులు గాలిస్తున్నారు. బంధుమిత్రులందరితో కలిసి సందడిగా గృహప్రవేశం చేసుకున్నామన్న ఆనందం ఆ కుటుంబానికి ఒక్క రోజు కూడా నిలవలేదు. కన్న కొడుకు గల్లంతవ్వడం, సోదరి జ్యోతి మృతి చెందడంతో ఏసురాజు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నీళ్లకుండీలో పడి బాలుడి దుర్మరణం

దేవరపల్లి: ఇంటి వద్ద ఉన్న నీళ్లకుండీలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన దేవరపల్లి మండలం యర్నగూడెంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కందివలస నారాయణ, రేణుక దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కార్తిక్, రెండో కుమారుడు ధనుష్ (5). నిరుపేద కుటుంబం కావడంతో నారాయణ దంపతులు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నారాయణ దివ్యాంగుడు అయినప్పటికీ రెక్కలు ముక్కలు చేసుకుంటూ బిడ్డల్ని చదివిస్తున్నాడు. అంగన్‌వాడీ స్కూలుకు వెళ్లడానికని శుక్రవారం ఇంటి వద్ద ఉన్న నీళ్లకుండీ వద్దకు ధనుష్ వెళ్లాడు. కుండీలోని మగ్గు తీయడానికి కిందకు వంగాడు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తూ ఆ కుండీలో పడి మృతి చెందాడు. పొలం పనికి వెళ్లిన తండ్రి నారాయణ ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. కాళ్లు, చేతులు కడుక్కునేందుకు కుండీ వద్దకు వెళ్లగా.. అందులో ధనుష్ మునిగి ఉన్నాడు. దీంతో బెంబేలెత్తిన నారాయణ, కుటుంబ సభ్యులు ఆ బాలుడిని దేవరపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ధనుష్ మృతి చెందాడని వైద్యాధికారులు తెలిపారు. ఇంటి వద్ద అల్లారు ముద్దుగా ఉండే ముక్కుపచ్చలారని గారాల బిడ్డ ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

విద్యావ్యవస్థను సమష్టిగా అభివృద్ధి చేద్దాం

డిజిటల్ బోధనపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, అవగాహన సదస్సులో విద్యాశాఖ మంత్రి బొత్స

సాక్షి, అమరావతి: విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా సంస్కరణలను కూడా మనమే మొదటిసారి అమలు చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఆంధ్రా లయోలా కళాశాలల్లో 'డిజిటల్ విద్యావిధానం-సాంకేతికతతో కూడిన బోధన-అభ్యాసం'పై మాస్టర్ రిసోర్స్ పర్సన్లకు (ట్రైనర్లకు) శుక్రవారం శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ ప్రపంచమంతా పయనిస్తున్న డిజిటల్ బాటలో మన రాష్ట్రం ముందుండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారని, అందుకు తగ్గట్టుగానే అద్భుతమైన సంస్కరణలను, పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. మూడు నాలుగేళ్లలో 'మన బడి నాడు-నేడు' ద్వారా ప్రభుత్వ బడులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా ప్రతి విద్యార్థికి సొంతబిడ్డలా ఉన్నతమైన విద్యను అందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఏ స్థాయిలో విద్య అం



దుతుంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు తనిఖీ చేస్తుంటారన్నారు. జగనన్న అమ్మఒడి, మన బడి నాడు-నేడు, మరుగుదొడ్ల నిర్వహణ నిధి, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, పాఠ్యాంశ సంస్కరణల ద్వారా ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఇప్పుడు డిజిటల్ విద్యాబోధన ద్వారా తరగతిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు మరింత ప్రభావవంతంగా బోధించే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 32 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా డిజిటల్ కంటెంట్‌ను యాక్సెస్ చేయడానికి బైజూస్‌తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించిన ట్యాబ్‌లలో బైజూస్ ప్రీమియం కంటెంట్‌ను సక్రమంగా అందించడం ద్వారా 2024-25 నాటికి విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్‌తో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ ట్యాబుల కోసం రూ.686 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలతో బోధన

అన్ని ప్రీ-హైస్కూళ్లు, హైస్కూళ్లలో 6 నుంచి 10 తరగతుల వరకు 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ)ను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి వీటి ద్వారా బోధన ఉంటుందన్నారు. ఫౌండేషనల్, ఫౌండేషనల్ ప్లస్ పాఠశాలలకు 10,038 స్మార్ట్ టీవీలు ఇవ్వనున్నట్టు చెప్పారు. మన బడి నాడు-నేడు మొదటివిడత పాఠశాలల్లో వీటిని బిగించేందుకు రూ.352 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు మెరుగైన డిజిటల్ బోధన అందించేందుకు శిక్షణలో పాల్గొన్న జిల్లా రిసోర్సు పర్సన్లు ప్రతి పాఠశాలలో డిజిటల్ విద్యావిధానం చక్కగా అమలయ్యేలా తర్ఫీదు ఇవ్వాలని ఆయన కోరారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, పాఠశాలవిద్య కమిషనర్ (ఇన్‌ఫ్రా) కాటమనేని భాస్కర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ (సర్వీసులు) మువ్వా రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు చేయూత

- రీజనల్ సమావేశంలో యూబీఐ సీఈవో మణిమేఖలై

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు చేయూతనిస్తూ..ఖాతాదారులు 'ఇష్టపడే బ్యాంకు'గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈవో మణిమేఖలై అన్నారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, ఒంగోలు, నరసరావుపేట రీజియన్ల సమావేశం శుక్రవారం విజయవాడ టౌన్ హాలులో జరిగింది. సీఈవో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సైతం బ్యాంకును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఖాతాదారుల ఆధారంగా వ్యాపార విస్తరణ, మార్కెట్ వాటా, లాభదాయకతను పెంచుకునేందుకు ఫోకస్డ్ విధానంతో కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 2024 మార్చి నాటికి 21.50 ట్రిలియన్ల గ్లోబల్ వ్యాపారాన్ని సాధించి అం



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కాన్ క్లేవ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న బ్యాంక్ సిఈవో మణి మేఖలై

తర్జాతీయంగా 3వ అతిపెద్ద బ్యాంకుగా అవతరించాలని లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ఇందుకోసం 100 రోజుల అజెండాతో, నాలుగు ముఖ్య లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు. అబ్ నారీ కి బారీ పథకం కింద 2023 జూలై 31 నాటికి 1.25 లక్షల మహిళా పారిశ్రామికవేత్తలకు, కృషి కే సాథ్ మహిళా వికాస్ పేరిట కనీసం 50 వేల మంది వ్యవసాయ ఔత్సాహికులకు పెద్ద ఎత్తున ఆర్థిక చేయూతనివ్వనున్నామని చెప్పారు.

విజయవాడకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం (సీఎస్ఈ) ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు జవహర్ బాలభవన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌ను తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా కార్యాలయాలను ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ఏజీ ఆఫీస్ కాంప్లెక్స్‌లోకి మార్చనున్నారు.

సంక్షేమ గురుకులాల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జూన్ 6వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధీనంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు ఐఐటీ/నీట్ అకాడమీల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈ సొసైటీ సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాజిల్లా ఈడుపుగల్లు, గుంటూరు జిల్లా అడవితక్కెళ్లపాడు, కర్నూలు జిల్లా చిన్నటేకూరు, విశాఖపట్నం జిల్లా మధురవాడ అకాడమీల్లో వివిధ సబ్జెక్టుల్లో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు జూన్ 6వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు.

ఖాళీల వివరాలు...

ఐఐటీ/నీట్ అకాడమీ/సీఓఈ	మ్యాథ్స్	ఫిజిక్స్	కెమిస్ట్రీ	బాటనీ	జువాలజీ
మధురవాడ, విశాఖపట్నం	1	2	2	1	1
ఈడుపుగళ్లు, కృష్ణా	1	-	1	-	1
అడవితక్కెళ్లపాడు, గుంటూరు	-	1	-	-	1
చిన్నటేకూరు, కర్నూలు	1	-	1	-	-
మొత్తం	3	3	4	1	3



నేడు 6 జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికత్'

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం (మే 27న) పీఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం తెలిపారు. ఈపీఎఫ్ యాక్ట్‌లో పథకాలు, సేవలపై వాటాదారులకు అవగాహన కల్పించేందుకు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలులో శని వారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశాలు నిర్వహిస్తామన్నారు. యజమానులందరు విధిగా హాజరై ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా అధికా రులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాడే పల్లిలోని కుంచనపల్లి అరవింద ఉన్నత పాఠశాల, కృష్ణా జిల్లా పామర్రులోని సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, ఒంగోలులో కర్నూలు రోడ్డులోని శ్రీశారదానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, జగ్గయ్యపేట జయంతిపురంలోని రామ్‌కో సిమెంట్స్, బాపట్ల జిల్లా ఇంకొల్లులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, సత్తెనపల్లిలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి.

టీడీపీ కార్యకర్తల అరాచకం

- ఇళ్ల పట్టాల లబ్ధిదారులు వెళ్తున్న బస్సుపై రాళ్లతో దాడి
- పగిలిన అద్దాలు.. బాలుడికి గాయాలు
- తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి

తాడేపల్లిరూరల్/తాడికొండ: వెంకటపాలెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు అక్కచెల్లెమ్మలు నీరాజనం పట్టడంతో తట్టుకోలేని టీడీపీ వర్గీయులు అరాచకం సృష్టించారు. కొంత మందికి మద్యం తాపించి, బస్సుపై రాళ్ల దాడి చేయించారు. ఈ దాడిలో బస్సు వెనుక అద్దాలు పగిలాయి. నులకపేట నుంచి బస్సులో తల్లితో పాటు వచ్చిన ఓ బాలుడి మెడకు తీవ్ర గాయమైంది. ఎర్రబాలెం ఇండస్ట్రియల్ కాలనీలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి చేసిన వారు



బస్సుపై దాడిచేసిన వారిని పట్టుకున్న పోలీసులు

బైక్‌పై పారిపోతుండగా స్థానికులు వారిని అడ్డగించారు. బస్సులోని వారు దిగి ఎందుకు రాళ్లతో దాడి చేశారని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెబుతూ వారిపై తిరగబడే ప్రయత్నం చేశారు. మంగళగిరి రూరల్ సిఐ నాగభూషణం సంఘటనా స్థలానికి చేరుకుని దాడికి పాల్పడిన వారిని ప్రశ్నించారు. 'మాది వెంకటపాలెం. మా పేర్లు బొల్లిబోయిన హరికృష్ణ, యల్లమల్ల సుబ్బారావు. బస్సు మమ్మల్ని ఢీకొట్టబోయింది. దీంతో మాకు కోపం వచ్చింది' అని తెలిపారు. వారిద్దరూ మద్యం మత్తులో ఉండటంతో పోలీసులు అంతకు మంచి విచారించలేదు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగానే వారు అక్కడ నిద్రపోయారు.

రైతుల ముసుగులో దాడి

సీఎం వైఎస్ జగన్ సభకు వెళ్లి పలువురు తిరిగి వస్తుండగా తుళ్లూరులోని అమరావతి రైతుల దీక్షా శిబిరం వద్ద రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు ఒక్కసారిగా నల్ల బెలూన్లు, రిబ్బన్లతో దూసుకొచ్చి సీఎం డౌన్ డౌన్.. అంటూ నినాదాలు చేశారు. అదే సమయంలో మేడికొండూరు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లాం చిన్న రాయప్ప 'జై జగన్..' అని నినదించడంతో అక్ష లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు, మహిళలు దాడి చేశారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు దగా

- సీఆర్డీఏ పరిధిలో 50 వేలకు పైగా సీఎం జగన్ ఇళ్లపట్టాలిచ్చారు
- 5,024 టిడ్కో ఇళ్లను కూడా అందించారు
- ప్రజలు బాబు నైజాన్ని గ్రహించారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయెల్

సాక్షి, అమరావతి: టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు ప్రజలను దగా చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్ సీఆర్డీఏ పరిధిలో 50,793 మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడంతోపాటు 5,024 టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించారని కొనియాడారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో శుక్రవారం బొమ్మి ఇజ్రాయెల్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు టిడ్కో ఇళ్ల బండారాన్ని సీఎం జగన్ కళ్లకు కట్టినట్లు ప్రజలకు తెలియజేశారన్నారు. దీంతో చంద్రబాబు అసలు నైజం ప్రజలకు అర్థమైందన్నారు. చంద్రబాబు హయాంలో 300 చ.అ. ఫ్లాటు కట్టడానికి అయిన వ్యయం అడుగుకి రూ.2 వేలు అనుకుంటే దాదాపుగా రూ.5.75 లక్షలు అవుతుందని తెలిపారు. మౌలిక సదుపాయాల కోసం మరో రూ.1 లక్ష అవుతుందని చెప్పారు. రూ.6.75 లక్షలు ఖర్చయ్యే ఫ్లాట్‌లో.. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షన్నర ఇస్తుందన్నారు. మిగిలిన రూ.3 లక్షలను పేదలు బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకుని 20 ఏళ్లపాటు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున కట్టుకుంటూ పోవాలన్నారు. 20 ఏళ్లలో ఈ అప్పు వడ్డీతో కలిసి తడిసిమోపెడై ఒక్కో లబ్ధిదారు మొత్తం రూ.7.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వాస్తవాలను సీఎం జగన్ పట్టాల పంపిణీ సభలో ప్రజలకు తెలియజేశారన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణ విలువ రూ.443 కోట్లు..

సీఎం జగన్ లబ్ధిదారులకు అందించిన టిడ్కో ఇళ్ల నిర్మాణ విలువ రూ.443 కోట్లు అని బొమ్మి ఇజ్రాయెల్ తెలిపారు. వారంలో గృహప్రవేశాలు చేయించి, వారికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపేణా ఒక్కో ఫ్లాట్‌పై రూ.1.50 లక్షలు చొప్పున ఇచ్చింది రూ.75 కోట్లు మాత్రమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ 5,024 ఫ్లాట్ల మీద మరో రూ.251 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

అవనిలో సగం.. ఆకాశంలో సగం.. ఏరంగంలోనైనా రాణిస్తాం.. అని నిరూపిస్తున్నారు నేటి నారీమణులు. ఒకప్పుడు వంటింటి కుందేళ్లుగా అణచివేతకు గురైన మహిళలు ఇప్పుడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ 'మేము సైతం' అంటూ దూసుకుపోతున్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని అందిపుచ్చుకుని అర్చకత్వంలోనూ రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో శుభకార్యాలు చేస్తూ విశిష్ట గౌరవాన్ని సంపాదించుకుంటున్నారు. ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.. పిచ్చాటూరు మండలం, కీళ్లపూడి గ్రామానికి చెందిన మహిళా అర్చకులు.

కీళపూడిలో గృహ ప్రవేశంలో అర్చకులుగా కల్పన



కీళపూడి శ్రీజలకంఠేశ్వరునికి హారతి ఇస్తున్న అర్చక స్వాములు నాగవేణి



సంప్రదాయం పాటిస్తూ.. అర్చకులుగా 'రాణి'స్తూ..!

- అర్చకులుగా తల్లి, కుమార్తె, మనవరాలు
- ఆలయాలతో పాటు శుభకార్యాలకు అర్చకత్వం
- ఏరంగంలోనూ తీసిపోమంటున్న బ్రాహ్మణ కుటుంబం
- మూడు దశాబ్దాల సంప్రదాయం

- సాక్షి, తిరుపతి డెస్క్

పిచ్చాటూరు మండలం, కీళపూడిలో శ్రీభవానీదేవి సమేత జలకంఠేశ్వరాలయం, శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాలతో పాటు, పిచ్చాటూరులోని శ్రీనాగాలమ్మ దేవాలయాల్లో నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. ఆయా ఆలయాల్లో కీళ్లపూడి గ్రామానికి చెందిన మహిళా అర్చకులే పూజలు చేస్తుంటారు. పురాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నారు.

1993 నుంచి నిత్య పూజలు

1990లో అరణియార్ జలాశయం మధ్యలో కీళపూడి గ్రామానికి చెందిన హరిశ్చంద్ర రాజు పొలాన్ని దున్నుతుండగా శివలింగం బయటపడింది. ఈ శివలింగాన్ని ప్రాజెక్టు ఒడ్డున ఓ రావి చెట్టు కిందకు తరలించారు. మూడేళ్ల తర్వాత ఆ చెట్టు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అరణియార్ ప్రాజెక్టు జలం(నీరు) కింద శివలింగం లభించినందున శ్రీ భవానీ దేవి సమేత జలకంఠేశ్వర స్వామిగా నామకరణం చేశారు. ఇలా ఏర్పడ్డ ఈ ఆలయంలో నిత్యపూజలకు అదే గ్రామంలోని ఓ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సరోజమ్మను అర్చకురాలిగా నియమించారు. అలా మొదలైన ఈ అర్చకత్వం తన భర్త బతికి ఉన్న సమయంలో ఆయన ద్వారా అర్చకత్వం అభ్యసించారు. సరోజమ్మ తన పౌరోహిత పటిమతో ఆలయ అభివృద్ధికి తోడ్పడారు. ఆ సమయంలో ఆమెకు ఏడేళ్ల వయస్సు గల మనవడు సుబ్రమణ్యం, ఎనిమిదేళ్ల వయస్సు ఉన్న మనవరాలు కల్పన పూజలకు సహకరించేవారు. 2013లో మనవరాలు కల్పనకు వివాహం జరిగింది. 2014లో సరోజమ్మ కుమార్తె నాగమణి నాగమణి సైతం తల్లితో కలిసి జలకేశ్వర స్వామి ఆలయంలో నిత్యపూజల్లో పాల్గొంటూ అర్చకత్వం వైపు అడుగులు వేశారు. మనవరాలు కల్పన 2015లో తన భర్తతో కలిసి కీళపూడికి విచ్చేసి ఇక్కడే కాపురం పెట్టారు. ఆపై వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా 2017 అక్టోబర్ 8న సరోజమ్మ శివైక్యం చెందారు. అప్పటి నుంచి తన మేనత్త నాగమణి, కోడలు కల్పన జలకంఠేశ్వర ఆలయంలో అర్చక స్వాములయ్యారు. తదనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా షిర్డీ సాయిబాబా ఆలయాన్ని కూడా నిర్మించారు.



పిచ్చాటూరు మండలం కీళపూడిలో అభయ అంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకురాలు కల్పన



పిచ్చాటూరు నాగాలమ్మ ఆలయ కుంభాభిషేకంలో మంత్రి దంపతులు, ఎమ్మెల్యే పేరిట అర్చన చేస్తున్న కల్పన

ఆధ్యాత్మిక 'కల్పన'

అదే గ్రామానికి చెందిన వెంకట్రాజు రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్. ఉద్యోగ విరమణతో వచ్చిన రూ.9 లక్షల పాటు దాతల విరాళంతో 2019లో శివాలయం పక్కనే శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో అర్చకత్వ బాధ్యతలను కల్పనకు అప్పజెప్పారు. 2020లో పిచ్చాటూరు టీచర్స్ కాలనీ సమీపంలో స్వయంభు శ్రీ నాగాలమ్మ ఆలయం ఏర్పడగా.. అందులోనూ ఆమెనే అర్చకులుగా నియమించారు. ప్రస్తుతం ఈ రెండు ఆలయాల్లో కల్పన అర్చకులుగా నిత్య పూజలు చేస్తుండగా, శ్రీ జలకంఠేశ్వరాలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో నాగమణి అర్చకత్వం వహిస్తున్నారు.

అభివృద్ధి పథంలో ఆలయాలు

మహిళా అర్చకులుగా ఉన్న ఆలయాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. సెంటు భూమిలో రేకుల షెడ్డులో ప్రారంభమైన కీళపూడిలోని శ్రీ జలకంఠేశ్వర ఆలయం ప్రస్తుతం సుమారు ఎకరం విస్తీర్ణంలో శివాలయంతో పాటు షిర్డీ సాయిబాబా ఆలయం, అనుబంధంగా ఓ కల్యాణ మండపం రూపుదిద్దుకుంది. ఆలయ సత్రంలో వివాహాలు, శుభకార్యాలు, తిరుమల యాత్రికులు సేద తీరడానికి విడిదిగా ఉపయోగపడుతోంది. పక్కనే ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం మండలం ప్రారంభంలో, రోడ్డుకు ఆనుకొని ఉంది. ఈ కారణంగా భక్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు ఇక్కడ ఆపి పూజలు చేసి వెళ్తుంటారు. వీరందరూ కల్పన అర్చకత్వాన్ని అభినందించి ప్రోత్సహించడం విశేషం. ఇక నాగమ్మ ఆలయ కుంభాభిషేకానికి గత నెల రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు.

శుభకార్యాలకు అర్చకత్వం

ఆలయాల ద్వారా సుపరిచితులైన కల్పనను గృహ ప్రవేశాలు, సత్యనారాయణ వ్రతం, గణపతి హోమం వంటి పూజలకు ఆహ్వానిస్తుంటారు. ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవాలకు సైతం ఆమె హాజరై అర్చకత్వం వహిస్తుంటారు. వీటితో పాటు పెళ్లిళ్లు సైతం జరిపిస్తుంటారు.

అందరి ప్రోత్సాహం వల్లే



నా భర్తతో పాటు అందరి సహకారం వల్లే అర్చకత్వంపై ఆసక్తి పెరిగింది. దేవునిపై భక్తి శ్రద్ధలతో చేసే పని ఏదైనా నిష్ఠతో చేయాలన్నదే మా పెద్దలు నాకు నేర్పించారు. స్వామి వారి సేవలో అర్చకురాలిగా కొనసాగడం దేవుడు ఇచ్చిన వరం. రుతుక్రమం సమయంలో ఆలయానికి, అర్చకత్వానికి దూరంగా ఉంటా. గత ఏడేళ్లుగా గృహ ప్రవేశాలు, గణపతి హోమం, సత్యనారాయణ వ్రతం, ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవాలకు వెళ్తున్నా.

-కల్పన, అర్చకురాలు, కీళపూడి గ్రామం

అమ్మ అర్చకత్వాన్ని కొనసాగిస్తా



మా అమ్మ సరోజమ్మ నాకు అప్పజెప్పిన అర్చకత్వాన్ని నా చివరి జీవితం వరకు కొనసాగిస్తాను. శ్రీ జలకంఠేశ్వర స్వామికి సేవచేస్తూ, ఆలయానికి వచ్చే భక్తులకు సేవలందిస్తా. ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

-నాగమణి, అర్చకురాలు, కీళపూడి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943